# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18, సంచిక: 11, నవంబర్ 2025

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18 సంచిక: 11

**సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040-27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| కార్తీక దీపాలు – పాపహరణాలు | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| మహనీయం–మహత్తరం – శివకేళవాద్వైతం కార్తీకం | 22 |
| తరిగొండ వేంగమాంబ | 25 |
| స్కంద షష్ఠి | 28 |
| రామాయణ రత్నాకరం | 30 |
| ముకుందమాల | 36 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 38 |
| మీ ప్రశ్న – మా సమాధానం | 43 |
| శ్రీవారి హృదయం... | 44 |
| కనగ కనగ కమనీయం, రమణీయం శ్రీ పద్మావతీదేవి బ్రహ్మోత్సవ పంచమీ తీర్థ వైశిష్ట్యమ్ | 49 |
| కార్తీకంలో వనభోజనాలు | 51 |
| తిరుమల సర్వస్వం | 52 |
| పుణ్య పౌర్ణమి | 55 |
| మహాపతివ్రత లూయీా | 57 |
| వాక్కు మౌనం, మనో మౌనంతో ధ్యానం చేయాలి | 59 |
| బాధ్యతలను విస్మరించడం భగవంతుడికైనా నేరమే | 61 |
| మంచి నీతి కథ | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# మనస్సే ప్రధానం

మానవునికి మనస్సే ప్రధానము. మనస్సును నిగ్రహించగలిగినవారు మహానుభావులుగా కీర్తించబడుదురు. మనం చేసే, చూచే ప్రతి పని మనస్సుపై ప్రభావం చూపుతుంది. ఆ ప్రభావం హితకరమైనది లేదా హాని కలిగించునది కూడా ఉండవచ్చును. దీనిని మనస్సులో విశ్లేషించి మంచిని మాత్రమే గ్రహించువాడు ధన్యుడు. చాలామంది భారత, భాగవతాది పురాణాలను చదివి ఉండవచ్చును. అందులో మనిషి నడవడి గురించిన ఎన్నో విషయాలు స్పష్టంగా తెలుపబడ్డాయి. ఎవరు ఆ విషయాలను వారి జీవితానికి అన్వయించుకుని జీవించువాడు ధన్యుడు. మనస్సు గుఱ్ఱం లాగా విషయ వాసనల వైపు పరిగెడుతుంది. అది దాని స్వభావము. కాని దానిని కట్టడి చేయుట మానవుని స్వభావంగా గుర్తించాలి. కళ్ళెం లేని గుఱ్ఱమును ఎక్కినట్లైతే ఆ గుఱ్ఱమును అదుపు చేయలేక గమ్యస్థానం చేరుకోలేము. లేదా ఎక్కడో ఒక దగ్గర పడిపోవడం జరుగుతుంది. కాబట్టి అదుపు చేయగలిగే గుఱ్ఱమునే స్వారీ చేయాలని పెద్దలంటుంటారు. అలాగే జీవితంలోని కోరికలను కూడా ఎప్పటికప్పుడు అదుపు చేస్తూ, వాటిని సరైన దారిలో ఇతరులకు, లోకానికి, చివరికి మనకు హాని జరగని విధంగా మన నడవడి ఉండాలి. ఇలా కష్టపడి మనస్సును, అరిషడ్వర్గాలను అదుపు చేసినప్పటికీ ఒక్కొక్క పర్యాయము పరిస్థితుల ప్రభావము వలన మళ్ళీ అవి అదుపుతప్పే ప్రమాదం ఉన్నది. కాబట్టి జాగ్రత్తగా నడుచుకొనువాడు ధన్యుడు. పూర్వం యయాతి కొడుకు నహుషుడు మంచి భక్తుడు, సత్సంప్రదాయం, చక్కని నడవడి కలవాడు. దేవతలే ఇతని నడవడి గురించి మెచ్చుకున్నారు. కాలక్రమేణా ఇతడు ఒక పర్యాయం దేవతల రాజు ఇంద్రుడిగా ఎన్నుకోబడ్డాడు. అప్పుడు పరిస్థితుల ప్రభావం వలన నహుషుడు తన మనస్సును అదుపు చేయలేకపోయాడు. ఫలితంగా అహంకారం, కోరికలకు వశుడైనాడు. చివరికి దుష్ట కోరికలను కోరి భూలోకమున సర్పమై కొన్ని వేల సంవత్సరములు సంచరించాడు. ఈ విధంగా పతనమగుటకు తన మనస్సును అదుపులో పెట్టుకొనలేకపోవుటే కారణం అని గుర్తించాలి. కాబట్టి అదుపు చేసిన మనస్సును ఎట్టి పరిస్థితులలోనూ వదలకుండుట మన కర్తవ్యం. సాధన చేస్తే మనస్సును అదుపు చేయగలము. నహుషుడు వంటివాడే చెడిపోయాడు, ఇక మనం జయించగలమా? అనే సందేహం రావచ్చును. ఇది నిజమే! కాని ఎవరైతే సదా శ్రీవేంకటేశ్వరుని, హరినామ స్మరణ చేస్తూ ఉంటారో... వారికి మనస్సును అదుపు చేయడం మరియు దానిని అలాగే కాపాడుకొనుట అంత కష్టమైన పని కాదు. హరి స్మరణ ఎప్పటికీ మనలను కాపాడుతుంది. నిరంతరం హరిస్మరణ చేసినవాడు కాబట్టే పతనమైన నహుషుడు తిరిగి ఉద్ధరించబడ్డాడు, మరియు ఆయన కీర్తి ప్రతిష్ఠలు నేటికీ కొనియాడబడుతున్నాయి. కాబట్టి ఈనాడు, ఈ కలియుగములో మనస్సును నియంత్రించాలన్నా, అరిషడ్వర్గాలను జయించాలన్నా, ధర్మమార్గం వైపు పయనించాలన్నా, సంఘంలో ఇతరులకు హాని చేయకుండా సత్ప్రవర్తనతో జీవించాలన్నా, చివరికి ధర్మబద్ధమైన మన కోరికలు తీరాలన్నా హరినామ స్మరణే ఏకైక మార్గం. కాబట్టి సదా శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిద్దాం! మనీషిగా జీవిద్దాం! నమో వేంకటేశాయ!

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________

______________________

చిరునామా:______________________

______________________

______________________

______________________


______________________

పిన్‌కోడ్:______________________

చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

శ్లో ॥పార్థాయ తత్సదృశ సారథినా త్వయైవ
యౌ దర్శితౌ స్వచరణౌ శరణం వ్రజేతి ।
భూయోఽపి మహ్య మిహ తౌ కరదర్శితౌ తే
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥

తాత్పర్యం – వేంకటేశ్వరా! నీ పూర్వ అవతార పురుషుడైన శ్రీకృష్ణుడు అర్జునునకు 'శరణు పొందుము' అని చూపించిన పాదములనే ఈనాడు నాకు నీవు 'శరణు పొందుము' అని చూపించుచున్నావు. అట్టి పాదములను రక్షకముగా పొందుచున్నాను.


శ్లో॥ మన్మూర్ధ్ని కాళియఫణే వికటాటవీషు
శ్రీవేంకటాద్రి శిఖరే శిరసి శ్రుతీనామ్ ।
చిత్తేప్యనన్య మనసాం సమ మాహితౌ తే
శ్రీవేంకటేశ చరణం శరణౌ ప్రపద్యే ॥

తాత్పర్యం – వేంకటేశ్వరా! నా తలపై, కాళీయుని పడగలపై,కఠినమగునేలగలఅడవులయందు,వేంకటాచల శిఖరముపై వేదములే శిరస్సుగా కీర్తింపబడుచున్న ఉపనిషత్తులలో, అనన్య భక్తుల మనస్సులో సమముగా ఉంచబడిన నీ పాదములను శరణు పొందుచున్నాను.



# ముక్తిమార్గము

భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య



## దేవగాంధారి

భారమైన వే(పమాను – పాలువోసి పెంచినాను
తీరని చే(దే కాక – తియ్యనుండీనా || పల్లవి ||

1. పాయ(దీసి కుక్కతోక – బద్దలువెట్టి బిగిసి
చాయకెంత గట్టినాను – చక్కనుండీనా?
కాయపు వికార మిది – కలకాలము( జెప్పినా
పోయిన పోకలే కాక – బుద్ధి వినీనా? || భార ||

2. ముంచి ముంచి నీటిలోన - మూల నాన(బెట్టుకొన్నా
మించిన గొడ్డలి నే(డు – మెత్తనెయ్యీనా?
పంచమహాపాతకాల – బారి(బడ్డ చిత్త మిది
దంచి దంచి చెప్పినాను – తా(కి వంగీనా?
|| భార ||

3. కూరిమితో( దేలు(దెచ్చి – కోకలోన బెట్టుకొన్నా
సారెసారె గుట్టుగాక – చక్కనుండీనా?
వేరులేని మహిమల – వేంకట విభుని కృప
ఘోరమైన ఆసమేలు – కొరసోకీనా?
|| భార ||



భావము – పెద్ద వేపచెట్టుకు కమ్మని పాలువోసి పెంచినను అందు తరగని చేదే పొడసూపునుగాని అది తియ్యగా నుండదు కదా!


కుక్కతోక వంకరగా నుండుట సహజము. దాని వంకర తొలగునట్లు ఈడ్చిపట్టి వెదురు మున్నగు దబ్బలతో బిగించి క్రిందికి నేరుగా నుండునట్లు ఎంతగా కట్టినను అది చక్కగా నుండదు కదా! అట్లే ఈ శరీరమునకు పెడత్రోవ నడుచుట స్వభావమై ఉన్నది. దీనికెంతకాలము బోధించినను అది పోయిన దారినే పోవుచుండును గాని మనము చెప్పిన బుద్ధి వినదు.

గొడ్డలికి కాఠిన్యము సహజము. నీటిలో ఎవ్వరికిని అందుబాటులో లేని లోతైన చోట ముంచి ముంచి నానబెట్టినను అది మెత్తబడదు కదా! అట్లే ఈ మనస్సు పంచమహాపాతకముల కలవడి యున్నది. ఎంతగా నొక్కి నొక్కి చెప్పినను మన మాటలు దానికి సోకి అది మంచి త్రోవకు వచ్చుట లేదు.

తేలును ప్రేమతో దెచ్చుకొని ఒడిలో పెట్టుకొన్ననూ మాటి మాటికీ కుట్టునే కాని ఊరకుండదు. కాన ఇతర వస్తువులపై ఆశ వదలి చెడు సోకని దొడ్డ మహిమలు గల శ్రీవేంకటేశ్వరుని దయకై పెద్దగా ఆశ పడుట మేలు. అట్టివారికే విషయమునను ఎట్టి కొరతయు నుండదు. భగవత్కృపపై ఆశ పెట్టుకొనుట వలన కలుగు మేలు ఎప్పుడును కొఱతపడదని భావము.

# కార్తీక దీపాలు – పాపహరణాలు

: చిల్లర సీతారామారావు



కార్తీక మాసం చాలా పవిత్రమైన మాసం. కార్తీకమాసం హరిహర స్వరూపం. అల్పసేవకు అనంత ఫలమును ప్రసాదించగల మాసం కార్తీకమాసం. భారతీయ సంప్రదాయమున దీపదర్శనానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. దీపం మానవునికి స్ఫూర్తినిస్తుంది. తాను వెలుగుతూ, జగత్తుకు వెలుగును పంచాలని, తాను జ్వలిస్తున్నా జగత్తునందలి చీకటిని పారద్రోలాలనే ప్రేరణ దీపము నుండి మానవునకు లభిస్తుంది.

దీపం వెలిగేచోట లక్ష్మీదేవి నివసిస్తుంది. దీపారాధన వల్ల జ్ఞానం వి కసిస్తుంది. దీప ప్రజ్వలన వలన ఉత్తమ లోకాలు, ఉత్తమ గతులు లభిస్తాయి. దీపశక్తికి విఘ్నకారకులయిన తామస శక్తులు – రాక్షస, భూత, ప్రేత, పిశాచాలు దరికి చేరవు. దీపం చీకట్లను పారద్రోలుతుంది. దీపం ప్రసాదించు వెలుగులోనే సమస్త పనులు సులభంగా జరిగిపోతాయి.

శ్లో ॥ "దీపంజ్యోతిః పరబ్రహ్మ దీపం సర్వతమోపహరమ్
దీపేన సాధ్యతే సర్వం దీపలక్ష్మీ నమోస్తుతే"

దీపము జ్యోతి స్వరూపమైనది. అదియే పరబ్రహ్మము. దీపం చీకటిని పారద్రోలుతుంది. దీపము వలననే సమస్త కార్యములు సుగమములవుతున్నాయి. దీపలక్ష్మీ నీకివే మా వందనాలు.

దీపము తేజోమయము. ధర్మార్థ మోక్షక సాధనము. హైందవ సంస్కృతిలో ఏ పూజ చేసినా దీపమును వెలిగించుట అనునది సనాతన ఆచారము. దీపమును వెలిగించి భగవంతుని పూజించడమును దీపారాధన అని పిలువబడుతుంది. దీపమును వెలిగించి దేవుడికి చూపిస్తారు. దీపపు కుందికి మూడు చోట్ల కుంకుమ బొట్లు పెట్టి అక్షతలు వేస్తారు. భగవంతుడి ప్రతిమకు కుడివైపు దీపపు కుందిని ఉంచుతారు. దీపమును పూజ అయ్యేంతవరకు ఆరిపోకుండా చూచుకోవాలి. దీపం ఆరిపోతే 108 సార్లు 'ఓం నమశ్శివాయ' అని జపించి దీపమును వెలిగించాలి. దీపమును పూజిస్తే శత్రు, రోగ, ఋణ బాధల నుండి విముక్తి లభిస్తుంది. దేహమునకు వర్చస్సు లభిస్తుంది. దీపములు లేకుండా దీపావళి పర్వమును ఊహించలేము. దీపావళి అంటే దీపముల సమూహము. దీపావళి అమావాస్య నాడు దీపములను వెలిగించడం శుభకరం. దీపావళి రోజున లక్ష్మీదేవిని పూజించిన తరువాత ఇంటిముందు, వీధి కూడలిలో, నదీతీరములో, దేవాలయాదులలో, ఇంట్లోని ప్రతి గదిలో దీపమును వెలిగించాలి. ఈ దీపాల ద్వారా లక్ష్మీదేవి ఇంట్లోకి ప్రవేశిస్తుంది.

సాయంకాలం దీపం వెలిగించి, ఆ దీపం రాత్రంతా వెలిగేలా చూచుకుంటే ఆ ఇంటికి ఎంతో క్షేమం. ఎలాంటి ఆపదలు ఉన్నా తొలగిపోతాయి. సాయం సంధ్యా సమయంలో దీపాలు వెలిగిస్తే ఆ ఇంట దైవీశక్తులు ఉంటాయి. దైవీశక్తులు ఉన్న ఇంట్లో నిరుత్సాహం, రోగాలు, కలహాలు, దరిద్రం మున్నగునవి ఉండవు. శుక్రవారం సర్వపాప నివారణ నిమిత్తం కనకధారా స్తోత్రమును చదువుతూ దీపములను వెలిగించి పూజచేస్తే శ్రీలక్ష్మీదేవి అనుగ్రహం ప్రాప్తిస్తుంది. దీపము నుండి వెలువడే కాంతిని చూడటం వలన కంటి నరాలకు బలం చేకూరుతుంది. దీపం నుండి వెలువడు పొగ వలన, నరాలు పుంజుకుంటాయి. వెలిగించిన దీపములను తూర్పు ముఖముగాను, ఉత్తర ముఖముగాను పెట్టినట్లయితే లక్ష్మీదేవి మన ఇంటిలోనే నివాసం ఉంటుంది. సంధ్యాసమయంలో తులసిముందు దీపమును వెలిగిస్తే లక్ష్మీదేవి అనుగ్రహం ప్రాప్తిస్తుంది. దీపం ఉన్నచోట అంతా మంగళప్రదమే. మనస్సును ఆవరించిన అంధకారమును పారద్రోలు జ్ఞానదీపికయే దీపము.

పావనమాసము కార్తీకము. ఈ మాసము నందు దీపారాధనము అత్యంత ముఖ్యమైనది. సాయంకాలం సమయమున శివాలయంలో గాని, విష్ణ్వాలయంలో గాని దీపములను వెలిగించడం, దీపదానం చేయడం వలన అనంతకోటి పుణ్యసంపద ప్రాప్తిస్తుందని కార్తీక పురాణం పేర్కొనుచున్నది. దీపం లక్ష్మీదేవికి సంకేతం. అందువలన కార్తీకమాసమున ఒకసారి దీపమును వెలిగించినా, జన్మ జన్మాంతర పాపములు నశించిపోతాయని మహర్షులు తెలియచేస్తున్నారు. కార్తీకమాసమున వేకువజాముననే లేచి భగవంతుడి ప్రతిమ సమీపమున దీపమును వెలిగించడం చాలా ముఖ్యము. ఇంటిముందు, తులసికోట దగ్గర దీపములను పెట్టడం వలన అంతులేని శుభములు కలుగుతాయి. దారిద్ర్యము తొలగిపోతుంది. తెల్లవారు జాముననే లేచి కన్యలు, వివాహితలు, గంగాభాగీరథీ సమానులైన స్త్రీలు, పురుషులు, పిన్నలు, పెద్దలు అందరూ దగ్గరలో ఉన్న జలాశయమునకు వెళ్ళి స్నానము చేసిన తరువాత అరటిబోదెలు, దొప్పలు, దోనెలు మున్నగువాటిలో నూనె పోసి వత్తి వేసి వెలిగిస్తారు. వెలిగించిన దీపమును నీళ్ళలో విడిచి పెడతారు. అలా విడిచి పెట్టడం వలన పుణ్యం ప్రాప్తిస్తుందని, కన్యలకు మంచి భర్త లభిస్తాడని, వివాహితలకు భర్త క్షేమంతో పాటు సకల సుఖశాంతులు, సంపదలు లభిస్తాయని ప్రబల విశ్వాసము.

దీపములకు వెండి, కంచు, రాగి, మట్టి ప్రమిదలను ఉపయోగించడం శ్రేష్ఠం. ఎట్టి పరిస్థితులలోనూ ఇనుము, స్టీలుతో చేసిన వాటిని ఉపయోగించకూడదు. వెండి ప్రమిదలు శ్రేష్ఠము. కంచు ప్రమిదలు మధ్యమము, రాగి ప్రమిదలు మోక్షకరము, ఇత్తడి ప్రమిదలు అధమము, దీపపు ప్రమిద – ఇది చేయరాదు, ఇది చేయవచ్చు అను దానికి, ప్రమిద లోని తైలము వైరాగ్యమునకు, వెలుతురుకు ఆధారమైన వత్తి భక్తికి ప్రతీకలు. దీపములను ఆవు నేతితో వెలిగిస్తే ఆరోగ్యానికి మంచిది. నువ్వులనూనెతో వెలిగిస్తే మంగళకరము. శుభప్రదము. దీపములను వెలిగించి దేవాలయములో గోపురం దగ్గర, మండపం దగ్గర, ఆలయం శిఖరం దగ్గర ఉంచితే సమస్త పాపముల నుండి విముక్తి లభిస్తుంది. విష్ణుభగవానుని కొరకు నువ్వులనూనెతో దీపమును పెట్టినచో సకల సంపదలు లభిస్తాయి. దీపములను వెలిగించడానికి ఒకసారి వెలిగించిన వత్తిని తిరిగి వాడకూడదు. క్రొత్త వత్తితోనే దీపములను వెలిగించాలి. ప్రత్తితో తయారు చేసిన వత్తులను వెలిగిస్తే దైవభక్తి అధికమవుతుంది. అరటినారతో తయారు చేసిన వత్తులను వెలిగిస్తే సత్సంతానము కలుగుతుంది. తామర తూడులతో తయారు చేసిన వత్తులను వెలిగిస్తే సమస్త పాపములు నశించిపోతాయి. ఒక్క దీపమును ఎప్పుడూ వెలిగించరాదు. అది అశుభమును కలుగజేస్తుంది. పంచ ముఖముల జ్యోతిని వెలిగించినచో సుఖసౌఖ్యాలు, భోగభాగ్యాలు ప్రాప్తిస్తాయి. మూడు ముఖముల జ్యోతిని వెలిగించడం సర్వశ్రేష్ఠము. దీనిని వెలిగించి దీపమును ఈ విధముగా ప్రార్థించాలి.

**శ్లో ॥ "సాజ్యం త్రివర్తి సంయుక్తం వహ్నినా యోజితం మయా**
**గృహాణ మంగళం దీపం త్రైలోక్య తిమిరాపహమ్**
**భక్త్యా దీపం ప్రయచ్ఛామి దేవాయ పరమాత్మనే**
**త్రాహిమాం నరకాద్ఘోరా దివ్య జ్యోతి ర్నమోస్తుతే"**

శ్రేష్ఠమైన నేతియందు, మూడు వత్తులతో వెలుగొందుచూ, మూడు లోకముల యొక్క గాఢాంధకారమును పోగొట్టగల, మంగళప్రదమైన జ్యోతి త్రయమును వెలిగించి, సర్వాంతర్యామియైన నీకు భక్తిశ్రద్ధలతో నమస్కరించుచున్నాను. దివ్యజ్యోతి స్వరూపమైన ఓ దైవమా! నన్ను ఈ ఘోర నరకము నుండి రక్షింపుము.

దీపములను ఏ దిక్కున వెలిగిస్తే ఎటువంటి ఫలితము ప్రాప్తిస్తుందో శాస్త్రములు వివరించాయి. దీప ముఖము తూర్పు దిక్కుగా ఉండుట వలన ఆయుర్వృద్ధి కలుగుతుంది. గ్రహబాధలు తొలగిపోతాయి. సమస్త దుఃఖములు తొలగిపోతాయి. దీపముఖము ఉత్తర దిక్కుగా ఉండుట వలన సిరిసంపదలు అభివృద్ధి చెందుతాయి. పడమర వైపు దీప ముఖము ఉంటే ఋణ బాధలు తీరిపోతాయి. దీప ముఖము దక్షిణ దిక్కుగా ఉంటే దుఃఖము, రోగము మున్నగు అశుభములు కలుగుతాయి.

కార్తీక మాసమున దీపారాధన సర్వశ్రేష్ఠము. దీపారాధన అనగా దీపములను వెలిగించి భగవంతుడిని పూజించడం. దీపారాధన వల్ల సమస్త మహాపాతకములు సమసిపోతాయి. ఇహపర సౌఖ్యములు ప్రాప్తిస్తాయి. పుణ్యలోక ప్రాప్తి కలుగుతుంది. ఈ మాసమున సాయం సమయమున శివాలయం, విష్ణ్వాలయములలో చేసే దీపారాధనకు అనంతమైన ఫలము ప్రాప్తిస్తుంది. ఆవునెయ్యి, నువ్వులనూనె, విప్పనూనె, నారింజనూనెలతో దీపారాధన చేసేవారు ధర్మవేత్తలు అవుతారు. శక్తిహీనులు కనీసం ఆముదపు దీపమును వెలిగిస్తే పుణ్యవంతులు అవుతారు. ఈ మాసము ముప్పది రోజులు దీపారాధన చేయాలి. ముప్పది రోజులు దీపారాధన చేయలేనివారు కార్తీక సోమవారము, పూర్ణిమ రోజులలోనైనా తప్పక చేయాలి. దీపారాధనను ముప్పది రోజులు చేసేవారు జ్ఞానవంతులై మోక్షమును పొందుతారు. దీపారాధన చేయడం వలన సుఖశాంతులు పొందడం తథ్యము. దీపావళి రాత్రిలో సగం కాలాన్ని మహా నిశాకాలమంటారు. ఆ సమయంలో దీపారాధన చేయడం వలన అక్షయ లక్ష్మి ప్రాప్తిస్తుంది. దీపావళి నాడు గృహము లోను, గృహము చుట్టూ దీపములను వెలిగించాలి. ఉదయం సాయంకాలం దీపారాధన చేయడం లక్ష్మీప్రదం. శుభప్రదం. త్రయోదశినాడు గుమ్మమునకు ఎదురుగా ఇంటి బయట దీపమునుంచి ఆరాధిస్తారు. ఈ దీపమును యమ దీపము

అని పిలుస్తారు . అపమృత్యువు నుండి తప్పించుకోవడానికి, యమధర్మరాజును సంతృప్తి పరచడానికి యమదీపమును పెట్టి ఆరాధిస్తారు.

ఏకాదశినాడుగాని, తులారాశిలోసూర్యుడుప్రవేశించిననాడు గాని, పూర్ణిమ నాడు గాని, లక్ష్మీ సహితుడైన విష్ణుభగవానుని ప్రసన్నం కోసం ఆకాశదీపమును ప్రారంభించాలి.

శ్లో ॥ "నమః పితృభ్యః ప్రేతేభ్యో నమో ధర్మాయ విష్ణవే
నమో యమాయ రుద్రాయ కాంతార పతయే నమః"

పితరులకు నమస్కారము. ప్రేతములకు నమస్కారము. ధర్మస్వరూపుడైన విష్ణువుకు నమస్కారము. యమరాజుకు నమస్కారము. దుర్గమ మార్గమున రక్షించు రుద్రునకు నమస్కారము. ఈ మంత్రమును చదువుతూ పితరులకు ఆకాశదీపమును దానము చేస్తారు. దీపదానం వల్ల నరకమున ఉన్న పితరులు ఉత్తమ గతిని పొందుతారు.

కార్తీక శుద్ధ పాడ్యమి నుండి పితృదేవతలు ఆకాశమార్గమున తమ తమ లోకములకు పయనమవుతుంటారు. మార్గమంతా అంధకారముతోనిండి ఉంటుంది. వారికి మార్గమును చూపుటకు గాని దీపములను ఏర్పాటు చేస్తారు. ఈ దీపములను ఆకాశ దీపములని పిలుస్తారు. ఆకాశ దీపములను శివాలయములలో వెలిగిస్తారు. శివాలయాలలో ఎత్తుగా ఒక గడను పాతుతారు. సాయంకాలమున మట్టితో గాని, లోహముతో గాని చేసిన ఎనిమిది రంధ్రముల పాత్రలో నువ్వులనూనె పోసి, ప్రమిదలో వత్తులు వేసి వెలిగిస్తారు. ఆ దీపపు వెలుగులు ఎనిమిది దిక్కులకు ప్రకాశమును వ్యాపింపచేస్తాయి. దీనిని ఆకాశ దీపం అని పిలుస్తారు.

కార్తీక మాసమున దీపదానము అత్యుత్తమము. ఈ మాసమున శివకేశవుల ప్రీత్యర్థం శివాలయమున గాని, విష్ణ్వాలయమున గాని దీపదానము చేయాలి. గోధుమపిండితో ప్రమిదను చేసి, ఆవునెయ్యితో నింపాలి. వత్తులు వేసి వెలిగించాలి. వెలిగించిన ప్రమిదను పూజించాలి. తర్వాత ఆ ప్రమిదను బ్రాహ్మణునకు దానముగా ఇవ్వాలి. ఈ విధముగా కార్తీకమాసమంతా చేయాలి. ఆఖరి రోజున వెండితో ప్రమిదను చేయించాలి. వత్తిని బంగారముతో చేయించాలి. గోధుమ పిండితో చేసిన ప్రమిదను ఏ బ్రాహ్మణునకు నెలరోజులు దానము చేస్తున్నామో ఆ బ్రాహ్మణునకు వెండి ప్రమిద, బంగారు వత్తితో పాటు దానము చేయాలి. దానము నిచ్చునప్పుడు ఈ క్రింది శ్లోకమును చదువుతూ దానము నివ్వాలి.

శ్లో ॥ "సర్వజ్ఞానప్రదం దీపం సర్వసంపత్సుఖావహం
దీపదానం ప్రద స్వామి శాంతిరస్తు సదామమః"

అన్ని విధముల జ్ఞానము కలుగచేయునదియు, సకల సంపదల నిచ్చునదియు సకల శుభములను ప్రసాదించునదియు అగు ఈ దీప దానము చేయుచున్నాము. నాకు సుఖశాంతులు లభించుగాక అని శ్లోక భావార్థము. దీపదానం చేసినవారు అక్షయమైన పుణ్యసంపదను పొందుతారు. అంతేకాక విద్య, జ్ఞానము, ఆయుర్వృద్ధి, ఇహ పర లోకములలో సమస్త భోగాలు ప్రాప్తిస్తాయి. సమస్త పాపములు నశించిపోతాయి.

దేవతార్చన సమయంలో తామస, భూత, రక్షో ముఖములైన కుత్సితపు ధూపాలన్నీ దీపారాధన వల్ల అణగిపోతాయి. అందువలన దీపదానం అధిక ఫలం ప్రసాదిస్తుంది. జ్యోతి ఊర్ధ్వగతమైనపుడే దీపదానం అంధకారమును తొలగిస్తుంది. ఉత్తరాయణమున దీపదానము ప్రశస్తం. దీపమును దానం చేసిన తర్వాత దానిని ఆర్పకూడదు. దీపమును ఆర్పువాడు అంధుడు, కాంతిహీనుడు అయి నరకమునకు పోతాడు. దీపదానం చేసినవాడు స్వర్గలోకమున దీపమాలికవలె వెలుగొందుతూ ఉంటాడు. దీపం దానం చేయువారు నేయితో నిండిన ప్రమిదను దానం చేయడం ఉత్తమమం. తైలంతో చేయడం రెండో పక్షం. అయితే కొవ్వు మొదలగు వాటివలన వచ్చిన తైలముతో దీపం చేసి దానం చేయకూడదు. దీప దానమును కొండ గుహలలోను, దేవాలయములలోను చేయడం వలన అత్యుత్తమ పుణ్యసంపద ప్రాప్తిస్తుంది. ఇతరులు పెట్టిన దీపములను అపహరించి దానం చేయడం మహాపాపం. దీపదానము చేసిన దాతకు జ్యోతిర్లోకాలు ప్రాప్తిస్తాయి. దీపదానం అనగా తేజస్సులను దానం చేయుట అని అర్థం. దీపదానం వలన మానవులకు తేజస్సు పెంపొందుతుంది.

శ్లో ॥ "శుభం కరోతు కళ్యాణమారోగ్యం ధనసంపదా
శత్రు బుద్ధి వినాశాయచ దీపర్జ్యోతి ర్నమోస్తుతే
దీపజ్యోతిః పరబ్రహ్మ దీపజ్యోతిర్జనార్దనః
దీపోహరతు మే పాపం దీపర్జ్యోతి ర్నమోస్తుతే"

ఓ దీపజ్యోతీ! నీవు మాకు శుభములు కలిగించు దానివి. కళ్యాణప్రదాయినివి. ఆరోగ్యం, ధన సంపదనిచ్చుదానివి. శత్రుబుద్ధి వినాశకారిణివి. దీపజ్యోతీ! నీవు పరబ్రహ్మవి. జనార్దనుడివి. నీవు మా పాపములను అంతం చేయు దానివి. దీపజ్యోతీ నీకు నమస్కారం.

పవిత్ర మాసమైన కార్తీకము నందు శివకేశవుల ప్రీత్యర్థం దీపములను వెలిగించడం, దీపదానం చేయడం, దేవాలయాలలో అది శివాలయమైనా, వైష్ణవాలయమైనా – దీపాలు వెలిగించడం, ఉసిరిక కాయ పైన వత్తినుంచి దీపమును వెలిగించడం, నదులలో దీపములను వదలడం, పండితునికి దీపదానం చేయడం మున్నగు కార్యక్రమములందు భక్తి శ్రద్ధలతో పాల్గొని భగవంతుడి అనుగ్రహమునకు పాత్రులమవుదాము.






32వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు



**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**


శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**— గోవింద దాసు**
**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**దిశా నిర్దేశం :**
సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 32 వ భాగపు లీలల ప్రచురణ. (**మార్చి 2019 నుండి ఆగస్టు 2020** వరకు).

### నాగాభరణం సమర్పించుట

తెలంగాణ ప్రభుత్వం ఈ మధ్యన రైతుబంధు అనే కార్యక్రమాన్ని ప్రకటించింది. నేను నా మొదటి రైతుబంధు పైసలను తీసుకున్నప్పుడు మా ఊరి జనాల కోరిక మేర మా ఊరి శివాలయమునకు వెండి నాగాభరణము చేయించి తేది 04-03-2019, శివరాత్రి రోజు శివుడికి సమర్పించాము. ఉదయం మా ఇంటినుండి ఆలయం వరకు వాయిద్యాలతో వెళ్ళి, శివుడికి, నాగాభరణానికి అభిషేకానంతరము సమర్పించాము. ఆరోజు సాయంత్రం 365 మట్టి శివలింగాలకు మహాశివాభిషేకము కూడా చేయించాము. ఆ తెల్లవారి తేది 05-03-2019 ఉదయం శివపార్వతుల కళ్యాణం జరిపించి, అన్న సంతర్పణ చేశాము. తిరిగి తేది 06-03-2019 నాడు హైదరాబాద్ వచ్చాము.

మొత్తం ఈ కార్యక్రమము జరుగుచున్నప్పుడు నేను నా స్వామివారినే దర్శించాను, తప్ప నాకు ప్రత్యేకించి ఎలాంటి అనుభూతి కలుగలేదు. కాని నా భార్యను




**చిన్న ట్యాంకులో అన్నంతో కప్పబడి ఉన్న లింగమును దర్శించుట.**

మాత్రం ఈవిధంగా కటాక్షించారు.

**తేది 05-03 -2019 కల:** అది ఒక చతురస్రాకారపు, స్వచ్ఛమై న నీటితో నిండిన పెద్ద ట్యాంకు. దాని అడుగున చతురస్రాకారపు మరొక చిన్న ట్యాంకు. ఆ చిన్న ట్యాంకులో ఒక లింగం, అది మొత్తం అన్నంతో కప్పబడి ఉన్నదట. తాను పై నుండి చూస్తున్నది. పైన మొదటి చతురస్రాకారపు ట్యాంకు లోని నీటిగుండా రెండవ ట్యాంకు లోని అన్నంతో కప్పబడిన లింగమును స్పష్టంగా చూడగలిగింది. నీరు చాలా స్వచ్ఛంగా ఉన్నవట. తాను రోమాంచితురాలై ఆనందించింది. కల చెదిరింది.

మరియు శివకళ్యాణంలో తాళి కట్టే సమయాన మేమిద్దరం ఆనందభరితమైన పులకరింతకు లోనైనాము.


## స్వామివారిని వెతుకుచు వెళ్ళుట

గత కొంతకాలంగా స్వామివారు లీలలను చూపుట లేదు. దీనికి విచారించి నేనే వారి వద్దకు వెళ్ళుటకు విశ్వప్రయత్నం చేశాను. ఏది చేస్తే స్వామివారు కరుణిస్తారో ఆలోచిస్తూ ఆ విధమైన పనులు చేయసాగాను. నా దురదృష్టం వలన గతంలో పొందిన అనుభూతులను మరచాను, వారు చెప్పిన విషయాలు గుర్తులేవు. అందుకే స్వామివారిని పొందుటకు రకరకాల ప్రయత్నాలు చేయసాగాను. అందులో ఒకటి, నేను కన్స్ట్రక్షన్ వ్యాపారమును మానివేసినప్పటికీ, కాలక్షేపము కొరకు అప్పుడప్పుడు ప్లాట్లు కొని అమ్మేవాడిని. ఈ వ్యాపారములో సంపాదించిన ప్రతి పైస తమకే వినియోగిస్తానని మాట ఇచ్చాను. ఈ డబ్బుతో మీకు ఆలయాలు నిర్మిస్తానని కూడా చెప్పాను. కాని దీనిని స్వామివారు స్వీకరించలేదు, పైగా ప్రతి లావాదేవీలో నష్టమే వచ్చేది. ఈలోగా ఒక కల కన్నాను.

**10-04-2019 కల:** ఈ కలలో నేను ఏదో వెతుకుచు దేశాటనము చేస్తున్నాను. దారిలో ఒక గ్రామము వచ్చింది. దాని పూర్వపు పేరు ఒకటి (మరచాను) ఇప్పటి పేరు ‘అందె’ అట. ఇక్కడ చాలా ప్రశాంతంగా, చల్లని వాతావరణం అని, కొంతసేపు విశ్రాంతి తీసుకొమ్మని ఆ ఊరివారు చెప్పారు. కాని నేను సమ్మతించలేదు. ఆ తరువాత నాకు 1982 లో చనిపోయిన మా పెద్దమ్మ (మా అమ్మ అక్క) భూలక్ష్మి ఆమె భర్త వెంకట్ రెడ్డి కనబడ్డారు. నేనామె తొడపై పడుకున్నట్లు అనిపించింది. కల చెదిరింది. దీనర్థం – బహుశా నేను స్వామివారిని వెతుకుచు వెళ్ళుటను చూచి మా పూర్వీకులు ఆనందించి ఉంటారు. లేదా లక్ష్మీమాత అనుగ్రహించింది.

## రెండవ కుమారుడు చి|| అరవింద్ రెడ్డి పెండ్లికి సమ్మతించుట

మా రెండవ కుమారుడు చి॥ అరవింద్ రెడ్డి అమెరికాలో




**మా రెండవ కుమారుడు చి|| అరవింద్ రెడ్డి మరియు కోడలు చి||సౌ|| ప్రనితతో మా కుటుంబం**

ఎం.ఎస్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం వీడి వయస్సు 27 సంవత్సరాలు. వీడు, వీని ఇంజనీరింగ్ బ్యాచ్ మేట్ అయిన చి॥ సౌ॥ ప్రణీతను ఇష్టపడ్డాడు. పెండ్లి చేసుకొనుటకు మా అనుమతి కోరాడు. నేను విచారములో పడిపోయాను. ఏమి చేయాలో తోచక స్వామివారిని వేడుకున్నాను. తేది 25-06-2019 నాడు అమ్మాయి తల్లితండ్రులు రామంతపూర్ నివాసులు శ్రీమాన్ గుంటుక రవీందర్ రెడ్డి మరియు రూపాదేవి మా ఇంటికి వచ్చి మాట్లాడారు. నేను తేది 29-06-2019 వరకు అభిప్రాయం చెప్పుదునని వారికి మాట ఇచ్చాను. కాబట్టి ఏం చేయమంటారో సెలవీయమని శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రార్థించాను. ఒప్పుకొమ్మని స్వామివారు ఈ విధమైన లీలను చూపారు.

**26-06-2019 కల :** ఈ కలలో నేను అమ్మాయి ప్రణీతను క్లోజప్ లో చూచాను. ఆమె నాకు సాధ్యమైనంత దగ్గరగా వచ్చి నిలబడ్డది. మా ఇంటి మనిషి లాంటి అభిప్రాయము ఏర్పడ్డది. అంటే ఆమెను ఒప్పుకోమని ఆజ్ఞాపించారని భావించాను. ఇంతే కల.

ప్రారంభించ నిర్ణయించాము. ఈలోగా ఇంటిలో జపానికి పూజలు జరుపుటకు సిద్ధమైనాము. ఈ సందర్భంగా స్వామివారు సురేఖకు ఒక చక్కటి లీలను ఈ విధంగా చూపెట్టారు.

**తేది 07-07-2019 కల :** అది ఒక పెద్ద పాము. లావుగా, పొడవుగా ఉన్నదట. దానికి ఇరుప్రక్కలా అతి సూక్ష్మంగా చిన్న చిన్న పిల్లలు కొన్ని వేల సంఖ్యలో ఉన్నవట. వాటిని చూచి సురేఖ




**మా కారణంగా స్వామి వారి కృప ఎంతో మందికి లభించినట్లు చూపుట**

ఆశ్చర్యపోయిందట ఏమిటి ఇది అని? కల చెదిరింది. తెల్లవారి నాకు తాను పొందిన కలను చెప్పింది. ఇది స్వామివారి లీల అని, రథానికి సంకేతం అని భావించాను. దీని నిజమైన అర్థం ఇలా ఉంది. ఇన్ని సంవత్సరాలు స్వామివారి సేవ చేయుట వలన వారి కృపా కటాక్షాలు మా కారణంగా ఎంతోమంది భక్తులకు లభించి విస్తరించాయని భావం.

ఆ తరువాత ఒప్పుకున్నట్లు వారి తల్లితండ్రులకు చెప్పాను. కళ్యాణం ఏర్పాట్లు ప్రారంభించాము.

## మా సేవ ద్వారా స్వామివారి కృపా కటాక్షాలు చాలామందికి లభించాయని తెలుపుట

ఈ మధ్యన తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఎలాంటి లీలలను చూపలేదు. స్వామివారికి మాపై దయ తగ్గిందనే భావన ప్రబలుతున్నది. ఇన్ని రోజులు ఆయన లీలలను చూడకుండా ఉండుట ఎప్పుడూ జరగలేదు. మాకు భారమైపోతుంది కాబట్టి రథయాత్రను నా వయసు 60 సంవత్సరాలు నిండేవరకు అంటే... 2020 వరకు మాత్రమే నిర్వహించాలనుకున్నాము. ఈ సంవత్సరం తేది 29-07-2019 నుండి రథయాత్రను

## 17వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

17వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ కొరకు తేది 29-07-2019 సాయంత్రం మా ఇంటినుండి 'నమో వేంకటేశాయ' రథయాత్ర ప్రారంభమైనది. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారు దీపారాధన చేసి

కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామివారు చక్కటి సందేశాన్ని ఇచ్చిన తరువాత రథయాత్ర ప్రారంభించాము. అన్న సంతర్పణ చేశాము. హైదరాబాద్ లో ఈ రథం 30-07-2019 నుండి 15- 08-2019 వరకు త్రిప్పాము. ఆ తరువాత కర్నూలు, గుంతకల్లు, అనంతపురం, కదిరి, మదనపల్లిలో త్రిప్పి తేది 21-08-2019 నాటి సాయంత్రం తిరుపతి చేరాము.

తేది 22-08-2019 సాయంత్రం ఇట్టి 7 కోట్ల జపమును అలిపిరి పాదాల మండపము వద్ద స్వామి పాదాలకు సమర్పించి పూజ చేశాము, స్వామివారిని మనసారా వేడుకుని స్వీకరించమని ప్రార్థించాము. తిరిగి తేది 23-08-2019 గోకులాష్టమి రోజున ఎస్.వి.డైరీఫాంలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము వద్ద 'శ్రీవేంకటేశ్వర మహామంత్ర యజ్ఞం' చేసి జపం వ్రాసిన వారిని ఆశీర్వదించమని వేడుకున్నాము. అప్పటి టి.టి.డి ఛైర్మన్ శ్రీమాన్ ఎస్.వి.సుబ్బారెడ్డి గారు ఈ యజ్ఞ పూర్ణాహుతిని కావించి, జప సమర్పణ చేశారు. మరియు 18వ పర్యాయంగా 7 కోట్ల జప సంకల్పానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆనందంగా జరిగింది. ఆ తరువాత కొండపైకి వెళ్ళి స్వామివారిని దర్శించుకొని హైదరాబాద్ వచ్చాము. దీనితో 17వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ కార్యక్రమము ముగిసింది.

## 17వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణలో స్వామివారి లీలలు

ఇప్పటినుండి స్వామివారు మాలో వీలైనంత మానసిక మార్పు తెచ్చుటకు ప్రయత్నిస్తూ, ఈ క్రింది లీలను చూపారు.

## కోరికలను త్యజించుమనే సందేశం

ఈ కల నాకు రథయాత్ర సమయాన తేది 12-08-2019 నాడు వచ్చింది. ఇది ఒక అద్భుతమైన సందేశం, ఇప్పటినుండి నా ప్రవర్తన, మానసిక ఆలోచన ఈవిధంగా ఉండాలంటూ స్వామివారు దిశానిర్దేశం చేశారు. కాని రథయాత్రలో నిమగ్నమై ఉండుట వలన వెంటనే వ్రాయలేదు. ఒక 20 రోజుల తరువాత వ్రాద్దామనుకున్నప్పుడు స్వామి ప్రసాదించిన కల విధానాన్ని మరచిపోయాను. కాని దీని తేదీని, భావమును క్లుప్తముగా వ్రాసుకున్నాను. భావము మాత్రం ఈ క్రింది విధంగా ఉంది.

**తేది 12-08-2019 కల:** ఈ కల భావం : ఇక మిగిలిన ఈ శేష జీవితములో ఏనాడూ, ఎలాంటి పరిస్థితిలో కూడా నేను దేనికైనా, ఏ విషయానికైనా టెంప్ట్ కాకూడదు. ఒక వస్తువు లేదా మరేదైనా కావలెననే కోరికను విడనాడాలి. కామ క్రోధ, లోభ, మోహ మద మాత్సర్యాలను త్యజించమని ఆజ్ఞాపించారు. ఒకవేళ నేను ఈ విధంగా చేయకపోతే, ఈ జీవితములో లక్ష్యాన్ని ఛేదించలేనని స్పష్టంగా చెప్పారు. మరియు మనస్సును అత్యంత నిలకడగా పెట్టుకొమ్మని, లేకుంటే చెడుదువని కూడా హెచ్చరించారు. ఇదే ఈ కల అర్థం. జరిగిన విధానమును మరచాను. నా అదృష్టవశాత్తు దీని భావమును అప్పుడే వ్రాసి పెట్టాను.

స్వామివారు సూచించినటులనే జీవించుదునని, అందులకై తగు శక్తిని ప్రసాదించవలసిందిగా ఆ రోజు స్వామివారిని వేడుకున్నాను.

## నా భాగ్యం – ఒక విశ్లేషణ

నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ఇప్పటివరకు 17 పర్యాయాలు 7 కోట్ల జపమును సమర్పించాము. మరియు 2002 సంవత్సరములో కీ.శే. వాడ్రేవు గవర్రాజు గారు వ్రాయించిన 3 కోట్ల జపమును కూడా జప హోమాదులు నిర్వహించి ఇదే స్థూపములో సమర్పించాము. నాచే సమర్పించబడు ప్రతి పర్యాయము 7 కోట్ల జపమునకు హైదరాబాద్ లోని మా ఇంటిలో 7 రోజులు పూజలు జరిపి చివరినాడు దీపారాధన చేసి జపసమర్పణ యాత్రను ప్రారంభిస్తాము. జప సమర్పణ రోజు తిరుపతిలో స్తూపం ముందు కూడా ఈ పూజలు జరుపుతాము. ఇలా 17 X 2 = 34 మరియు 2002 సంవత్సరములో గవర్రాజు గారు వ్రాయించిన జపమునకు ఒకసారి, కలిపి మొత్తం 35 సార్లు స్వామివారి జపమునకు అంతిమపూజ చేయుట జరిగింది. ఈ 35 సార్లు జపమునకు చివరి పూజ జరుపునప్పుడు స్వామివారు వారి దివ్య పాదములను చూపేవారు. మొత్తం జపం కుప్పపైన ఆయన రెండు పాదములు నిలిచి ఉండునట్లు కనబడేవి. స్వామివారు మాత్రం ఈ పాదాలకు సమానమైన విరాడ్రూపునిగా ఆకాశములో నిలబడినట్లు భావన కలిగేది. కాని పాదములు మాత్రం నల్లని ఆకారంలో స్పష్టంగా కనబడేవి. ఆ పాదములపై ఒక 6 ఇంచుల వరకు ఆయన ధరించిన పట్టు పీతాంబరము కూడా కనబడేది. నేను ప్రతి పర్యాయము ఈ రెండు పాదములకే పుష్పాలు, ధూప దీప సుగంధ ద్రవ్యాలతో పూజించి తనివితీరా ప్రార్థించేవాడిని. 2002 సంవత్సరంలో ప్రారంభమైన ఈ చమత్కారము ఇప్పటికీ ఒకేవిధంగా కొనసాగుతోంది. ఒక సందర్భంలో నాకు పరిచయమున్న శ్రీవైష్ణవ పండితుడు ఉ వే ప్ర శ్రీమాన్ మరింగంటి కులశేఖరాచార్యులతో ఈ విషయాన్ని పంచుకున్నప్పుడు వారు నన్ను చాలా అభినందించారు. పరిపక్వత పొందినవారికి మాత్రమే ఇలా జరుగునని అన్నారు. నిజంగా ఆయన నల్లని పాదాలను చూచు సమయాన నేను పొందు ఆనందమునకు హద్దులుండవు, పరవశించిపోతాను. ఇదంతా శ్రీవేంకటేశ్వరుని కృప, నా భాగ్యం అని విశ్లేషించుకున్నాను. ఇలాగే జీవితాంతం కొనసాగనివ్వమని కూడా ప్రార్థించాను.

## గురువును ఇంటికి తెచ్చుట

గత కొన్ని నెలల నుండి స్వామివారి లీలలను పూర్వము లా గా చూడకపోయేసరికి నా లోపాలను సరిదిద్దుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేశాను. ఇలా ప్రయత్నించినా ఫలితం లేకపోయేసరికి, నాకు ఒక గురువును ప్రసాదించమని, మంత్రోపదేశము చేయించమని పదే పదే నా ప్రభు శ్రీవేంకటేశ్వరుని వేడుకున్నాను. అయినప్పటికీ స్వామివారి నుండి ఎలాంటి జవాబు రానందున నేనే నా జీవితాన్ని పునరాలోచించుకున్నాను. అప్పుడు తెలిసింది. స్వామివారు నా వద్దకు మార్చి 2008 లో ఒక గురువుగారిని పంపారని, నేనే మరచానని బాధ పడ్డాను. నాలో 'నా' అన్నది నశించలేదని తెలియచేయుటకు తిరుపతి నుండి ఈ గురువుగారిని పంపారు. వారు సాక్షాత్ శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామి వారు. గుర్రపుముఖముతో ఒక రాయి నుండి వెలువడి తిరిగి ఒక యువకుని వలె మారి నా మానసిక స్థితిని నాకు అర్థం అయ్యే విధంగా చేశారు. "నేను తిరుపతినుండి వస్తున్నాను, స్వామివారు చెప్పగానే ఉన్నపళంగా బయలుదేరి నీ వద్దకు వచ్చానని" నాతో చెప్పారు. కాని ఆనాడు ఆయనకు సరైన గుర్తింపు ఇవ్వలేదు. నా మానసిక స్థితిని తెలిపిన వెంటనే శ్రీవేంకటేశ్వరుడు చెప్పిన పని పూర్తైనదని భావించి, గురువుగారిని ఆరాధించుట మరచాను. ఆయనను ఆదరించని మూర్ఖుడనని నన్ను నేను నిందించుకున్నాను. మరియు ఇప్పటినుండి వీరిని నా గురువుగా భావించి పూజించాలని నిర్ణయించుకున్నాను, గత జప సమర్పణ సమయాన తేది 25-08-2019 నాడు కొండపై శ్రీ హయగ్రీవ స్వామి విగ్రహాన్ని కొని తెచ్చి తేది 26-08-2019 నాడు ఇంటిలో నిలిపి అభిషేకాదులతో పూజించాను. ఇప్పటినుండి శ్రీ హయగ్రీవస్వామి వారిని నా గురువుగా స్వీకరించి, స్వామివారి గురించిన మరింత జ్ఞానముతో పాటు నా జీవితానికి అవసరమైన జ్ఞానమును ప్రసాదించవలసిందిగా ప్రార్థించుట ప్రారంభించాను. ఒక మూడు నాలుగు రోజులలో సుల్తాన్ బజార్ వెళ్ళి స్వామివారు గతంలో కోరినట్లు బట్టలను కొని ధరింపచేయాలని కూడా అనుకున్నాను.

## భక్తుడైన మనవడిని ప్రసాదిస్తున్నట్లు చూపుట

తేది 02-09-2019 నాడు వినాయక చవితి, సోమవారము కావున నేను మా ఇంటిలో ఎప్పటిలాగే స్వామివారికి మరియు గురువుగారైన శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామి వారిని అభిషేకాదులతో పూజించాను. వినాయకుణ్ణి నిలిపి ఆయనకు కూడా పూజ జరిపాము. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతమున టీవీ కార్యక్రమాలను వీక్షిస్తూ నిద్ర లోనికి జారుకున్నాను. దాదాపు 1.30 ప్రాంతమున ఈ కల కన్నాను.

**తేది 02-09-2019 కల :** ఈ కలలో నాతో పాటు మా కుటుంబ సభ్యులమందరం మా ఊరిలోని మా పాత ఇంటిలో ఉన్నామట. ఇంటిముందు మంచములో మా కోడలు తల్లి శ్రీమతి గీత మరి కొందరు పడుకున్నారట. మా అమ్మ లేదా సురేఖ వచ్చి 'ఇంకా పడుకున్నారు, పని చేయాలి' అంటూ మా ఇంటిలోని లోగిలి వద్ద నున్న ధాన్యపు గరిశె వద్దకు వచ్చి ఏదో పని చేస్తున్నది. నేను కూడా లోగిలి నుండి పైకి వచ్చు సమయాన ఇంటిలో ఒక చిన్న బాబును చూచాను. వాడు నన్ను చూడగానే రా... రమ్మని అరుస్తూ, తా... తా... అంటూ లేచుటకు ప్రయత్నిస్తూ రెండు చేతులు చాచి పిలిచాడు. నేను వాడి దగ్గరకు పోయి ఎత్తుకున్నాను. మరియు వీడు నిన్ను పిలుస్తున్నాడని అదృశ్యంగా ఉన్న సురేఖ లేదా మా అమ్మ అన్నారు. కల చెదిరింది. దీనిని నా భార్యకు చెప్పాను. వెంటనే ఆమె మా ఇంటికి ఒక బాబు వచ్చు సమయము వచ్చిందేమోనని, శుభవార్తను వినగలమేమోనని అన్నది. ఇది నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీల తప్పక ఫలించునని విశ్వసించాను. మరియు మా ఊరి పాత ఇంటిని ఉపయోగించి చూపాడు కాబట్టి ఈ బాబు తప్పక భక్తుడిగానో లేక రాబోవు హరినామ క్షేత్రానికి ఒక ప్రముఖుడుగానో ఉండగలడని భావించాను.

## గురువుగారు ప్రభావాన్ని చూపుట

తేది 03-09-2019 నాడు సుల్తాన్ బజారుకు వెళ్ళి, నా గురువుగారైన శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామి వారికి వారు కోరినట్లు వస్త్రాలను కొనుక్కొచ్చాను. తరువాత రోజు ఈ వస్త్రాలను ధరింపచేసి పూజించాను. వారు మార్చి 2008 లో కోరితే ఈరోజు వారికి వస్త్రాలను కొనిపెట్టినందులకు క్షమించమని వేడుకున్నాను. నన్ను రక్షించమని, లక్ష్యం సిద్ధించునట్లు మార్గదర్శనము చేయమని ప్రార్థించాను. అనుకున్నట్లే ఈ రాత్రి స్వామివారు ఒక చక్కటి కలను ప్రసాదించారు.

**తేది 05-09-2019 కల:** నేను ఒక చెఱువులో ఈదుచున్నాను, నా చుట్టూ నీళ్ళే ఉన్నవి. గట్టు వైపు ఈదుతున్నాను. కల చెదిరింది. అంటే జీవితమనే ఈ సముద్రములో గట్టుకొరకై ఈదుచున్నానని దీని అర్థం. నేను గురువుగారైన శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామి వద్ద శిక్షణను గ్రహించి కాని గట్టుకు చేరలేనని దీని భావం. మరియు ఆయన వద్ద విద్యను అభ్యసించుట ఈ జీవిత పరమార్థంగా భావించాను. ఎంతవరకైతే ఆయన వద్ద విద్యను అభ్యసించనో అంతవరకు నేను అసంపూర్ణ వ్యక్తినని కూడా భావించాను.

## ఉన్నపళంగా స్వామి దర్శనం కోరే స్థితి

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మమ్ములను తన దారిలోనికి తెచ్చుకొనుటకు సామ దాన భేద దండోపాయాలను వాడేవారు.

భవిష్యత్తులో ఉన్నపళంగా స్వామివారిని దర్శించవలసినంత భయమేర్పడగలదని ఒక సందర్భములో సూచించారు. ఇది నా భార్య సురేఖకు కలిగిన స్వప్నం.

**తేది 30-12-2019 కల :** అది ఉదయం 6 గంటలు. రాత్రి నైటీలో పడుకున్న నా భార్య సురేఖ ఉదయం లేవగానే అదే నైటీలో ఇంటిముందు గల గేటు వరకు వచ్చిందట. ఎందుకో గేటు తలుపులు తీసి బయటికి అడుగు పెట్టినదట. ఒక మాయా శక్తి ప్రభావమున వెంటనే సురేఖ తిరుమల కొండపైకి అదే నైటీలో చేర్చబడ్డదట. అప్పటికి తనకు తాను నైటీలో ఉన్నానని, తన వద్ద ఒక్క పైసా లేదని, తను ఏవిధంగా ఈ కొండపైకి తేబడ్డదో తెలియని అయోమయ స్థితిలో ఉన్నదట. అందరూ స్వామివారి దర్శనానికి వెళుతున్నారు. తనకు కూడా స్వామివారిని చూడాలనే కోరిక కలిగింది. కాని తాను నైటీలో ఉన్నది కాబట్టి తనను లోనికి అనుమతించెదరో లేదో అని చింతించిందట. కొద్దిసేపటికి ధైర్యం వహించి, దర్శనం క్యూలో భక్తులతో పాటు వెళ్ళి స్వామివారిని దర్శించుకుని బయటికి వచ్చిందట. ఆ తరువాత తాను తిరిగి ఇంటికి ఎలా రావాలనే చింత పట్టుకున్నది. ఏమి చేయాలో తెలియక పోలీసు స్టేషన్ కు వెళ్ళి తన పరిస్థితిని వివరించి హైదరాబాద్ కు బస్సు ఎక్కిస్తే, తరువాత ఆ డబ్బులు పంపగలనని, అలా చెప్పాలని అనుకున్నదట. ఇంతలో కల చెదిరింది.

తెల్లవారి నాకు చెప్పింది. దీనర్థం – మాకు త్వరలోనే పెద్ద ఆపద రాబోతోందని ఉన్నపళంగా రక్షించమని తిరుపతి దేవుని వద్దకు పరుగెత్తుకుని పోగలిగే స్థాయిలో ఉండగలదని భావించాను. భయపడుతుందని సురేఖతో ఈ విషయం చెప్పలేదు. కాని స్వామి చూపాడు కాబట్టి జరిగి తీరుతుంది.

## ఒక భావన

తేది 07-03-2020 నాడు నా జీవితంలోని కొన్ని విషయాలను ఇలా వ్రాసుకున్నాను.

ఈ 2020 వ సంవత్సరంలో నా వయస్సు 60 నిండుతుంది. గత 16 సంవత్సరాల నుండి రథయాత్రను కొనసాగిస్తున్నాము. నాకు స్వామివారి అన్ని సేవలలోకెల్లా ఈ సేవనే తృప్తినిచ్చేది. కాని దీనిలో ఎంత చేసినా తరగని పని ఉంటుంది. క్రొత్తపని పుట్టుకొస్తూ ఉంటుంది. పనిభారముతో 2018 సంవత్సరంలోనే మా రథయాత్రను నిలుపుదామని నా భార్య అనింది. కాని నా వయస్సు 60 వరకు చేద్దాం, ఆ తరువాత నిలిపేద్దామని చెప్పటం వలన అతి కష్టం మీద ఒప్పుకున్నది. అది ఈ సంవత్సరం తేది 01-07-2020 తొలి ఏకాదశి నాటికి పూర్తవుతుంది. కాబట్టి ఈ ఒక్క సంవత్సరం రథయాత్రను జరిపి తరువాత నిలిపివేద్దామని నిర్ణయించుకున్నాము. ఒకవేళ ఇది ఇలాగే కొనసాగాలంటే... సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడే ఏదైనా లీలను ప్రదర్శిస్తే తప్ప అది సాధ్యం కాదని తలచాము. ఈ విషయాన్ని స్వామివారితో కూడా విన్నవించాము.

## వికారాలు తొలగించుటకు కొడుకును ఎంచుకొనుట

భగవంతుడు ఒకరిని ఎన్నుకుని అతని మాధ్యమంగా లీలలను సాగిస్తుంటాడు. ఉదా: రావణాసురుడు, హిరణ్య కశిపుడు మొదలైనవారిని చెడ్డవారిగా చెప్తూంటాము. కాని వారి మాధ్యమంగా రామాయణం లాంటి గ్రంథాలు ఏర్పడి భగవంతుని కీర్తి దశదిశలా వ్యాపించింది, మరియు యుగయుగాల భక్తులు తరించబడుతున్నారు. ఏవిధంగా అయితే భగవంతుడు రావణున్ని మాధ్యమంగా ఎన్నుకున్నాడో, అదేవిధంగా మమ్ములను మార్చడానికి మా పెద్దకుమారుడు చి॥ వేదాంత్ ను మాధ్యమంగా ఎన్నుకుని లీలలను చూప ప్రారంభించారు. ఫలితంగా హరినామ క్షేత్ర ఏర్పాటుకు అవసరమైన మార్పును మాలో కలిగించాడు. వాటిని చూద్దాం.

తేది 12-02-2020 నాడు మా రెండవ కుమారుడైన చి॥ అరవింద్ రెడ్డి వివాహము చి॥ సౌ॥ ప్రణీతతో జరిగింది. నా వయస్సు 60 సంవత్సరాలు నిండేనాటికి నేను చేయవలసిన అన్ని కార్యక్రమాలు పూర్తయినాయి. ఈ వివాహానికి నా పెద్ద కుమారుడు చి॥ వేదాంత్ దంపతులతో పాటు బంధువులు వచ్చారు. పెండ్లి జరిగిన నాలుగైదు రోజులలోనే మాలో మార్పు కొరకు స్వామివారు ప్రయత్నించారు. ఇందుకు మా పెద్దకొడుకు చి॥ వేదాంత్‌ను ఉపయోగించుకున్నాడు. ఒక సందర్భంలో వాడి అత్తగారింటిలోని ఒక చిన్న ఫంక్షన్ కు వెళ్ళాల్సి ఉంది. కాని ఏవో పనుల వల్ల సురేఖ పోలేనంది. ఈ చిన్న విషయానికే నా కొడుకు చి॥ వేదాంత్ తన తల్లితో అత్యంత భయంకరంగా ప్రవర్తించాడు. ఇంటికప్పు ఎగిరిపోయే విధంగా అరుస్తూ టేబుల్స్ ను, ఛైర్స్ ను, ఫోన్స్ ను నేలపై కొట్టాడు. ఎంతగా భయపెట్టాడంటే సురేఖ గజగజ వణికింది. దీనితో తల్లి హృదయం గాయపడ్డది. తనకు తోడు నీడగా ఉంటాడనుకున్న కొడుకు, అతి సన్నిహితంగా ఉన్న కొడుకు అత్యంత దురుసుగా ప్రవర్తిస్తూ తిట్టేసరికి మనస్సు విరిగిపోయి గాయమైంది. దీనితో తనకు తోడు నీడ దేవుడేననే భావం మనస్సులో దృఢపడ్డది. వాడి భయానికి గజగజ వణుకుచు ఉన్నపళంగా స్వామివారిని దర్శించుకోవాలనే స్థితి ఏర్పడ్డది. ఇంతగా తాను ఎప్పుడూ భయపడలేదని చెప్పింది. నేటికి అది గుర్తొస్తే కాళ్ళు వణుకుతాయట.

ఈ అనుకోని సంఘటనతో వెంటనే స్వామివారి లీల నాకు బోధపడ్డది. కాని ఎవరికీ చెప్పలేదు. స్వామివారు ఇంకా ఏమి చేయగలరో చూద్దామనుకున్నాను. ఆ దిశలో అడుగు పడ్డదని మాత్రం భావించాను.

## సరైన దారిలో మనస్సును నిలుపుమని చెప్పుట

మార్చి 2020 నుండి దేశంలో కోవిడ్ మహమ్మారి విజృంభించింది. మనుష్యులు ఒకరినొకరు చూచుటకు భయపడ్డారు. ప్రభుత్వము వారు లాక్ డౌన్ ప్రకటించారు. బయటికి వెళ్ళలేక ఎవరి ఇంటిలో వారే ఉండవలసిన పరిస్థితి ఏర్పడ్డది. ఇలాంటి పరిస్థితిలో కాలక్షేపము కొరకు సినిమాలు, సీరియాళ్ళు చూచుట అలవాటు చేసుకున్నారు. నేను కూడా ఇంటిలోనే ఉంటూ రోజుకు ఒక సినిమా చూచుట మొదలుపెట్టాను. ఈ సందర్భంగా స్వామివారు ఒక లీల చూపారు. దాని గురించి ఆ రోజు నేను వ్రాసుకున్న విధానము ఈ విధంగా ఉంది.

**తేది 28-04-2020 :** కోవిడ్ – 19 లాక్ డౌన్ మూలాన ఇంటిలోనే ఉంటూ సినిమాలు చూచుట వలన నా మానసిక స్థితిలో మార్పు వచ్చింది. ప్రతిక్షణం స్వామివారిని స్మరించడంలో లోపం ఏర్పడ్డది. బహుశా నేను కూడా సినిమాలో లాగా ఉండాలని నా మనస్సు భావించి ఉండవచ్చు లేదా వాటి ప్రభావముచే మలినమై ఉండవచ్చు. అందుకే ఎప్పటికీ పాజిటివ్ గా ఆలోచించే నాకు నెగెటివ్ ఆలోచనలు వచ్చుట మొదలైనాయి. ఫలితంగా భగవంతునిపై ధ్యాస తగ్గింది. దీనిని నేను కూడా గమనించాను. దీని ప్రభావము నుండి బయటకు వచ్చుటకు ప్రయత్నించాను. కాని మళ్ళీ చెడు ఆలోచనలకు బానిసనై నడుచుకున్నాను. దీనిని గమనించిన స్వామివారు నేటి రాత్రి ఒక హృదయాంతర భావం ఇలా కలిగించారు.

"నీ మనస్సు దారి తప్పుతున్నది. ఫలానా విషయమై ఆలోచిస్తున్నది, అది తప్పు. ఎప్పటికీ మనస్సును భగవంతుడు మెచ్చే దారిలోనే, పాజిటివ్ గానే ఆలోచించాలి" అని చెప్పారు. ఆ తరువాతి రోజుల నుండి సినిమాలను చూచినప్పటికీ చెడు భావాలకు దూరంగా మసలుకున్నాను. స్వామి చెప్పిన విషయాన్ని గుర్తుంచుకుని జీవించాలని దృఢంగా నిర్ణయించుకున్నాను.

## స్వామివారి దర్శనము లభించలేదు

తిరుమల స్వామివారి పూర్ణాభిషేకము సేవకై 2007 సంవత్సరంలో 4 టికెట్స్ ను బుక్ చేశాను. తేది 19-06-2020 నాడు ఈ అభిషేక సేవ ఉన్నది. ఈ సేవలో స్వామివారిని తనివితీరా దర్శించుకోవాలని చాలా రోజుల నుండి భావించాను. కాని కరోనా కారణంగా టిటిడిలో అన్ని సేవలను నిలిపివేశారు. ఫలితంగా నేను స్వామివారిని దర్శించుకోలేకపోయాను. ప్రభూ! మిమ్ములను దర్శించుకోవాలని తపిస్తున్నాను, ఆజ్ఞ ఇవ్వమని ప్రార్థించాను. నేటి కలలో స్వామివారు తన దర్శనానికి సంబంధించిన కొన్ని విషయాలను తెలిపి నన్ను కటాక్షించారు.

**తేది 16-06-2020 కల :** గత కొన్ని రోజులుగా మూసివున్న తిరుమల ఆలయం తెరుచుకుంది. భక్తులకు దర్శనానికి ఆజ్ఞ ఇచ్చారు. కాని ఒక్కొక్కరు దూరంగా ఉండమని చెప్తూచు క్యూ లైనును మొదలుపెట్టారు. నేను తిరుపతికి వెళ్ళలేదు. ఇక్కడనే హైదరాబాద్ లోనే ఉన్నాను. కాని ఇక్కడినుండే తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనానికై ఉన్న భక్తుల క్యూను చూచాను. ఇంతలో సీను మారింది. అది తిరుమల లాగా ఏదో ఒక దేవస్థానము. ఆ దేవస్థానము పెద్ద పెద్ద వృక్షాలచే నిండి ప్రశాంతమైన వాతావరణములో గోవిందా! గోవిందా! అంటూ భక్తులు పరమ ఉత్సాహముతో స్వామిని దర్శించుటకై నిలుచున్న చాలా పెద్ద క్యూను చూశాను. ఈ క్యూను చూచిన వెంటనే నాకు ఆ క్యూలో నిలబడాలని ఉంది, కాని అది చాలా పెద్దగా ఉండుట వలన స్వామివారి దర్శనము కాదనిపించింది. ఇంకొక దారేమన్నా ఉన్నదేమోనని పరి పరి విధాలుగా వెతికాను. కానీ ఏ దారీ కనిపించనందున నిరాశతో ఉండిపోయాను. మనస్సున ఆయనను ధ్యానిస్తూ ఆ క్యూను పరికిస్తూ నిలుచుండిపోయాను. కల చెదిరింది. దీనితో నాకు స్వామి దర్శనము కాదని అర్థం అయింది. తరువాత రోజు తిరుపతికి ఫోన్ చేసి కనుక్కోగా వారు ఇలా అన్నారు. "స్వామివారి అన్ని సేవలు ఏకాంతంగానే చేస్తున్నాము, భక్తులను అనుమతించుట లేదు. మేనేజిమెంట్ వారు దీనిపై ఒక నిర్ణయము తీసుకున్న పిదప మీకు తెలియపరుచుదుము. అంతవరకు ఎవ్వరినీ అనుమతించము".

ఏది ఏమైనా చాలా రోజుల తర్వాత నా ప్రభు మళ్ళీ నా కలలో ఆయన లీలను చూపుట నన్ను మహదానందానికి గురి చేసింది.

## రెండవ సంకల్పానికి నాంది

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నన్ను తన పనిముట్టులాగా ఎన్నుకున్నాడు. నేను వారి సేవలను చేసి యోగ్యతను సాధించి హరినామ క్షేత్రం ఏర్పాటు చేయాలన్నదే వారి ప్రధాన ధ్యేయం. దీనికై వారు ప్రసాదించిన 111 కోట్ల జప సమర్పణ సేవలో విజయం సాధించలేదనే విషయం నాకు తెలియదు, కాని స్వామివారికి తెలిసిపోయింది. అందుకని నిద్రావస్థలో ఉన్న నాలోని సేవక భావాన్ని జాగృతం చేసి మరో సంకల్పాన్ని ఇవ్వజూపారు. దీనికి నా షష్టిపూర్తిని ఎలా ఉపయోగించుకున్నారో చూద్దాం.

తిరుమల స్వామివారికి 2002 సంవత్సరంలో సంకల్పించిన 111 కోట్ల జప సమర్పణ సేవ 2018 సంవత్సరం వరకు పూర్తైనది. ఆ తరువాత ఈ సేవను జీవితాంతం కొనసాగించ నిర్ణయించినప్పటికీ, సంకల్పం నెరవేరిందనే దృష్టితో స్వామి సేవలో నా మనస్సు అంత లగ్నం కాలేదు. పూర్వపు పట్టుదల, ఆత్రుత తగ్గింది. ఒకరకంగా ఇది నా విరామ సమయము లాగా రాబోవు సంకల్పానికి ఒక సంధికాలము లాగా పరిస్థితులు ఉన్నవి. ఇంతలో తొలి ఏకాదశి (01-07-2020), నా 60వ

పుట్టినరోజు సమీపించింది.

## తిరుమల శ్రీవేంకటేశ్వరుని 111 కళ్యాణాల బీజము

ప్రతి తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి పర్వదినములలో మేము ఎంతోమంది భక్తుల మధ్యన భజగోవిందం నిర్వహించుట ఆనవాయితీ. పైగా 2020వ సంవత్సరపు తొలి ఏకాదశి (తేది 01-07-2020) నా 60వ పుట్టినరోజు కావడం వలన తప్పక భజగోవిందమును పెద్ద యెత్తున నిర్వహించాలని తలచాను. కాని కోవిడ్-19 ప్రభావము లోకములో తాండవము కొనసాగుతున్న కారణంగా తొలి ఏకాదశి నాడు నిర్వహించే "భజగోవిందం" కార్యక్రమం జరపలేకపోయాము. కాని నా షష్టిపూర్తి కాబట్టి హైదరాబాద్ లోని మా స్వగృహమందు స్వామివారి కళ్యాణమును ఏకాంతంగా, భయముతో కేవలం 8 మంది కుటుంబ సభ్యుల మధ్యన నిర్వహించాము. ఇలా కళ్యాణము నిర్వహించు సమయాన నాలో సేవక భావము జాగృతమై ఈ క్రింది రకరకాల భావాలు వచ్చాయి.

ఈ మొత్తం సృష్టికి స్థితి, లయ కారకుడు, భగవంతుడు అయిన నా ప్రభు శ్రీవేంకటేశ్వరుని కళ్యాణమును ఇలా ఏకాంతంగా నిర్వహించుట బాధ కలిగింది. నా శరీరములో రక్తం మరిగింది. ఇది నా స్వామికి అవమానముగా భావించి సహించలేకపోయాను. ఈ పరిస్థితులపై ప్రతీకారము తీర్చుకోవాలనిపించింది. కాని విధిలేక ఇంతమంది మధ్యనే నిర్వహించాము. ఒకరకంగా ఇదే నా షష్టిపూర్తి కార్యక్రమము, కాబట్టి తక్కువమంది ఉన్నారనే బాధ మరింత పెరిగింది. ఆ తరువాత మిగిలిన నా శేషజీవితములో మరింత స్వామి సేవను ప్రసాదించమని వేడుకున్నాను. అంటే... ప్రస్తుతం నిర్వహిస్తున్న సేవతో పాటు మరొక రకమైన సేవ కావాలని, ఇది కూడా జీవితం చివరి అంకం వరకు కొనసాగాలని ఆశించాను. 60 సంవత్సరాల తరువాత జీవితం సంపూర్ణంగా స్వామివారిదేనని, దీనిని స్వామివారు సరిగా ఉపయోగించుకోవాలని వేడుకున్నాను. నేను కేవలం ఒక పనిముట్టు లాంటి వాడిని మాత్రమేనని, లోకానికి ఉపయోగపడే పనులను నాచే చేయించమని వేడుకున్నాను. చివరివరకు నన్ను గోవిందదాసుగా జీవించే అవకాశమును ప్రసాదించుమని మరీ మరీ ప్రార్థించాను. స్వామి సేవ కోసం నా మనస్సు ఉరకలేసింది, మరియు నా వయస్సుకు తగిన, నేను చేయగలిగే మరో గొప్ప సేవను ప్రసాదించమని కూడా వేడుకున్నాను. బహుశా నా ఈ కోరికకు అనుగుణంగా కావచ్చు, లేదా మరే కారణమో తెలియదు కాని నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి వారి భక్తులచే ఎన్నో కళ్యాణాలను చేయించాలనే కోరిక కలిగింది. అంటే... నేనే ఈ మొత్తం కళ్యాణాలను చేయుట కాదు, వారి భక్తులచే భక్తులు కోరినచోటే చేయించాలనే కోరిక ఉద్భవించింది. ఒకరకంగా ఈనాటి పరిస్థితులపై కోపం, పగ పెరిగాయి. నా స్వామివారు ఇంత పెద్దవారు అయి ఉండి ఏకాంతంగా చేయుటను సహించలేకపోయాను. ఆ కోపంలోనే మీకు వేలమంది సమక్షంలో ఎన్నో కళ్యాణాలను జరిపించాలని ప్రతిజ్ఞ పూని, ప్రసాదించమని దీనంగా ప్రార్థించాను. దాని ఆలోచనే ఈ 111 కళ్యాణాల కార్యక్రమమునకు బీజము.

గత రెండు సంవత్సరాల నుండి నా సంకల్పం నెరవేరిందని భావించి, స్వామి సేవను పట్టుదలతో చేయకపోవుట వలన, మరో స్వామి సేవ కావాలనే కోరిక నాలో మితిమీరింది. ఎలాగైనా స్వామి కళ్యాణాల సేవను ప్రసాదించమని ప్రతిరోజూ స్వామివారిని రకరకాలుగా ప్రార్థించుట ప్రారంభించాను. 18 రోజులు పగలు రాత్రి ఆలోచించి చివరికి తప్పక చేయాలనే నిర్ణయానికి వచ్చాను. దీనిని 19-07-2020 వరకు నా భార్యకు కూడా చెప్పలేదు. ఈ రోజు చెప్పుదామనుకున్నాను. నా భార్య కూడా ఒప్పుకోవాలని నా ప్రభు శ్రీవేంకటేశ్వరుణ్ణి వేడుకున్నాను. తరువాత ఒక సంకల్పం చేసుకుంటే, ఈ ప్రతిజ్ఞకు కట్టుబడి ఉండగలనని అనుకున్నాను. ఎందుకంటే నేను చంచల స్వభావము కలిగిన కలియుగ మానవుణ్ణి అని ఆరోజు వ్రాసుకున్నాను. మరియు ఆ రోజు అనగా తేది 19-07-2020 నాడు ఉదయం 11.34 గంటలకు నేను ఈ కళ్యాణాల గురించి విధి విధానాలను, సంకల్పం మాదిరిగా ఇలా వ్రాసుకున్నాను.

## కళ్యాణాల సంకల్పము

1. తిరుమల శ్రీవేంకటేశ్వరునికి నా శేషజీవితములో, ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను నిర్వహించాలి.
2. ఈ కళ్యాణాలను నేను, నా భార్య కాకుండా భక్తులచే నిర్వహింపచేయాలి.
3. ఈ కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో భక్తులకు అనువైన తేదీలలో వారి ప్రాంతములోనే నిర్వహించాలి.
4. కళ్యాణాలకు అయ్యే ఖర్చును మేము కొంత, భక్తులు కొంత భరించేటట్లు వారిని ప్రోత్సహించాలి.
5. స్వామి తత్వమును బోధిస్తూ కళ్యాణము జరపాలి. కళ్యాణములో అన్నమయ్య కీర్తనలు ఉండాలి. భక్తులకు ఇది ఒక వేదిక కావాలి.
6. కళ్యాణం శాస్త్రోక్తంగా జరగాలి, నృత్యాలతో ఊరేగింపు జరిపి, స్వామివారిని, భక్తులను తృప్తి పరచాలి.
7. ఇది కేవలము భక్తుల, లోక కళ్యాణమును దృష్టిలో పెట్టుకుని మాత్రమే నిర్వహించాలి. చివరికి అందరూ బాగుండాలని, కోవిడ్ లాంటి వాటినుండి ప్రజలను రక్షించి సుఖ శాంతులు

ప్రసాదించాలని వేడుకోవాలి.

ఈ విధమైన ఏడు అంశాలు కలిగిన సంకల్పాన్ని వ్రాసుకున్నాను. ఆ తరువాత దీనిని స్వీకరించమని, కళ్యాణాలను నిర్వహించుటకు అనుమతించమని, తగిన శక్తిని, భక్తుల సహకారాన్ని అందించమని నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రార్థించాను.

తరువాతరోజు మధ్యాహ్నం, మొత్తం 111 కళ్యాణాలు చేద్దామని నా భార్య సురేఖతో చెప్పాను. రథయాత్రను మానివేసి ఈ కార్యక్రమమును చేపట్టుదామన్నాను. ముందు తాను భయపడ్డది. మనవల్ల కాదన్నట్లు మాట్లాడింది. నేను ఒప్పించుటకు ప్రయత్నించాను. తనకు భారం కాదన్నట్లు చెప్పాను. మరియు గతంలో నా కొడుకు ప్రవర్తన వలన గాయపడిన సురేఖ శ్రీవేంకటేశ్వరుడే తనవాడని, అతని కోసం ఏమైనా చేయుటకు సిద్ధపడి ఉండుట కారణంగా చివరికి సరేనంటూ ఒప్పుకుంది. ఈ విధంగా నా కొడుకు దురుసు ప్రవర్తన సురేఖ మారటానికి ఉపయోగపడ్డది.

## కళ్యాణాలకై స్వామివారి లీలలు

ఆ తరువాత నా స్వామివారి కళ్యాణం బహు చక్కగా, ఎంతో ఆకర్షణీయంగా ఉండాలనే ఉద్దేశ్యంతో రెండు చక్కని సింహాసనములను, మరియు 21 ఇంచుల ఎత్తుగల స్వామివారి, అమ్మవార్ల పంచలోహ విగ్రహములను తయారు చేయ ఆర్డర్ ఇచ్చాను. ఈ విగ్రహములకు బంగారు పూత వేయించాలని కూడా భావించాను. ఈ విధంగా కళ్యాణం పనులు ప్రారంభమైనవి. స్వామివారు కూడా ఈ సేవను నాకు ప్రసాదించినట్లు తృప్తి కలుగసాగింది.

కాని స్వామివారు, ఈ కళ్యాణాల కార్యక్రమానికి ఇంత తొందరగా లీలను చూపుతారని భావించలేదు. ఒకరకంగా మాకంటే ఎక్కువ ఆత్రుత స్వామివారికే ఉన్నట్లు కనబడ్డది. ఈ కళ్యాణాలను ఎక్కడ జరపాలి, ఏవిధంగా జరపాలి, దీనికి నమో వేంకటేశాయ రథమును ఉపయోగించవలసి ఉందంటూ, కళ్యాణములను అత్యంత భారీస్థాయిలో డ్రెస్ కోడ్ వాడుతూ, చేతిలో శంఖు, చక్రాల వంటి చిహ్నాలను ధరించిన సిపాయిల పరేడ్ వంటి వాటితో పాటు, నృత్యాలను చేయించాలంటూ లీలలను ప్రసాదించారు. అందులో మొదటి లీల ఈవిధంగా చూపెట్టారు. ఈ లీలలో స్వామివారు నన్ను ఈ కళ్యాణాన్ని నేను జన్మించిన మా అమ్మమ్మ గ్రామము అప్పనపల్లి ఊరులో జరిపించమని ఈ లీల సారాంశము. కాని ఆ రోజు దీని భావమును అర్థం చేసుకోలేదు. ఆ లీల ఈ విధంగా ఉంది.

నా ఇద్దరు మేనమామలు చనిపోయారు, కాని వారి భార్యలైన మా అత్తలు జీవించి ఉన్నారు.

**తేది 07-08-2020 కల :** ఈ కలలో నేను జన్మించిన అప్పనపల్లి గ్రామములో ఒక ఉత్సవమును చూచాను. అందులో నేను, మా పెద్ద అత్త శ్రీమతి రత్నమ్మ గారు ఉన్నాము. మరియు వారి ఇంటివద్దనే ఈ ఉత్సవము జరుగుచున్నది. మేమిద్దరము ఈ ఉత్సవము కొరకై నూతన వస్త్రములను, నేను పంచెను, ఆమె పీతాంబర చీరను ధరించి యున్నాము. మరియు చప్పుడువారు, ఊరి జనము నిండుగా ఉన్నారు. ఉత్సవ కళ నిండుగా కనిపించింది. ఇంతే కల.

ఇందులో దాదాపు 84 సంవత్సరముల వయస్సున్న మా అత్త చక్కగా ఉన్నప్పటికీ ఈ కలలో మాత్రం వయస్సు రీత్యా వంగి ఉన్నట్లు కనబడ్డది. దీనర్థం మా అత్త వయస్సు మీరింది, ఎప్పుడు ఏమౌనో చెప్పలేము కాబట్టి అప్పనపల్లిలో స్వామివారి కళ్యాణాన్ని నిర్వహించి, ఆమెకు, కుటుంబ సభ్యులకు మరియు ఆ గ్రామస్థులకు శ్రీవేంకటేశ్వరుని కృపా కటాక్షాలు లభింపచేయమని చెప్పారు. కాని ఆ రోజు దీని అర్థమును సరిగా గుర్తించలేదు.

## కళ్యాణాలు విశాలమైన ప్రదేశంలో ఆర్భాటంగా జరగాలని చెప్పుట

ఒక వారం రోజుల తరువాత మరో లీలను చూపెట్టారు. అప్పుడు కూడా దీని అర్థమును గ్రహించలేదు. ఇందులో మేము ఆటపాటలకు, కళ్యాణాలకు అనువైన ఒక ప్రత్యేక ఫంక్షన్ హాల్ లాంటి ప్రదేశమునకు వెళ్ళాము. అక్కడ ఆ ప్రదేశమంతా చక్కగా రంగు రంగుల కాగితాలతో అలంకరించాము. ఇది మాకు అత్యంత ఆప్తుల కళ్యాణమట. ఈ కళ్యాణముతో పాటు నృత్య కార్యక్రమములను ఏర్పాటు చేశాము. ఆ లీల ఈవిధంగా ఉంది.

**తేది 14-08-2020 కల:** ఈ కల బహు చిత్రంగా ఉంది. అది మా ఇల్లు కాదు, మేము ఒక దూరంగా ఉన్న ఉత్సవాలు జరుపుకునే ఒక హోటల్ లాంటి ప్రదేశానికి వెళ్ళాము. అక్కడ మేము, మాకు అత్యంత ఆప్తుని లేదా మా ఇంటివారి కళ్యాణము కోసమని, కళ్యాణానికి, నృత్య ఉత్సవానికి కావలసిన ఏర్పాట్లు చేశాము. మేము 3 అంతస్తుల పెద్ద భవనములో ఉన్నాము. ఆ మూడంతస్థుల భవనము ముందు దాదాపు 80 అడుగుల వెడల్పైన రోడ్డు ఉన్నది. మేము లోపల కంటే ఈ రోడ్డే అనువైనదిగా భావించి బయటనే ఏర్పాట్లు చేశాము. చిత్రమేమిటంటే మంచి అలంకరణ చేశాము. కాని ఒక నాలుగైదు అడుగుల పొడవు, రెండడుగుల వ్యాసము ఉన్న వస్తువుకు తెల్లని వస్త్రము చుట్టి ఎడ్లబండి పైన తీసుకువచ్చారు. దానిని అత్యంత సుందరంగా అలంకరించి, పూలు, రంగు రంగుల కాగితాలను ఆ ప్రాంతమంతా కట్టి నృత్యములు చేశాము. ఆ తరువాత ఈ బట్టతో చుట్టిన వస్తువును అలాగే ఒక రెండు రోజులు ఎక్కడో లాకర్ లాంటి దానిలో కాపాడి తిరిగి ఉత్సవము రోజు తెచ్చాము. మళ్ళీ రకరకాల పూలు, రంగు రంగుల కాగితాలచే అలంకరించి, ఉత్సవ ప్రొసెషన్‌ను అత్యంత




శ్రీనివాస కళ్యాణాలు విశాలమైన ప్రదేశంలో జరగాలని సూచించుట

వైభవంగా జరిపాము. ఎగిరారు, దుమికారు, డ్యాన్సులు చేశారు. దీనితో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణము ఏర్పడ్డది. కల చెదిరింది.

ఈ కల నాకు ఈ ఉదయము 4.30 గంటల నుండి 5.15 గంటల మధ్యలో వచ్చింది. ఇదే కల రెండుసార్లు రిపీట్ అయింది. ఈ కల కన్నప్పుడు దీని అర్థమును గ్రహించలేదు. కాని దీని నిజమైన అర్థం ఇలా ఉంది : మేము, చాలా మంది భక్తులు వీక్షించే చోటనే కళ్యాణం చేయాలి. ఇంటిలో కొద్దిమంది కొరకు చేయరాదు. కళ్యాణ వేదికను చక్కగా అలంకరించాలి. నృత్య కార్యక్రమములను, కీర్తనలను ఏర్పాటు చేయాలి. వీలైతే రోడ్డునే వేదికలా మార్చి నిర్వహించాలి. ఎదుర్కోలు కార్యక్రమము చక్కగా ఉండాలి. ఇక 4 అడుగుల బట్టతో చుట్టిన వస్తువు మరేదో కాదు, సాక్షాత్ స్వామివారు. బహుశా మేము స్వామి మరియు అమ్మవార్ల విగ్రహాలకు ఆర్డర్స్ ఇచ్చాము, ఇంకా వాటిని చూడలేదు కావున స్వామివారు కనబడలేదని భావించాను. లేదా వారిని చూచే యోగ్యత సాధించలేదని భావించాను. మరియు స్వామివారిని అలాగే తీసుకెళ్ళి భద్రపరచి తిరిగి మళ్ళీ ఒక ఉత్సవానికి తీసుకువస్తారని కూడా సూచించారు.

## కళ్యాణాల బాధ్యత నాదేననుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఒక ప్రత్యేక పద్ధతిలో తన సేవలను ప్రసాదించారు. ప్రతి సేవ, ముందు ఒక చిన్న మెరుపులా మనస్సులో మెదులుతుంది. ఆ తరువాత దాని గురించి మరిన్ని లీలలను కలిగిస్తాడు. ఈ లీలల ప్రభావము వలన నేను ఆ సేవ చేసి తీరవలెననే పట్టుదల నాలో తారాస్థాయికి చేరుతుంది. అప్పుడు ఆ సేవను ప్రసాదించమని అత్యంత భక్తిపూర్వకంగా స్వామివారిని ప్రార్థిస్తాను. చివరికి ఇలా అంటాను. ప్రభూ! మీరు నాకు, నేను ఈ జన్మలో తృప్తి చెందేవరకు సేవాభాగ్యాన్ని ప్రసాదిస్తానని మాట ఇచ్చారు, నేను ఇంతవరకు తృప్తి చెందలేదు. ఈ సేవను చేయాలనే కోరిక ఉన్నది, ప్రసాదించమని అత్యంత దీనంగా ప్రార్థిస్తాను. అప్పుడు స్వామివారు ఈ సేవను ప్రసాదిస్తూ ఇలా అంటారు. చూడూ... ఈ సేవను నీవు అత్యంత దీనంగా కోరినందుకు ప్రసాదిస్తున్నాను, కాబట్టి దీనిని సమర్థవంతంగా చేసే బాధ్యత నీదేనని అంటారు. నిజానికి మొత్తం స్వామివారే చక్రం తిప్పినప్పటికీ తన చతురతను చూపి నా భుజస్కంధాలపై దాని నిర్వహణ బాధ్యతలను పెడతారు. గతంలో ప్రసాదించిన సేవలైన 1. శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము 2. ప్రతి సంవత్సరం ఏడు కోట్ల జప సమర్పణ 3. నమో వేంకటేశాయ రథము 4. శ్రీవేంకటేశం మాసపత్రిక 5. భజగోవిందం. వీటిలో ఇదే క్రమమును పాటించారు. ఇప్పుడు శ్రీనివాస కళ్యాణాలలో కూడా ఇదే వరుసను ఈ క్రింది లీలల ద్వారా ప్రసాదించారు.

## నా మార్గం చక్కగా ఉన్నదని చెప్పుట

16వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ తరువాత, సేవలను

కొనసాగిస్తున్నప్పటికీ నాలో పూర్వపు పట్టుదల, ఆత్రుత తగ్గింది. ఒకరకంగా విశ్రాంత జీవితం గడిపాను. స్వేచ్ఛ లభించినట్లైంది. కాని ఇది నాకు నచ్చలేదు. నా జీవితాంతం స్వామివారికి ఋణపడి ఉన్నవానిగా భావిస్తూ సేవ చేయాలని భావించాను. కాబట్టి ఈ నాటి నా వయస్సును దృష్టిలో పెట్టుకుని తగిన మరో సేవను ప్రసాదించమని స్వామివారిని కోరగా నా భాగ్యం వలన కళ్యాణాల కార్యక్రమము లభించినందుకు సంతోషించాను. ఈ అవకాశమును వదలకుండా అత్యంత సమర్థవంతంగా నిర్వహించుటకు విశ్వప్రయత్నం చేయనారంభించాను. మరియు దీనిని ఏ తప్పూ లేకుండా శాస్త్రోక్తంగా చేయదలచి, పెద్దల సలహాను తీసుకోదలచాను. నాకు తెలిసిన శ్రీవైష్ణవ పండితుడు ఉ వే ప్ర శ్రీమాన్ మరింగంటి కులశేఖరాచార్యులను ఆగస్టు 2020 లో ఇలా అడిగాను. నేను 21" విగ్రహాలను కళ్యాణాల నిమిత్తమని తయారు చేయిస్తున్నానని, వాటిపైన, కళ్యాణాల పైన మీ అభిప్రాయం తెలుపమని కోరాను. వారు కళ్యాణాలు మంచివని చెప్తూచూ విగ్రహాల విషయమై కొంత విభేదించారు. 21" విగ్రహాలను కళ్యాణ నిమిత్తమై ప్రత్యేకంగా తయారు చేయించినచో వాటికి శాస్త్రోక్తంగా తగిన పూజలు, నైవేద్యాలు ప్రతిరోజూ నిర్వహించాలని, లేకుంటే అపచారము జరుగునని అన్నారు. లేదా వాటిని ఏదైనా ఆలయం వారికి ఇచ్చి నిత్య ధూప దీప నైవేద్యాలు అందునట్లు చేస్తూ మమ్మల్ని వాడుకొమ్మన్నారు. అలా చేయకుండా మా వద్ద పెట్టుకోరాదని అన్నాడు. ఒకవేళ మొండిగా మా వద్దనే పెట్టుకునేటట్లైతే ఈ కార్యక్రమము చేయకపోవడమే మంచిదన్నారు. ఈ రోజువారీ ధూప దీప నైవేద్యాలు మాతో కావు కాబట్టి ఒక్కసారి నా గుండెలో పిడుగు పడ్డట్లైంది. కళ్యాణాల సేవ చేజారుతుందని బాధపడుచూ ఆయన సూచనలను అంగీకరించ బుద్ధి కాలేదు. ఆయనతో కొంతసేపు వాదించాను. సంవత్సరానికి ఒకసారి తెరిచే ఆలయాలు ఉన్నవని, పూర్వము గోదాదేవి సమర్పించిన మాలలో వెంట్రుక ఉన్నప్పటికీ స్వామి స్వీకరించారని అన్నాను. మరియు మేము 2003 సంవత్సరంలో నమో వేంకటేశాయ రథమును తయారు చేశామని, దానికి 8 విగ్రహాలను ఇదే పద్ధతిలో నిలిపామని చెప్పాను. గత 18 సంవత్సరాల నుండి ఈ రథాన్ని కేవలం సంవత్సరానికి నెలరోజులే వాడుదుమని, రోజువారీ నైవేద్యాలు చేయమని అన్నాను. పైగా దీనిని స్వామివారు స్వీకరించారని, ఎంతోమంది భక్తులకు అనుభూతులు కలిగించారని కూడా అన్నాను. అందుకు వారు ఇలాంటిది చాలా అరుదు, కోటికి ఒక్కటి కూడా జరగదు. అయితే నీకు స్వామితో సాన్నిహిత్యము ఉన్నది కాబట్టి ఈ విషయమై ఒకసారి అడిగి నిర్ణయము తీసుకోవలసిందిగా సూచించారు. శ్రీమాన్ కులశేఖరాచార్యుల సూచన మేర సరైన మార్గమును చూపమని స్వామివారిని అత్యంత ఆర్తితో గత కొన్ని రోజుల నుండి ప్రార్థించసాగాను. నాకు ఏవిధంగానైనా కళ్యాణాల సేవను ప్రసాదించమని దీనాతి దీనంగా ప్రార్థించాను. చివరికి ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మీరు నాకు, నేను ఈ జీవితంలో తృప్తి చెందేవరకు సేవాభాగ్యాన్ని ప్రసాదిస్తానని మాట ఇచ్చారు, నేను ఇంతవరకు తృప్తి చెందలేదు, కాబట్టి నాకు ఈ సేవను ప్రసాదించమని ప్రతి రోజూ ప్రతి క్షణం ఎంతో తపనతో నా కళ్ళనుండి నీరు కారుచుండగా దీనంగా ప్రార్థించాను. ఒకరోజు మా ఇంట్లో పూజామందిరంలో ఇలా ప్రార్థించాను. ప్రభూ! ఇంతవరకు మీరు ప్రసాదించిన సేవలతో నేను తృప్తి చెందలేదు. ఇప్పుడు కళ్యాణాల సేవను ప్రారంభిస్తున్నాను. దానికి మీది, అమ్మవారివి 21" విగ్రహాలు కావాలి. నేను అజ్ఞానిని, అల్పుణ్ణి, చేయించిన ఆ విగ్రహాలకు ఆలయాల్లోలాగా ప్రతిరోజూ ధూప దీప నైవేద్యాలతో అర్చించే అలవాటు లేనివాణ్ణి, ప్రయత్నించినప్పటికీ అలా చేయలేకపోతున్నాను క్షమించమన్నాను. మరియు మీ విగ్రహాలను తయారు చేయుటకు, ఈ కార్యక్రమము ప్రారంభించుటకు అనుమతిని ఇవ్వమని వేడుకున్నాను. వెంటనే ఒక బలమైన ప్రోత్సాహము నా మదిలో ఉద్భవించింది. "ఏ సంకల్పం కొరకు విగ్రహాలను తయారు చేయిస్తున్నానో ఆ సంకల్పమునకై వాడితే సరి" అనే అభిప్రాయం కలిగింది. గతంలో రథమునకై కూడా ఇలాగే చేశానని, ఇప్పుడు కూడా ఇదేవిధంగా చేయవలెననే భావం కలిగింది. మరియు ఈ కార్యక్రమము ముందుకు తీసుకు వెళ్ళవలెనని, ఆటంకాలకు వెరవకూడదనే భావం కూడా ఏర్పడ్డది. నా కళ్ళనుండి ఆనందబాష్పాలు కారుతుండగా, శరీరము రోమాంచితము కాగా ఒళ్ళు గగుర్పాటుకు లోనైంది. ఈ భావనతో కులశేఖరాచార్యులు చెప్పినట్లు కాక ముందుకు వెళ్ళుటకు సిద్ధమైనాను. చివరికి ఆ రాత్రి స్వామివారు కూడా ఒక చక్కటి లీల ద్వారా తన ఉద్దేశ్యమును తెలిపారు. నన్ను ముందుకెళ్ళమన్నారు. నా ఆనందానికి హద్దులు లేవు.

**తేది 20-08-2020 కల:** అది ఒక పెద్ద ఆలయ ప్రాంగణము. ఆలయ ప్రవేశ ద్వారము నుండి ఆలయానికి సంబంధించిన కొలను ఒకటి బహు దూరాన ఉన్నది. నేను దైవదర్శనానికై వెళ్ళేముందు ఈ కొలనులో స్నానము చేసి వెళ్ళాలనే ఉద్దేశ్యముతో ఒక పంచె మాత్రమే కట్టుకుని స్నానానికని ఆ గుడి కాంపౌండ్ లోనికి ప్రవేశించాను. అప్పటికే ఒక గురువు, వారి 20 మంది శిష్యబృందము ఆ కొలనులో స్నానము చేస్తున్నారు. చూచిన వెంటనే వారు గురుశిష్యులనే భావమేర్పడ్డది. ఎందుకంటే శిష్యులు ఒకరితో ఒకరు మాట్లాడకుండా భయ భక్తులతో స్నానము చేస్తున్నారు. ఆ శిష్యులు దాదాపు 20-25 సంవత్సరాల మధ్య వయస్సు వారుగా ఉండి, ఆ కొలను మొత్తం వ్యాపించి అక్కడక్కడ స్నానం చేస్తున్నారు. కాని ఆ గురువు మాత్రం



**శ్రీమాన్ కులశేఖరా చార్యులు గారు కొలను వద్దకు రావద్దని వారించుట.**

దాదాపు 60 ఏళ్ళకు పైననే, నాకంటే పెద్దవారుగా ఉన్నారు. వారు పూజారి కాదు కాని చక్కని శాస్త్ర పరిజ్ఞానము కలవారుగా భావమేర్పడ్డది. ఎత్తుగా లావుగా ఉన్నారు. గురువు అనుటకు తగినవారు. నేను వెళ్ళుసరికి వారు కూడా స్నానము చేస్తున్నారు. నేను స్నానానికని ఆ గుడి ఆవరణలోనికి అడుగిడినప్పుడు ఆ గురువు గారు దూరములో ఉన్న ఆ కొలనులో నుండి నన్ను చూచారు. ఇలా ఒకరినొకరం చూచుకున్నాము. ముందు ఎవరో తెలియని గురు శిష్యులనుకున్నాను. కాని తరువాత వారు ఉ వే ప్ర శ్రీమాన్ మరింగంటి కులశేఖరాచార్యులు, వారి శిష్యబృందమని భావించాను. నన్ను దూరము నుండి చూచిన శ్రీమాన్ కులశేఖరాచార్యులు నాతో ఒక విషయమై చర్చించసాగారు. దానికి నేను నాదైన రీతిలో జవాబు చెప్పసాగాను. ఈ చర్చ బహు గంభీరంగా జరిగింది. ఆ గురువుగారు, నేను కొలనులో స్నానము చేయరాదని, ఆ కొలను వద్దకు రావద్దంటూ, నడుము వరకు నీటిలో నిలబడి తన రెండు చేతులను పైకి లేపి X ఆకారంగా ఊపుచున్నారు. నేను మాత్రం ఆయన మాటలను పట్టించుకోకుండా, ఎందుకు రావద్దంటూ వాదిస్తూ చివరికి నీటి అంచు వరకు వెళ్ళాను. ఆయన లోపల నుండి నాపై రకరకాల ప్రశ్నలతో వాదిస్తున్నారు. చివరికి నేను లోనికి దిగుటకు ముందు నీటి అంచున కొలను గట్టుపై కూర్చున్నాను. ఇంతలో ఒక చమత్కారం జరిగింది. ఈ కొలనులో నాకు రెండు వైపులా వారి శిష్యులు స్నానమాచరించుట వలన నీరు మురికిగా మట్టి కలిసిన నీటిరంగుగా మారి, నీటిలో ఈ మట్టిరంగు మేఘము వలె వ్యాపించింది. కాని నా ఎదురుగా ఉన్న నీరు ఈ గట్టునుండి అవతలి గట్టు వరకు ఒక 6' అడుగుల వెడల్పుతో స్వచ్ఛంగా ఉన్నవి. ఎలాంటి మట్టిరంగు కలవకుండా, ఆ కొలను అడుగు భాగము లోని ఇసుకరేణువులు స్పష్టంగా కనిపించేలా ఉన్నాయి. ఎలాంటి కల్మషాలు లేవు. దిగు, స్నానమాచరించు అన్న విధంగా నన్ను ఆహ్వానిస్తున్నట్లు ఉన్నాయి. నేను ఉన్న స్థానము నుండి, కొలను అడుగు భాగమున ఉన్న మట్టి రేణువులను ఈ భాగము నుండి అవతలి భాగము వరకు ఈ 6' అడుగుల వెడల్పు భాగములో స్పష్టంగా చూచాను. కాని ఇరుప్రక్కలా మట్టిరంగుతో నీటిని చూచాను. ఆశ్చర్యపోయాను. చివరికి లోనికి దిగుటకు సిద్ధం అన్నట్లు ఉన్నాను. గట్టుపై కూర్చుండి కాళ్ళను నీటి లోనికి దింపి ముందుకు వెనుకకు ఆడిస్తూ లోనికి దిగుటకై వేచి చూస్తున్నాను. దీని తరువాత ఆ గురువు గారి నుండి ఎలాంటి మాటలు వినబడలేదు. కల చెదిరింది.

అంటే స్వామివారు నా విధానాన్ని స్వీకరించారు. నన్ను 21'' అంగుళాల విగ్రహాలను చేయించి, కళ్యాణాలను నేను కోరిన విధంగా నిర్వహించుకోవచ్చునని సూచించారు. నా మార్గం స్పష్టంగా ఉన్నదని, కల్మషాలు లేవని అర్థం. దీనితో నేను ఎంతో సంతోషించాను. నాకు కళ్యాణాల కార్యక్రమమును స్వామివారు ప్రసాదించారని మురిసిపోయాను. నిజానికి శ్రీమాన్ కులశేఖరాచార్యులు చెప్పింది శాస్త్రరీత్యా తగిన విధానమైనప్పటికీ, తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నాకు తన సేవాభాగ్యాన్ని ప్రసాదించాలనే ఉద్దేశ్యముతో తన స్థాయిని క్రిందికి దించుకుని ఒప్పుకున్నారని భావించాను. నేను కూడా శ్రీమాన్ కులశేఖరాచార్యులు చెప్పినట్లు చేయుటకు విశ్వ ప్రయత్నం చేసినప్పటికీ వీలు కాలేదు. కాబట్టి స్వామివారినే ఒప్పుకొమ్మనే ప్రార్థనకు వారు సమ్మతించారు. దీనితో స్వామిసేవ మరింత ఉధృతంగా, భక్తిభావముతో, ఏ తప్పూ లేకుండా చేయాలనే పట్టుదల ఎక్కువైంది.

**నా దశ :** స్వామివారి కోసం వెతుకులాడాను. కోరికలను త్యజించమని సందేశం ఇచ్చారు. 35 సార్లు స్వామివారి పాదాలను దర్శించాను. గురువును ఇంటికి తెచ్చి పూజిస్తున్నాను. స్వామివారికి 111 కళ్యాణాల కార్యక్రమం లభించింది.


**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**
**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**
**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,**
**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి 🛕 కోట్ల జపములో భాగముగా

# 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చుమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మా నుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). **9348212354** నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.


శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**



# మహనీయం - మహత్తరం - శివకేశవాద్వైతం కార్తీకం

: చింతలపాటి శివశంకర శాస్త్రి

**శ్లో ॥ "చతుర్భుజం చిదానందం మల్ల చాణూర మర్దనం**
**చరాచర గురుం దేవం తం వందే చక్రపాణినం**
**శ్రియః కరం శ్రియోనాథం శ్రీధరం శ్రీ వరప్రదం**
**శ్రీ వత్సల ధరం సౌమ్యం తం వందే శ్రీ సురేశ్వరం"**

పద్మనేత్రుడు, పద్మనాభుడు, పద్మమాలాధరుడు, పద్మచరణుడు, దేవదేవుడు, అనంతశక్తిస్వరూపుడు, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, ఆపద్బాంధవుడు అయిన మహావిష్ణువు భక్తుల కష్టాలను గట్టెక్కించి, వారి కోరికలు తీర్చే ఆ దేవదేవుని స్మరణం, కైవల్యదాయకం, భక్తిముక్తిదాయకం.

కృత్తికా నక్షత్రముతో కూడిన పున్నమి గల మాసాన్ని కార్తీక మాసమని అంటారు. కృత్తికా నక్షత్రం అగ్నినక్షత్రం. కార్తీకం కమనీయం, రమణీయం, మహనీయం, కైవల్యకారకం, హరిహరప్రియం, జగద్రక్షాకరం. హరిహరులిద్దరూ అద్వైతంగా, అన్యోన్యంగా పూజలు అందుకుంటూ భక్తులను అనుగ్రహించే మాసం కార్తీకం. దీపారాధనలు, దీపదానాలు, ధార్మిక క్రతువులు, పుణ్యనదీ స్నానాలు, దానధర్మాలు, తులసీ పూజలకు అనువైన, మేలైన కాలం కార్తీకం. పావనమైన ఈ నెలలో అగ్నిస్వరూపుడై, జ్యోతిర్లింగంగా ప్రపంచాన్ని ఆధ్యాత్మిక దారులలో నడిపించే శివదేవునికి అభిషేకాలు, ప్రదోషకాల పూజలు, బిల్వార్చనలు, పంచాక్షరీ మంత్ర జపాలు, తపాలతో సంతృప్తిని కలిగించి కైవల్యం అనగా ముక్తిని కలిగింపచేసే కాలం కార్తీకం. సమైక్యతా స్ఫూర్తినిచ్చే మాసం. ఈ మాసంలో విష్ణువును కార్తీక దామోదరునిగా పూజించడం జరుగుతుంది. అందువల్ల ఈ మాసంలో ఏ పని చేసినా "కార్తీక దామోదర ప్రీత్యర్థం" అని సంకల్పం చెప్పుకుని చేయాలి. విష్ణుప్రీతి కరంగా నిర్వహించుకునే పండుగలు ఉత్థాన ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి.

తిథుల లో పదకొండవ తిథిని ఏకాదశి అంటారు. మన హిందూ సంస్కృతిలో ఏకాదశి తిథి ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఏక+దశ = ఏకాదశ – మనసు, ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు – వెరసి పదకొండింటిపైనా నియంత్రణ సాధించేందుకు ఏకాదశిని పాటించాలి. ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసములలో దైవ చింతన ఇమిడిపోవాలి. మనస్సు నిర్మలంగా ఉండి సదా భగవద్భజనలో విహరించాలి. హరి నామస్మరణం నిరంతరం చేస్తుండాలి. ఎందువలననగా ''హరి యను రెండక్షరములు హరియించునెల్ల పాతకంబు'' 'హరి' అను రెండక్షరములను తాదాత్మ్యములో ఉచ్చరించిన అనేక జన్మలలోను, ఈ జన్మలోను చేసిన పాతకములన్నీ నశిస్తాయి. బుద్ధిని భగవంతుని మీద కేంద్రీకరించాలి. హరికథలను వినాలి. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను త్యజించాలి.

ఏడాదిలో వచ్చే 24 ఏకాదశులకు ప్రత్యేకమైన పేర్లు ఉన్నాయి. తొలి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి, భీష్మ, నిర్జల, కామిక, అజ ఏకాదశి... ఇలా వివిధ నామాలతో ఏర్పడిన ఏకాదశులలో ఉత్థాన ఏకాదశికి అత్యంత ప్రాధాన్యముంది. శ్రీమహావిష్ణువు ఆషాఢ శుద్ధ ఏకాదశి నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు గల నాలుగు నెలలు యోగనిద్రలో ఉంటాడు. ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు నిద్రకు ఉపక్రమిస్తాడు. కనుక ఆ రోజున తొలి ఏకాదశి (లేదా) శయనైకాదశి అని అంటారు. ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యకాలం అని అంటారు. దీనినే 'హరికాలం' అనే మరో నామంతో ఋషులు పిలుస్తుంటారు. ఈ కాలం ఉపాసనాపరులకు, మంత్రసాధనా పరులకు, మహర్షులకు పరమ పవిత్రమైన కాలం. ఆషాఢ శుక్ల ఏకాదశి నాడు శేషశయనుడై కార్తీక శుక్ల ఏకాదశి నాడు నిద్ర నుండి మేల్కొంటాడు. ఆయన నిద్రకు ఉపక్రమించే తిథిని శయనైకాదశి అని, నిద్ర నుండి లేచే తిథిని ఉత్థాన ఏకాదశి అని వ్యవహరిస్తారు. శయనైకాదశి నాటి నుండి లోకపాలనా మహా కర్తవ్యాన్ని ''నారాయణి'' అయిన తన ప్రియ సోదరి పార్వతికి అప్పగిస్తాడు. ఉత్థాన ఏకాదశి నాడు యోగనిద్రను చాలించుకుంటాడు. ఆధ్యాత్మికపరులు ఉత్థాన ఏకాదశి వరకు గల నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్య దీక్షను శ్రద్ధగా ఆచరిస్తారు. ఉత్థాన ఏకాదశి నాడే పండరిపుర యాత్ర ముగుస్తుంది. ఇదే రోజున భీష్మపంచక వ్రతము కూడా ఆచరిస్తారు.

పరమ పవిత్రమైన ఏకాదశి నాడు విష్ణువును పూజించాలి. ఈనాడు విగ్రహారాధన, ఉపవాసం ఉండటం మున్నగునవి ముఖ్యమైనవి. ఉపవాసఫలమును పొందగోరువారు ఏకాదశి నాడు రెండు పూటలా భుజించరాదు. ఉపవాసము చేసిన సూర్య చంద్ర గ్రహణ సమయాలలో చేసే దానం, అశ్వమేధ యాగం చేసిన ఫలితాలకంటే అధికఫలం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఉపవాసం చేయలేనప్పుడు నెయ్యి, నీరు, పాలు, పండ్లు తీసుకోవచ్చు. నిజానికి ఉపవాసమనగా ఉప... వాసం – ఉపవాసం. ఉప అనగా సమీపము అని అర్థము. వాసము అనగా నివసించడం – అనగా సమీపములో నివసించడము అని అర్థం. దేనికి సమీపములో అనగా భగవంతునికి సమీపములో అని అర్థము. మనిషి ఇంద్రియాలకు అధీనుడు. సుఖభోగాలు మనిషిని దైవానికి దూరం చేస్తాయి. ఉపవాసం, కఠిన నియమాల వల్ల ఇంద్రియాల ప్రభావం తగ్గి ఆధ్యాత్మిక సాధనకు మార్గం సుగమమవుతుంది.

కార్తీక శుద్ధ ద్వాదశిని 'క్షీరాబ్ధి ద్వాదశి' గా నిర్వహించుకుంటారు. క్షీరసాగర మథనం ముగిసిన రోజిది. వాడుక భాషలో 'మథించడం' అంటే చిలకడం. కాబట్టి దీనికి ''చిలుకు ద్వాదశి'' అనే పేరు కూడా ఉంది. ఈ రోజున ''ధాత్రీపూజ''పేరుతో ఉసిరి చెట్టును పూజిస్తారు. ఉసిరినే 'అమలకం' అని అంటారు. ఈ చెట్టును శ్రీమహావిష్ణువు స్వరూపంగా భావిస్తారు.



క్షీరసాగరంలో హాలాహలం తర్వాత కల్పవృక్షం, కామధేనువు, ఐరావతం, చంద్రుడు ఉద్భవించారు. ఆ తర్వాత సకల ఆభరణాలతో, జగత్తునంతటిని ప్రకాశింప చేసే తేజస్సుతో మహాలక్ష్మి ఉద్భవించింది. ఆమెను శ్రీమహావిష్ణువు కార్తీక శుద్ధ ద్వాదశి రోజున వివాహం చేసుకున్నాడు. బ్రహ్మాది దేవతలతో కలిసి బృందావనం చేరుకున్నాడు. నాటినుండి ద్వాదశి రోజున లక్ష్మీనారాయణుల వివాహం జరపడం ఆనవాయితీగా వస్తోంది. కార్తీక శుద్ధ ద్వాదశి అత్యంత పుణ్యప్రదమైనది కనుక 'పావన ద్వాదశి' అంటారు.

క్షీరాబ్ధి ద్వాదశి రోజున తులసి, విష్ణువులకు వివాహం జరిపిస్తారు. ఆనాడు (ద్వాదశి నాడు) అమృతం, లక్ష్మీదేవితో పాటు తులసి కూడా పుట్టింది. విష్ణుపూజకు అర్హురాలైంది. పాలకడలి నుండి పుట్టిన లక్ష్మీదేవిని దేవతలు తులసి దళాలతో

పూజించారు. ఇది ద్వాదశి నాడు జరగడంలో ఆ తిథి విష్ణువుకు ప్రీతిపాత్రమైంది. ఈ రోజు తులసిని విశేషంగా పూజిస్తారు. సూర్యాస్తమయమైన తర్వాత కాయలతో ఉన్న పెద్ద ఉసిరి కొమ్మను తులసి కోటలో ఉంచి పూజిస్తారు. పూజ చేసేటప్పుడు "తులసీ ధాత్రీ సమేత శ్రీమన్నారాయణాయ నమః" అంటారు. 'ధాత్రి' అంటే ఉసిరిక అని అర్థము. తులసి, ఉసిరిక ఒకేసారి పుట్టాయని పురాణాలు చెబుతున్నాయి. ఈనాడు ఉసిరికాయ మధ్యలో చిన్నగుంట చేసి అందులో ఆవునెయ్యి పోసి, వత్తులు వేసి దీపారాధన చేస్తారు. ఈరోజు దీపదానం చేసిన గొప్ప పుణ్యం లభిస్తుంది. విధి పూర్వకంగా మహావిష్ణువుకు తులసికి అర్చనలు చేస్తారు. బ్రాహ్మణులకు, ముత్తయిదువులకు నూతన వస్త్రాలను ఇస్తారు. తులసికోట చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. సాయంకాలం తులసికోట దగ్గర దీపారాధన చేస్తారు. హిందువులు తులసిని లక్ష్మీదేవి అవతారంగా భావిస్తారు. అందువలననే 'లక్ష్మితులసి' అని, 'కృష్ణతులసి' అని, 'రామతులసి' అని అంటారు. ఈ మూడింటినే పూజల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. తులసి మొక్కను సర్వదేవతా స్వరూపంగా భావిస్తారు. తులసి మూలంలో సకల తీర్థాలు, మధ్యభాగంలో సకల దేవతలు, అగ్రభాగాన సర్వవేదాలు కొలువై ఉంటాయి. అదేవిధంగా తులసి అగ్రభాగంలో బ్రహ్మదేవుడు, మధ్యభాగంలో మహావిష్ణువు, మూలంలో మహేశ్వరుడు, శాఖల్లో అష్టదిక్పాలకులు నివసిస్తూ ఉంటారని పురాణాలు ఉద్ఘోషిస్తున్నాయి. అందువలననే ఏకాదశి నాడు ఉపవాస దీక్షతో తులసిని, మహావిష్ణువును పూజించాలి. అయిదు రంగుల ముగ్గులతో పద్మాలను గీసి, అయిదు దీపాలను పెట్టి, గంధ, పుష్ప, ధూప, దీప, నైవేద్య, తాంబూలాదులను సమర్పించాలి. ప్రదక్షిణ నమస్కారాలు చేయాలి. ద్వాదశి నాడు నియమపూర్వకంగా తులసి పూజ చేసి, బియ్యపు పిండితో మూడు ముద్దలు చేసి ఒకటి తులసికి, మరొకటి బ్రాహ్మణునికి సమర్పించాలి. మూడవ దానిని రోటిలో వేసి, పాలు పోసి, చెరుకుగడలతో దంచాలి. ఆ విధంగా దంచే సమయంలో ఎన్ని చుక్కలు వ్రతం చేసేవారిపై చిందుతాయో, అన్ని వేల సంవత్సరాలు స్వర్గలోకం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. రాత్రింబవళ్ళు శ్రీకృష్ణుని ధ్యానం తప్ప అన్యమెరుగని ఉద్ధవుడనే భక్తుడు శ్రీకృష్ణునితో నీకిష్టమైన నివాసమేది? అని ప్రశ్నించగా శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వి భక్తుల మనస్సు, తాపసుల సన్నిధానం, తులసి సన్నిధానం ఈ మూడూ నాకిష్టమైన నివాస స్థానాలని చెప్పాడు.



పావనమైన ఈ నెలలో అగ్నిస్వరూపుడై, జ్యోతిర్లింగంగా ప్రపంచాన్ని ఆధ్యాత్మిక దారులలో నడిపించే శివదేవునికి అభిషేకాలు, ప్రదోషకాల పూజలు, బిల్వార్చనలు, పంచాక్షరీ మంత్ర జపాలు, తపాలతో సంతృప్తిని కలిగించి, కైవల్యం అనగా ముక్తిని కలిగింపచేసే కాలం కార్తీకం. కార్తీకం శివదేవునికి ప్రీతిపాత్రమైన మాసం.

'శివ' అనే మాటకు శ్రేయస్సు, మంగళం, భద్రం, శాంతి, కళ్యాణం అంటూ అనేక పర్యాయ పదాలున్నాయి. పరమసత్యం, పరమ జ్ఞానం, పరమ చైతన్యం అంతా శివుడే. ఆయన పరిపూర్ణ గుణధాముడు. అవ్యక్త స్వరూపుడైన పరబ్రహ్మము మొదట నిర్గుణుడు, నిరాకారుడు. లోక శ్రేయస్సు కోసం భక్తులను అనుగ్రహించడం కోసం లింగరూపం ధరించాడు. "లీయతే గమ్యతే ఇతి లింగః" "లిం" అంటే మన కంటికి కనిపించకుండా లీనమై యున్నదానిని; 'గం' అంటే ఒక గుర్తు రూపంలో తెలియజేస్తుంది. అందుకే అది లింగమైంది. చరాచర జగత్తంతా ఎవరియందు కలిగి, పెరిగి, తిరిగి లీనమవుతుందో అదే లింగం.

శివుడు అభిషేకప్రియుడు, భోళాశంకరుడు. చెంబుడు నీళ్ళతో ఉబ్బి తబ్బిబ్బయి కోరిన వరాలిస్తాడు. శివాభిషేకం సమస్త దోషాలు తొలగించి, పాపాలు బాపి భక్తుణ్ణి పునీతం చేస్తుంది. ప్రదోష కాలంలో అభిషేక ప్రియుడైన శివునికి నమక, చమకాలతో, మహన్యాస పూర్వకంగా అభిషేకం జరగాలని, జరపాలని వైదికవేత్తలు చెబుతున్నారు. ప్రదోషమనగా మనకున్న దోషాలన్నింటిని పరహరించగలిగిన పావనకాలం. ఐదు ఘడియల కాలం (సూర్యోదయ, సూర్యాస్తమయ) ప్రదోషం.

శివునికి పంచామృతాలతో చేసే అభిషేకం విశేష ఫలదాయకం. ఆవుపాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, తేనె, నీరు కలిపి పంచామృతమంటారు. పంచామృతాభిషేకం శివునికి ప్రీతికరం. ఆయన పశుపతి. పంచభూతాలకు అధిపతి. ధారగా పోసే అమృతాభిషేకం జీవాత్మ, పరమాత్మలను అనుసంధానం చేసే కార్యం. అభిషేకానంతరం ఒక్క బిల్వదళాన్ని సమర్పించినా భోళాశంకరుడు సంప్రీతుడై చెప్పలేనంత మేలు చేస్తాడు.

సకల శుభప్రదమైన కార్తీకమాసాన్ని భక్తి శ్రద్ధలతో ధర్మ శాస్త్రానుసారం పాటించి, ఆచరించి, శివకేశవుల చల్లని కరుణా కటాక్షాల కొరకు, అనుగ్రహం కొరకు ప్రయత్నించి మన జీవితాలను ధన్యం చేసుకుందాం.

**"సర్వే జనాః సుఖినో భవంతు"**



# తరిగొండ వేంగమాంబ

– ఎస్.ధర్మారావు

శ్రీవేంకటేశ్వరస్వామి స్వయంగా ఒక అందాల రేడు. ఓహో! ఏమి అందం, ఏమి చందం, ఎంత వైభవం, ఎంత ఆకర్షణ! ఆయన దర్శనంతో తనువు, మనసు పులకించిపోతుంది. ఈ బ్రహ్మాండనాయకుని సందర్శనం సర్వ సౌభాగ్యదాయకం, సర్వక్లేశహరం, సర్వమంగళకరం.

క్రీ.శ 1730 వ సంవత్సరం ఆ ప్రాంతం వాయల్పాడు సమీపంలో గల పెనుగొండ ప్రాంతంలో కానాల కిష్టయ్య మంగమ్మదంపతులకు ఐదుగురు మగ సంతతి. తర్వాత ఆడపిల్లకై శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించగా ఆయన వరప్రసాదిగా ''వేంకమ్మ'' – వారి ఆరవ సంతానంగా జన్మించింది. ఆమెను కా లక్రమేణా వేంగమ్మగా పిలువసాగారు. ఆ కాలంలో ఆడపిల్లలకు 8వ ఏడు దాటకుండా వివాహం చేసేవారు. అలాగే ఈ మెను చిత్తూరు జిల్లా నారగొండ పల్లె వాస్తవ్యులు ఇంతేటి వెంకటాచలపతితో వివాహం జరిపించారు. వేంగమ్మ నాకిప్పుడే పెళ్ళేమిటి? అని వ్యతిరేకించినా వినేవారెవరు? ఆమె చిన్నతనం లోనే ఒక ఆధ్యాత్మిక ఉపాసకుని వద్ద మంత్రోపాసన తీసుకుని నిరంతర సాధనతో మెలగసాగింది. ఊరిలో గల నృసింహుని దేవాలయమంటే కడు ప్రీతి. కలియుగ శ్రీవేంకటేశ్వరుడున్నా ప్రాణం. గానమన్నా ఈవిడకు ప్రాణం. వారిది పూర్వాచారాలు పాటించే నిష్ఠ నియమాలు కల కుటుంబం. మడ తడి కంటే శుచి శుభ్రత హెచ్చు. ఆమె కాలంలో వివాహితులకు చాలా కట్టుబాట్లు ఉండేవి. కానీ కట్టుబాట్లు, వంశం కంటే మానవత్వమే ప్రధానమని ఈమె దృఢ నమ్మకం. తాను నమ్మిన సిద్ధాంతం ప్రకారం నడిచేది. భర్త సర్పద్రష్టుడై మరణించగా, జుట్టు తొలగించి వైధవ్యము పాటించడానికి నిరాకరించింది. అది సంప్రదాయం కాదని ఎంతమంది చెప్పినా వినలేదు. పుష్పగిరి పీఠాధిపతి చెప్పినను పాటించక, కనీసం ఆయనకు నమస్కరింపక ఆయననే ప్రశ్నింపగ ఆమె మీరొక మారు ఆసనంపై నుండి లేచి ఈవలకు రండి అని ప్రార్థించగా అట్లే చేసెను. వేంగమ్మ కనులు మూసుకుని ప్రార్థించి ఆసనమునకు నమస్కరింప ఆ ఆసనము దగ్ధమయ్యెను. ఈ వింతను చూచి ఈమె కారణ జన్మురాలని గ్రహించి సంప్రదాయములతో ఆమెకు పనిలేదని ఎరిగి స్వామి తిరోగతుడయ్యెను. ఊరి వారందరూ తమ ఆచారం ప్రకారం జుట్టు తొలగించవలసిందేనని ఒత్తిడి చేయగా ఆమె ఇలా ప్రత్యుత్తరమిచ్చెను. సరే మీరు చెప్పినట్లే చేసెదను. నా జుట్టును తొలగించెదను. మరలా జుట్టు రాకుండా మీలో ఎవరైనా చేయగలరా అని ప్రశ్నింప వారందరూ నివ్వెరపోయిరి.

ఇట్టి నిర్బంధములు, తిరస్కార భావనలు సహించలేక వేదన చెంది ఎవరికీ తెలుపక ఒంటరిగా పయనమై తిరుమల క్షేత్రం చేరి ఆవేదనతో స్వామికి నమస్కరించి ప్రార్థించగా శ్రీ స్వామి ఆమె ఆవేదనను అర్థం చేసుకుని అప్పటి ఆలయ ప్రధానులగు మహంతునకు స్వప్న దర్శనమిచ్చి ఆమెను చూపి ఆమె తన భక్తురాలగుటచే ఒక చిన్న కుటీరం నిర్మించి ఇవ్వమని, ఉగ్రాణం

నుండి ప్రతినెల ఉచితంగా కావలసిన సామానులు ఆమెకు ఇవ్వమని ఆదేశింపగా అతడట్లే చేసెను.

అన్ని సదుపాయములు సమకూర్చుట వలన ఆమె నిత్యం స్వామిని దర్శించి, సేవించి పూవుల దండలల్లి తులసి మాలలల్లి స్వామికి భక్తితో సమర్పించి స్వామివారి అన్ని కార్యక్రమాలలో పాల్గొనుచూ రాత్రిపూట భజనలు సాగిస్తూ మధుర మధురముగా స్వామిపై పాటలు అల్లి ఆనందంగా కాలము గడప సాగెను.

**సీ. శృంగార రాయని! చెలువు మీరిన కొండ**
**ఫణిరాజు పేరిట! పసిడి కొండ**
**ఘోర పాపమనంచుఁ! కోవెళ్ళ గల కొండ**
**తలచిన మోక్షంబు! తగులుకొండ**
**చిలుకలు కోయిలలతో! చెలఁగి కూసెడి కొండ**
**మృగ జాతి కోట్లెల్ల! మెలగుకొండ**
**పుష్పజాతుల విష్ణు! బూజింపగల కొండ**
**కల్పవృక్షములైదు! గలుగు కొండ**
**తే.గీ అమర వరులకు నాధార! మైన కొండ**
**ఆలు వార్లకు ప్రత్యక్ష! మైన కొండ**
**అలర జూచిన బ్రహ్మాండ! మైన కొండ**
**ఏను కనుగొంటి శ్రీవేంక! టేశు కొండ**

ఇటువంటి పద్యాలు, పాటలు వ్రాయుచు సుఖముగా కాలము గడుపుచుండగా సొంత ఊరువారు, బంధువులు తిరిగి రమ్మని కోరినా నిరాకరించి అచటనే ప్రఖ్యాతి గాంచుచుండెను. క్రమ క్రమముగా రచనల సంఖ్య పెరిగి ఆమె నిజమైన సేవ చూచిన వారెల్లరును ఆమెను పొగడసాగిరి. ఇట్లు సంవత్సరములు గడిచిన కొలదీ ఆమె విశిష్టము పెరిగి స్వామి సేవకు అంకితమగుట గాంచి స్వామిని దర్శించిన వారందరూ ఆమెను కూడా దర్శింపసాగిరి. రోజు రోజుకు భక్తుల రాక పెరగడంతో ఆలయ అర్చకుల దృష్టిలో ఇది ఈర్ష్యకు కారణమాయెను. ఆమె ఒక సామాన్య భక్తురాలు. ఆలయ ప్రధాన అర్చకుడగు తనను వదిలి రోజూ ఆమెను దర్శించుటయా? ఎంత ఘోరం? పిచ్చి భక్తులు వచ్చిననూ ఆమెను అనుమతించుట విడ్డూరం.

ఆచారమునువదిలిఅన్నదానముచేయుటసామంతులొసగిన దానం, వస్తు సంబారములు స్వీకరించుటయా? తగుదునమ్మాయని సేవాకార్యములు చెప్పుటయా? ఒక సామాన్యురాలు ఇచటికి వచ్చి ఇట్టి కీర్తి గడించుటయా? ఇట్టి ఆలోచనలు పెరిగి ఆమెకు కష్టములు కలుగుజేయవలయుననే సంకల్పముతో కుతకుతలాడారు. ప్రధాన అర్చకుడు ఆమె నివాసం తన ఇంటికి చేరువలో ఉండుట వలన రోజూ ఆమెను దర్శించు భక్తులను, వారి భావములను గమనింపజొచ్చిరి. ఈ ఈర్ష్యాద్వేషములు ముప్పిరిగొనగా తమ ఇంట భోజనమైన తర్వాత ఎంగిలి విస్తరాకులు ఆమె నివాసముపై పడవేయసాగిరి. ఆమె ఒక తులసివనం పెంచసాగెను. ఈతని కుటుంబ సభ్యులు విసిరిన ఎంగిలి ఆకులు తులసి వనమునందు పడసాగెను. తులసి శ్రీ స్వామికి అత్యంత ప్రీతికరమైనది.

ఒకరోజున వెంగమాంబ తన తులసివనం నందొక చోట కూర్చుని ధ్యానంలో నుండగా ఎంగిలి విస్తరాకు మీద పడగా తృళ్ళిపడి జ్వలించు నేత్రములతో నీ వంశం నిర్వంశమగు గాక అని అప్రయత్నంగా ఆమె నోటనుండి వెలువడగా ప్రధాన అర్చకుని ఇంటిలో హాహాకారములు మిన్నుముట్టెను. అర్చకుని కుమారుడు దేకుతూ వచ్చి ఆమె పాదాలపై పడి వేడగా ఆమె అప్రయత్నంగా ఇకనుండి మీ వంశమున ఒకే ఒక మగపిల్లవాడు జన్మించుగాక అని మరల శాపము నిట్లు పలికించినది ఎవరు? అని ఆమెకు తెలియలేదు. నేను అట్లు పలికియుండుట నిజమైన భక్తి కాదు. గర్వంతో ప్రవర్తించెనా? నేను శ్రీ స్వామి సేవకు పనికిరాను అని భావించి మూడు దినములు స్వామి దర్శనమునకు వెళ్ళలేదు. శ్రీ స్వామి ఆమెకు స్వప్న సాక్షాత్కారమిచ్చి నీ నోట అట్లు పలికినది నేనే అని తెలిపెను. అయిననూ ఆమె మనస్సు శాంతించలేదు. ఎంత సంబాళించుకొన్ననూ ఆవేదన ప్రబలుచుండెను. ఆ సమయమున ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుచున్నవి. స్వామివారు రథోత్సవ కోలాహలంతో వచ్చుచూ రథం వెంగమాంబ ఇంటి సమీపమునకు వచ్చి ఆగిపోయి ముందుకు కదలలేదు. ఉత్సవము ముందుకు సాగకపోవడానికి కారణం స్వామి భక్తులకెవరికో అపకారం చేసి యుండుటచే స్వామి ఆగ్రహమునకు కారణమై ఉండునని పెద్దలందరూ తీర్మానించగా ప్రధానార్చకుడు తానే అట్లు వెంగమాంబను అవమానపరచెనని తెలిపి తనను క్షమింప స్వామిని వేడి వెంగమ్మ పాదాలపై పడి తనను మన్నించ వేడుకొని, ఆమె వచ్చి స్వామికి హారతి ఇచ్చిన గాని స్వామి ఉత్సవం సాగదని విన్నవించి దుఃఖించగా వెంగమ్మ చేతులు జోడించి స్వామికి నమస్కరించి హారతి ఇవ్వగానే శ్రీ స్వామి రథం ముందుకు కదిలెను. అందరూ ఆనందంతో "గోవిందా" అని దిక్కులు పిక్కటిల్లేటట్లు ఉచ్ఛస్వరంతో నామస్మరణ చేయుచూ వెడలగా రథోత్సవం పూర్తి అయ్యెను. శ్రీ స్వామి తన్ను అవమానించినా, దూషించినా సహిస్తారు కాని తన భక్తులను అట్లు చేసిన సహించలేరు. అదే భగవంతుని కరుణ.

అది మొదలు ఆమె భక్తితో పాటు కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించి లోకములో ప్రఖ్యాతి పొందెను. ఆమె రచనలలో అత్యంత విశిష్టమైన పద్య కావ్యం "శ్రీవేంకటాచల క్షేత్ర మహాత్మ్యం". ఈ మధుర వాఙ్మయం చూచిన ఎందరో రాజులూ, చక్రవర్తులూ విస్మయం చెంది ఆ కావ్యమును కాపీ చేయించుకొనుటకు ప్రసిద్ధ వ్రాత నిపుణులను పంపిరి. ఆ రోజులలో అట్టివారు ఎనమండుగురు ఆమె ఇంట ఉండి ఆ కావ్యమును కాపీ చేసుకున్నారు. క్రమ క్రమంగా స్వామికి వెంగమ్మ యందు

కరుణ పెరగ సాగింది. రాత్రి సేవలైన తర్వాత గుడిలో అదృశ్యుడై ఆమె ఇంటికేగి ఆమె రచించిన కావ్యములు ఆమె చదువగా స్వామి వినేవారు. ఒక దినమున శ్రీ స్వామి ఆమెను ఏమిటి నా చిట్టితల్లి నా రాకను గమనించకుండా దీర్ఘాలోచనలో పడితివి. నాకు చెప్పుటకు సందేహమెందుకు? అనగా కంగారుగా లేచి స్వామిని కూర్చుండజేసి “దివ్యమంగళ స్వరూపా” నా సర్వస్వమైన నా స్వామీ మీకు తెలియనిది ఏమి కలదు? రాను రాను భక్తుల రాక ఎక్కువయింది. నేనా సామాన్యురాలను. నిన్ను సేవించుటే నా కర్తవ్యము. అట్టి అవకాశము నాకు లభించుట లేదు. ఏమి చేయుదును? వయస్సు పైబడుచున్నది. ఇది ఎట్లు పరిష్కరించగలనో తెలియలేదు. నేను ఏమి చేయుదును స్వామీ అని కన్నీటితో బాధపడెను. అంత స్వామి మందహాసము చేయుచూ నీవు చింతించవలదని చెప్పి నీవు తుంబురకోన కేగుము. అక్కడొక రహస్య గుహ కలదు. అది ఎవరూ కనుగొనలేరు. అచట ఒంటరిగా తపమాచరింపుమని చెప్పెను. అందుకామె బదులు పలుకుచూ స్వామీ! కరుణా సాగరా! నిన్ను నిత్యమూ చూచి సేవించనిదే నేను బ్రతకలేను తండ్రీ అని చెప్పి వెక్కి వెక్కి ఏడ్చుచుండగా శ్రీ స్వామి మరలా మందహాసము చేయుచు నీకొక వరమొసంగుచుంటిని. తుంబురు కోన గుహ నుండి యోగమార్గాన రోజూ రాత్రి గుడి తలుపులు మూసిన తరువాత నా గర్భాలయము లోనికి వచ్చి నన్ను దర్శించి, భక్తితో సేవించి పూజించవచ్చునని తెలుపగా స్వామి పాద ద్వయమును తన కన్నీటితో అభిషేకించి నాకీ భాగ్యము చాలు ప్రభో అని అనగా అంత స్వామి అదృశ్యుడయ్యెను.

తదుపరి వెంగమ్మ తుంబురుకోనకు పోగా ఆమె భక్తులకు కనిపించలేదు. ఆమె ఎటో వెళ్ళిపోయెనని అందరూ భావించారు. రోజూ అర్చక స్వాములు గుడి తలుపులు మూసేముందు స్వామి చెంత పువ్వులు, గంధం, కర్పూరం, తీర్థజలము అలాగే ఉంచేవారు. బ్రహ్మాది దేవతలు అదృశ్యమయ రూపంలో వచ్చి స్వామిని సేవిస్తారని ప్రతీతి. ప్రతిరోజు ఆ జలమునే బ్రహ్మ తీర్థమనే పేరుతో ఉదయం భక్తులకు ఇవ్వడం జరుగుతుంది. వెంగమ్మ తపమాచరించుచు స్వామి ఇచ్చిన వరప్రభావం వలన ప్రతిరోజూ రాత్రి యోగ మార్గమున వచ్చి శ్రీ స్వామిని పూజించి సేవించి వెళ్ళేది. అర్చకులు ఉదయం చూసేసరికి రోజూ ఎవరో రాత్రిపూట స్వామిని పూజించుచున్నారని అక్కడి దృశ్యం అగుపడుచున్నదని అనుమానం పొడసూపింది. ఇది ఎటుల సాధ్యం? బీగములను బిగించి ఉన్న గర్భాలయం లోనికి ఎవరు మాత్రం ఎటుల వెళ్ళగలరు? విషయం అర్థం కాక ఆవేదన చెందిన అర్చకుడు పాలనా అధికారి అగు మహంతుకు విషయమంతయూ వివరించెను.

అంత మహంతు ఆలోచించి తనను గర్భగుడి యందుంచి



బయట తాళం వేసి సుప్రభాత సమయమున తెరచునట్లు, తానే స్వయంగా పరిశీలించెదనని ఆజ్ఞ జారీ చేసెను. అర్చకులు అట్లే చేసిరి. ఒక రాత్రివేళ రహస్యముగా పరిశీలించుచుండ వెంగమాంబ వచ్చి స్వామిని పూజించుట కన్నులార గాంచి అతడు మూర్ఛపోయెను. సుప్రభాత సమయమున అర్చకులు వచ్చి గర్భగుడి తలుపులు తీసి మహంతును స్పృహలోకి తెచ్చి అడుగగా యదార్థమును వివరించి రోజూ వెంగమాంబ ఇచటకు వచ్చి ఈ స్వామిని పూజించుచున్నదని వెల్లడించెను. ఈ విషయం అందరికీ వెల్లడై ఒక చర్చనీయాంశమయ్యెను.

అటుల కొంతకాలము సేవించిన తదుపరి వృద్ధాప్యం రాగా తులసి మాలను చేత ధరించి ఆలయ అధికారికి, అర్చక స్వాములకు, అందరూ అధికార, అనధికారులకు, భక్తులకు వందనములు అర్పించి తులసిమాలను స్వామికి అర్పించి అందరూ చూచుచుండగా తన దేహం అచట విడిచి కైవల్యము చెందెను. ఒక కారణ జన్మురాలి విజయగాథ ఈ రీతిగా ముగిసిపోయెను. ఈనాటికీ వారి వంశం వారు మాతృశ్రీ వెంగమ్మ గారిచ్చిన ముత్యాల హారతి శ్రీస్వామి వారి పవళింపు సేవలో జరుపుచున్నారు. ఇది ఎంతటి మహాభాగ్యము! ఈనాడు కూడా మనం ప్రత్యక్షముగా శ్రీ స్వామివారి పవళింపు సేవలో వెంగమ్మ వారి వంశజులు ఈనాటికీ ఇస్తున్న ముత్యాల హారతిని తిలకించి తరించే భాగ్యం మనకు కల్పించారావిడ.

హారతి :

**మంగళ మలమేలుమంగా చిత్తార్థ**
**సారంగా ఇది నీకు జయమంగళం**
**సురుచిర నీకు శుభ మంగళం**
**సద్గురుండవు నీకు సర్వమంగళం**
**ఏడుకొండలవాడా! వేంకటరమణా!**
**గోవిందా! గోవిందా! గోవిందా!**

**సర్వేజనాః సుఖినో భవంతు**

# స్కంద షష్ఠి

– డా॥ దేవులపల్లి పద్మజ



**శక్తిహస్తం విరూపాక్షం శిఖివాహన షడాననం ।**
**దారుణం త్రిపురోగఘ్నం భావయే కుక్కుట ధ్వజం ॥**

**సుబ్రహ్మణ్య అనే పదానికి సంస్కృత భాషలో బ్రహ్మ జ్ఞానాన్ని తెలుసుకున్న ఉత్తముడు అని అర్థం. ఈయనను స్కందుడు, క్రౌంచ ధారణుడు, కుమారస్వామి, కార్తికేయుడు, శరవణభవుడు మొదలైన నామాలతో కొలుస్తారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న భారతదేశంలోని అనేక సంస్కృతుల కలయికతో ఏర్పడినదే సుబ్రహ్మణ్యారాధన. ఈయనలో శైవ మరియు వైష్ణవ మతాలు మనకు కనిపిస్తాయి.**

శైవమత పురాణాల ప్రకారం స్కందుడు శివుని పుత్రుడు కనుక ఈయన శైవమతానికి చెందినవాడు. భగవద్గీతలోని విభూతి యోగములో శ్రీకృష్ణుడు "సేనానీ నామహం స్కన్ద" అనగా "సేనానులలో స్కందుడను నేనే" అని చెప్పడం ద్వారా ఈయన విష్ణ్వంశ సంభూతునిగాను, వైష్ణవమతానికి చెందినవాడు గాను పేర్కొనవచ్చును. శివకేశవులకు భేదం లేదని చెప్పటానికి సుబ్రహ్మణ్యస్వామి ప్రత్యక్ష నిదర్శనం. స్కాందపురాణములో కార్తికేయుని వివరంగా వర్ణించటం జరిగింది.

మార్గశిర శుద్ధ షష్ఠి తిథిని సుబ్రహ్మణ్య షష్ఠి అని వ్యవహరిస్తారు. శ్రీ పరమేశ్వర తేజస్సు షట్ కృత్తికల గర్భంలో ప్రవేశింపగా, వారు దానిని భరింపలేక గంగాతీరాన విడువగా ఆరు ముఖాలతో, అమితమైన తేజస్సుతో సుబ్రహ్మణ్యుడు ఉద్భవిస్తాడు. అందువలన ఈయనను షణ్ముఖుడు అని వ్యవహరిస్తారు. పరమేశ్వరుడు, పార్వతీదేవి తమ తమ శక్తివంతమైన ఆయుధాలను ఈయనకు ప్రసాదిస్తారు. వాటి ప్రభావంతో తారకాసురుని సంహరించి లోకాలను కాపాడుతాడు. దేవతల కోరిక మేరకు స్కందుని దేవతల సేనానిగా పరమేశ్వరుడు నియమిస్తాడు. ఈ శుభ సందర్భంలో దేవేంద్రుడు తన కుమార్తె అయిన దేవసేనతో అతి వైభవంగా వివాహం జరిపిస్తాడు. సుబ్రహ్మణ్యుడు తాను వలచిన వల్లీదేవిని కూడా వివాహం చేసుకుంటాడు. వల్లీదేవి ఇచ్ఛాశక్తి గాను, దేవసేన క్రియాశక్తి గాను వ్యవహరింపబడతారు. ఇదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, నేటికీ సుబ్రహ్మణ్య షష్ఠినాడు సుబ్రహ్మణ్య స్వామివారికి వల్లీ దేవసేన సహితంగా వివాహం జరుపుతుంటారు.

శ్రీ సుబ్రహ్మణ్యారాధన అత్యంత విశేషమైనది. ఇది అతి నియమ నిష్ఠలతో కూడుకున్నది. వివాహ సమస్యలకు, సంతాన ప్రాప్తికి, అనారోగ్య సమస్యలకు, జాతకంలోని కుజ మరియు కాలసర్ప దోషాలకు సుబ్రహ్మణ్యారాధన విశేష ఫలవంతమైనది. ఉదయానే తలస్నానం చేసి, తడిబట్టలతో స్వామివారికి పాలు, పువ్వులు, వెండి పడగలు, పండ్లు మొదలైనవి సమర్పిస్తారు. రోజంతా ఉపవసించి, రాత్రివేళ ఫలహారం చేస్తారు. మద్య మాంసాదులు స్వీకరింపరాదు. నాగప్రతిష్ఠ చేయటం ద్వారా సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. తమ తమ కోరికలు తీరిన భక్తులు స్వామివారికి కావడి రూపంలో మొక్కులు చెల్లించుకుంటూ ఉంటారు. తాంత్రిక విధానంలో కూడా సుబ్రహ్మణ్యుని ఆరాధించే విధి విధానాలు మనకు కనబడుతాయి. కాని అవి శాస్త్ర విధి విధానాలతో చేయకపోయినట్లయితే తీవ్రమైన చెడు ఫలితాలు సంభవిస్తాయని పెద్దలు చెబుతారు. అందువలన తాంత్రిక విధివిధానాల ద్వారా కాకుండా సౌమ్య పద్ధతులలో శ్రీ స్వామివారిని కొలుచుట సర్వదా శ్రేయస్కరము. సుబ్రహ్మణ్యస్వామివారి జన్మనక్షత్రము కృత్తిక. ఆషాఢమాసంలో వచ్చే కృత్తికా నక్షత్రము నాడు స్వామివారిని అర్చిస్తే కుజ సంబంధమైన చెడు ప్రభావాలు తొలగి సుఖ శాంతులు కలుగుతాయి. స్వామివారిని ప్రసన్నం చేసుకోవటానికి స్కందషష్ఠి వ్రతం అత్యంత ఉపకరమైనది.

భారతదేశంలో అనేక ప్రముఖ సుబ్రహ్మణ్య

దేవాల యాలున్నాయి. తమిళనాడులోని పళని, స్వామిమలై, తిరుత్తణి, తిరుప్పరన్ కుండ్రం, తిరుచ్చందూర్ మరియు పలముదుర్ సోలై అనే ఆలయాలు, కర్ణాటకలో కుక్కి సుబ్రహ్మణ్యస్వామి, ఘాటి సుబ్రహ్మణ్య అనే దేవాలయాలు, ఆంధ్రప్రదేశ్ లోని మోపిదేవి క్షేత్రము, గుజరాత్ లోని భుజంగనాగ్ ఆలయము కార్తికేయుడు ప్రధాన దైవంగా పూజలందుకుంటున్న పుణ్యక్షేత్రాలుగా భాసిల్లుతున్నాయి.

సుబ్రహ్మణ్యస్వామిలో జ్ఞాన, వైరాగ్య, బల, కీర్తి, సంపద, దైవశక్తి అనే ఆరు లక్షణాలు కనబడుతాయి. స్వామివారి ధ్వజమైన కోడిపుంజు (కుక్కుటము) ఉదయించే జ్ఞానాన్ని మరియు ప్రకాశాన్ని సూచిస్తుంది. తామస లక్షణాలైన అహంకారం, గర్వం, డాంబికం మొదలైన లక్షణాలకు ప్రతీక అయిన నెమలిని అధిరోహించడం ద్వారా వాటిని అదుపు చేసే శక్తి సమన్వితుడిగా కొలువబడుతున్నాడు. ''శరవణభవ'' అని కూడా స్వామివారిని కీర్తిస్తారు. ఈ నామంలోని అక్షరాల ప్రాముఖ్యత క్లుప్తంగా తెలుసుకుందాం. 'శ' ప్రజాకర్షణ శక్తికి, 'ర' సౌభాగ్యానికి, 'వ' శారీరక సమస్యల పరిష్కారానికి, 'ణ' శత్రునాశనానికి, 'భ' జీవిత మాధుర్యానికి, 'వ' దుష్టశక్తుల నిర్మూలనానికి సంకేతంగా పేర్కొంటారు. ఈయన ఆయుధము పేరు శక్తి. దీనినే వేలాయుధము అని కూడా పిలుస్తారు.

పరమేశ్వర వాహనమైన నందీశ్వరుడు అగస్త్య మహర్షికి ప్రసాదించిన స్కందకుమార అష్టోత్తరాన్ని భక్తి శ్రద్ధలతో పఠించిన వారి సమస్యలన్నీ తొలగిపోతాయని స్కాందపురాణము మనకు వివరిస్తోంది. శ్రీ శంకరాచార్యుల వారు రచించిన ''సుబ్రహ్మణ్య భుజంగం'' మానవాళికి మహత్తరమైన వరము. అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీ శంకరాచార్యులవరు తిరుచందూర్ క్షేత్రములో స్వామివారిని దర్శించి, తన్మయత్వం చెంది తన శారీరక బాధలను సైతం మరచి ''సుబ్రహ్మణ్య భుజంగం'' అనే స్తోత్రాన్ని ఆశువుగా పఠిస్తారు. తక్షణమే ఆయనకు అనారోగ్యం నుంచి ఉపశమనం కలుగుతుంది. కార్తికేయుని మనస్ఫూర్తిగా, భక్తి శ్రద్ధలతో కొలిచేవారి కొంగుబంగారమై, ఏదో ఒక రూపంలో వచ్చి సమస్యలను పరిష్కరిస్తాడు. నిండు మనస్సుతో అయిదు మంగళవారములు సుబ్రహ్మణ్య స్వామిని మందారపూవులతో అర్చిస్తే మంచి సంతానం కలుగుతుందని శాస్త్ర వచనం.

**ఆపద్బాంధవ సుబ్రహ్మణ్యం అనాథ రక్షక సుబ్రహ్మణ్యం**
**సద్గురునాథ సుబ్రహ్మణ్యం ఓం గురునాథ సుబ్రహ్మణ్యం**
**పార్వతీపుత్ర సుబ్రహ్మణ్యం పరమదయాళ సుబ్రహ్మణ్యం**
**సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం షణ్ముఖనాథ సుబ్రహ్మణ్యం**

ఈ సుబ్రహ్మణ్య షష్ఠి తిథి నాడు మరియు ప్రతి మంగళవారము నాడు భక్తి శ్రద్ధలతో స్వామివారి ఆరాధన చేసి తరిద్దాం. మన సాంప్రదాయాలను ముందు తరాలవారికి అందిద్దాం.

★★★


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుచుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

సీతాదేవి చనిపోతే రామలక్ష్మణులుండరు. వారు పోతారు. వాళ్ళిద్దరూ పోతే సబాంధవంగా సుగ్రీవుడు చనిపోతాడు. ఈ వార్త అయోధ్యకి చేరితే భరత శత్రుఘ్నులు కూడా పోతారు. ఇక్ష్వాకు వంశమే నాశనమైపోతుంది. నేనెంత దురదృష్టవంతుణ్ణి. ధర్మార్థాలు రెండింటికి చెడినవాణ్ణి. రోష దోషం కమ్మినవాణ్ణి. లోక నాశకుణ్ణి.

**"అథవా చారు సర్వాంగీ రక్షితా స్వేన తేజసా ।**
**న నశిష్యతి కల్యాణీ నాగ్ని రగ్నే ప్రవర్తతే ॥**

మంగళ స్వరూపిణి సర్వాంగ సుందరి సీతాదేవి. తన దివ్యతేజస్సు ఆమెని రక్షిస్తుంది. అగ్నిని అగ్ని దహించ జాలదు. అయితే తేజశ్శాలి ధర్మాత్ముడు రాముడు. అతని భార్య సీతమ్మ. తన ప్రవర్తనతో తనే రక్షింపబడుతుంది. ఆమెను అగ్నిదేవుడు స్పృశించలేదు. ఆ అగ్ని నన్నే దహించలేదు. నా తోకనూ కాల్చలేదు. అది రామ ప్రభావం. సీతాదేవి పుణ్యం. కనుక ఆ రామ మనః కాంత కాలిపోయి ఉండదు – అలా అనుకుంటున్నాడు. ఆకాశమార్గంలో మాటలు వినిపించాయి.

ఆహా! ఏమాశ్చర్యం! రాక్షసుల భవనాల్ని దహించాడు హనుమంతుడు. ఎవ్వరూ చేయలేని పని చేశాడు. స్త్రీలు రాక్షసులు బాలలు వృద్ధులు ఆక్రందిస్తున్నారు. పరుగులిడుతున్నారు. కోట బురుజులు ప్రాకారాలు ద్వారాలు దగ్ధమవుతున్నాయి. అశోకవనంలో సీతాదేవి మాత్రం దగ్ధం కాలేదు. ఇది అత్యద్భుతం. మహాశ్చర్యం.

విన్నాడు హనుమంతుడు. తలెత్తాడు. చూశాడు. చారణులు చెప్పుకుంటున్నారు. ఆకాశంలో పోతున్నారు. మారుతి మనసు కుదుటపడింది. సంతోషించాడు. ప్రత్యక్షంగా చూడాలి సీతమ్మని. సెలవు తీసుకోవాలి, వెళ్ళిపోవాలి – అది హనుమ నిశ్చయం.

## తిరుగు ప్రయాణం

అశోక వనానికి వచ్చాడు హనుమంతుడు. శింశుపా వృక్షం కింద వుంది సీతమ్మ. క్షేమంగా ఉంది. చూశాడు. పాదాభివందనం చేశాడు. 'అమ్మా! నిన్ను చూడగల్గాను. అదృష్టం. ఇక నేను వెళ్తాను సెలవు' అన్నాడు.

వినిందామె. అంటోంది 'హనుమా! నీ బలం ప్రశంసనీయం. రామ సన్నిధికి నన్ను చేర్చగలవు. అందుకు సమర్థుడవు నీవే. రాముడు రావాలి. శరవర్షం కురిపించాలి. లంకను చిరాకు పరచాలి. నన్ను తీసుకెళ్ళాలి. అది అతని పరాక్రమానికి తగింది'.

విన్నాడు హనుమ. అంటున్నాడు 'అమ్మా! రాముడు త్వరలో వస్తాడు. శత్రు సంహారం చేస్తాడు. నీ దుఃఖం పోగొడతాడు. నిన్ను తీసుకెళ్తాడు. అది హనుమ ఊరడింపు. తర్వాత నమస్కరించాడు.

బయల్దేరాడు.

రాముణ్ణి చూడాలని ఉత్సాహపడ్డాడు. అరిష్టనేమి పర్వతం అ ధిరోహించాడు. ఆ మహాపర్వతం నల్లని వన పంక్తులతో ఉంది. శిఖరాలపై మేఘాలు పారాడుతున్నాయి. అవి పర్వతానికి ఉత్తరీయంగా ఉన్నాయి. గైరికాది ధాతువులు కన్నుల్లా ఉన్నాయి. జలపాతాలు వేదాధ్యయనం చేస్తున్నట్లున్నాయి. ఎత్తైన దేవదారు వృక్షాలు చేతులు పైకెత్తి తపస్సు చేస్తున్న మహర్షుల్లా ఉన్నాయి. అలా పర్వతాన్ని అద్భుతంగా వర్ణించాడు వాల్మీకి. ఆ శ్లోకాలు పది.

ఎగరాలనుకున్నాడు హనుమంతుడు. పర్వతాన్ని పాదాలతో తొక్కాడు. బండరాళ్ళు పటపట పగిలాయి. పిండి పిండి అయ్యాయి. దేహాన్ని పెంచాడు. సముద్రాన్ని చూశాడు. ఎగిరాడు. ఆ ఊపుతో పర్వత ప్రాణులన్నీ కంపించాయి. మహావృక్షాలు విరిగాయి. పూల చెట్లన్నీ నేలరాలాయి. కిన్నర ఉరగులు గంధర్వులు యక్షులు విద్యాధరులు అందరూ ఆకాశానికెగిరారు. 30 యోజనాల ఎత్తు 10 యోజనాల వెడల్పుతో ఉన్న పర్వతం నేలమట్టమైంది. ఆకాశం అనే సముద్రంలో పడవలా సాగిపోతున్నాడు హనుమ. వింటినుంచి వదలిన బాణంలా పోతున్నాడు మారుతి. మైనాక పర్వతం కనిపించింది. దానిని మళ్ళీ చేతితో స్పృశించాడు. ముందుకెళ్ళాడు. మహేంద్రగిరి సమీపిస్తోంది. తన మిత్రుల్ని చూడాలని ఉబలాటం. గట్టిగా గర్జించాడు. తోకను జాడించాడు.

అంగదజాంబవంతాదులుతీరానఉన్నారు.గర్జనవినపడింది. హనుమ సింహనాదంగా గుర్తించారు. ఉత్సాహభరితులైనారు. లేచారు. అందరినీ పిలిచాడు జాంబవంతుడు.

**సర్వథా కృత కార్యోసీ హనుమాన్ నాత్ర సంశయః ।**
**నహ్యస్యాకృత కార్యస్య నాద ఏవం విధో భవేత్ ॥**

కార్యం సాధించి వస్తున్నాడు హనుమంతుడు. సందేహం లేదు. కృతకృత్యుడు కాకపోతే అలా సింహనాదం చేయడు. హనుమ బాహువేగం ఊరవేగం గమనించారు. సంతోషించారు. గంతులు వేశారు కొందరు. చెట్లెక్కారు కొందరు. ఆ కొమ్మ నుంచి ఈ కొమ్మ మీదికి దూకుతున్నారు కొందరు. కొందరు కొమ్మలు విరిచారు. పట్టుకున్నారు. గాలిలోకి ఊపుతున్నారు. స్వాగతం పలికే పతాకాల్లా ఉన్నాయి అవి. పర్వతం మీద కాలు మోపాడు హనుమ. చూశారు. అందరూ అంజలి ఘటించారు. మహాశక్తిమంతుడు పర్వత సమానుడు హనుమంతుడు.

వానర యోధులందరూ చుట్టూ చేరారు. వారి ముఖాల్లో అపరిమితమైన ఆనందం. కొందరు కందమూలాలు, కొందరు పళ్ళు కానుకలుగా సమర్పించారు. అందరి పూజలందుకున్నాడు మారుతి.

'దృష్టా సీతా' – చూశాను సీతను – అది సంక్షిప్త నివేదన.

అంగదుని చేయి పట్టుకున్నాడు. అతను హనుమ చేయి పట్టుకున్నాడు. రమణీయమైన ప్రదేశం చూశారు. అక్కడ కూర్చున్నారు. అంటున్నాడు హనుమంతుడు.

వానర పుంగవులారా! లంకానగరం లోకి వెళ్ళాను. అశోకవనం ఉందక్కడ. చూశాను సీతమ్మను. రామదర్శనం కోపం తపిస్తోంది. ఉపవాసాలుంటోంది. బాగా చిక్కిపోయింది. ఆ పతివ్రత తల జడలు కట్టింది. ఒకే జడతో ఉంది. శరీరమంతా మురికి పేరుకుపోయింది. ఆమె చుట్టూ రాక్షస స్త్రీలున్నారు. వాళ్ళు భయంకరులు. కాపలా కాస్తున్నారు.

విన్నారు. మహానంద భరితులైనారు. సింహనాదాలు చేశారు. కేకలు వేశారు. రంకెలు వేశారు. కిల కిల నవ్వారు. గర్జించారు. తోకలు పైకెత్తారు. నేలకేసి కొట్టారు. పర్వత శిఖరాలు ఎక్కారు. దూకారు. హనుమంతుని తాకారు.

అంటున్నాడు అంగదుడు. మారుతీ! బలంలో కానీ వీర్యంలో కానీ నీకు సాటి లేరు. విస్తీర్ణమైన సముద్రాన్ని దాటావు. తిరిగి వచ్చావు.

**అహో స్వామిని తే భక్తిః అహో వీర్య మహో ధృతిః ।**
**దిష్ట్యా దృష్టా త్వయా దేవీ రామ పత్నీ యశస్వినీ ॥**


అహో! నీ స్వామి భక్తి, నీ పరాక్రమం, నీ ధైర్యం అద్భుతం. కీర్తిమంతుడు రాముడు. అతని భార్యని చూడగల్గావు. అది మన అదృష్టం. జానకి ఎడబాటుతో ఉన్నాడు రాముడు. ఇక ఆ శోకం త్యజిస్తాడు. అది మన భాగ్యఫలం.

తర్వాత హనుమ చెప్పసాగాడు. సముద్ర లంఘనం, లంకా ప్రవేశం, అన్వేషణ, సీతాదర్శనం, రావణునితో మాట్లాడటం. అందరూ సవిపులంగా వినాలనుకున్నారు. అందరూ వినయంతో చేతులు జోడించారు. దేవలోకంలో దేవతల మధ్య దేవేంద్రునిలా తేజరిల్లాడు హనుమంతుడు.

## అన్వేషణ వృత్తాంతం

వాయుపుత్రుని చుట్టూ చేరారు వానర యోధులు. జాంబవంతుడు అడుగుతున్నాడు "హనుమా! సీతాదేవిని ఎలా చూశావు? రావణుడు ఎలా ప్రవర్తించాడు? అన్నీ పూర్తిగా వివరించు. తర్వాత ఏం చేయాలో ఆలోచిద్దాం. రామునికేది చెప్పాలో, ఏది దాచాలో నీవే నిర్ణయించు".

విన్నాడు మారుతి. మనసులో సీతమ్మకి నమస్కరించాడు. పులకితగాత్రుడైనాడు. చెబుతున్నాడు. "మహేంద్ర పర్వతం మీదికి ఎగిరాను. మీరు చూశారు. సముద్రంపై పోతున్నాను. ఒక బంగారు కొండ అడ్డగించింది. అదొక విఘ్నమనుకున్నాను. తోకతో కొట్టాను. దాని శిఖరం నూరు ముక్కలైంది. 'పుత్రా' అని పిలిచాడు. ఆ పర్వతం మానవరూపం దాల్చింది. నీ తండ్రి వాయువు నాకు మిత్రుడు. నేను మైనాకుణ్ణి. పూర్వం



పర్వతాలకి రెక్కలుండేవి. ఇష్టం వచ్చినట్లు ఎగిరేవి. లోకాల్ని బాధించేవి. వజ్రాయుధం తీసుకున్నాడు ఇంద్రుడు. పర్వతాల రెక్క లు నరికాడు. నా వెంట పడ్డాడు. నాకు వాయువు తో డైంది. ఆ పుణ్యఫలంతో ఈ సముద్రంలో పడ్డాను. రామ కార్యమై పోతున్నావు. అలసట తీర్చుకో. విశ్రమించు కాసేపు అన్నాడు. అతనికి నా పని చెప్పాను. ఆగలేనన్నాను. అనుమతి తీసుకున్నాను. ముందుకు సాగాను.

నాగమాత సురసాదేవి అడ్డగించింది. దేవతల వరం ఉంది నాకు. నీవు నాకు ఆహారమైపో. నిన్ను మింగేస్తానంది. నేను నమస్కరించాను. సీతాన్వేషణకై పోతున్నానని చెప్పాను. సీతమ్మను చూస్తాను. రామునికి చెబుతాను. తిరిగి వస్తాను. నీ నోట పడతాను అని చెప్పాను. ఆమె కామ రూపిణి. నోరు పెద్దది చేసింది. నేను దేహం పెంచాను. అలా పెంచుతుంటే – నేను అంగుష్ఠమాత్రుణ్ణయ్యాను. నోట్లోకి దూరాను. వచ్చాను. అపుడు సురస నిజరూపం చూపింది. నా కార్యం సిద్ధిస్తుందని ఆశీర్వదించింది. నేను ముందుకు వెళ్ళాను.

నన్నెవరో పట్టి లాగినట్లనిపించింది. నా వేగం తగ్గింది. సముద్రంలో ఓ రాక్షసి. ఛాయాగ్రాహి. నా నీడని పట్టి లాగింది. నోరు పెద్దది చేసింది. నా శరీరం తగ్గించాను. నోట్లోకి దూరాను. దాని గుండెని పట్టాను. తుంచాను. అది చచ్చింది. నేను ఆకాశంలోకి ఎగిరాను. సింహికను చంపాను. హనుమంతుడు భయంకరుడు – అన్నారు సిద్ధులు చారణులు.

ఆవలి తీరం చేరాను. పొద్దువాలిపోతోంది. రాక్షసులకి తెలియకూడదు. లంకలో ప్రవేశించాలనుకున్నాను. చీకటి పడింది. సింహద్వారం దగ్గరికి వెళ్ళాను. ఒక రాక్షస స్త్రీ అడ్డగించింది. నన్ను చంపాలనుకుంది. ఎడమ చేతి పిడికిలి బిగించాను. పోటు పొడిచాను. నేను లంకాపురి రక్షకురాలిని. నన్ను జయించావు. రాక్షసుల్ని కూడా జయిస్తావు. లోపలికి పో అంది.

లంకా నగరంలో ప్రవేశించాను. అంతటా వెతికాను. సీతమ్మ కనిపించలేదు. రావణాంతఃపురంలోకి పోయాను. అక్కడా లేదామె. కనపడలేదని దుఃఖించాను. అంతలో అశోకవనం కనిపించింది. అక్కడికి పోయాను. ఓ చెట్టుమీద కూర్చున్నాను. అది శింశుపా వృక్షం. ఆ చెట్టుకిందే ఉంది సీతాదేవి. చూశాను ఆమెని.

కమల పత్రాక్షి ఉపవాస కృశానన ఏకవేణి ఏకవస్త్ర ధారణి ధూళి దూసరిత కేశపాశ శోక సంతాప దీన. నిశితంగా చూశాను. ఆమె సీతాదేవి అని నిశ్చయించుకున్నాను.

అక్కడ రాక్షసాంగనలు భయంకరులు. రక్తం తాగుతున్నారు. మాంసం తింటున్నారు. ఆమె చుట్టూ ఉన్నారు. మాటి మాటికీ బెదిరిస్తున్నారు. రామధ్యానంతో ఉంది సీతమ్మ. చనిపోవాలనుకుంది.

అంతలో రావణుడు వచ్చాడు. ఆకుల మధ్యలో దాగాను. ఓ చిన్నపిట్టలా కొమ్మ మీదున్నాను. భార్యలతో వచ్చాడు రావణుడు. చూసింది సీతమ్మ. భయపడింది. ముడుచుకుని కూర్చుంది. దిగులుపడింది. రక్షకులు లేరనుకుంది. దీనంగా ఉంది.

రావణుడు నమస్కరించాడు. తలవంచాడు. సీతా! నన్ను గౌరవించు అన్నాడు. నీవు గర్విష్ఠివి. నీకు రెండు నెలలు గడువు ఇస్తున్నాను. ఈ లోగా నన్ను గౌరవించాలి. నా దగ్గరికి రావాలి. లేకపోతే నీ నెత్తురు తాగుతాను అన్నాడు.

కోపం తెచ్చుకుంది సీతాదేవి. రాక్షసాధమా! నా రాముడు పరాక్రమశాలి. అతని భార్యని నేను. దశరథుని కోడల్ని. నన్ను అనరాని మాటలన్నావు. నీ నాలుక తెగి పడలేదు. పరాక్రమ హీనుడా! దొంగచాటుగా తెచ్చావు నన్ను. నీవు దుష్టుడవు. పాపాత్ముడవు. రాముని దాసునిగా కూడా నీవు తగవు.

విన్నాడు రావణుడు. కోపంతో ఊగిపోయాడు. గుడ్లురిమాడు. పిడికిలి బిగించాడు. కొట్టి చంపాలనుకున్నాడు. అక్కడ స్త్రీలు హాహా కారాలు చేశారు. అతని భార్య మండోదరి ఉత్తమురాలు. నాతోరా క్రీడించు. ఈ సీత ఎందుకు? అని లాక్కెళ్ళిందతన్ని. అలా వెళ్ళాడు దశగ్రీవుడు. (ఆమె మండోదరి కాదు. ధాన్యమాలి. పేరు తెలియక అలా చెప్పాడు మారుతి)

రాక్షస స్త్రీలు పరుషంగా పలికారు. దారుణంగా బెదిరించారు. వారి మాటలు తృణప్రాయంగా భావించిందామె. వాళ్ళ బెదిరింపులు పని చేయలేదు. చుట్టూ చేరారు. నిద్రపోయారు.

సీతమ్మ దుఃఖించింది. ఏడ్చింది. త్రిజట ఒక వృద్ధ రాక్షసి. నిద్ర లేచింది. తక్కిన వాళ్ళని నిద్ర లేపింది. నాకు ఒక కల వచ్చింది. రావణుని నాశనం చూశాను. రాముని విజయం చూశాను. సీతాదేవిని చంపాలనుకున్నారు. ఆమె చచ్చిపోలేదు. మనం ఈ వైదేహిని ప్రార్థిద్దాం. ఆమె మంచిది. మన తప్పుల్ని క్షమిస్తుంది. ప్రసన్నురాలవుతుంది అందామె.

వినింది సీతమ్మ. త్రిజట చెప్పింది నిజమైతే మిమ్మల్ని కాపాడుతానంది. ఆమె దుర్దశను చూశాను. దుఃఖించాను. ఆమెతో మాట్లాడాలనుకున్నాను. ఉపాయం ఆలోచించాను. ఇక్ష్వాకు వంశాన్ని వర్ణించాను. వినిందామె. నన్ను చూసింది. ఎవరని అడిగింది. ఇక్కడికి ఎలా వచ్చావని అడిగింది. రామునితో మీకెలా సంబంధం కుదిరిందని అడిగింది.

సుగ్రీవుడు వానరరాజు. నీ భర్తకు సాయపడతానన్నాడు. నేను ఆ సుగ్రీవుని సేవకుణ్ణి. హనుమంతుణ్ణి. నన్ను దూతగా పంపాడు రాముడు. రామలక్ష్మణుల దగ్గరికి నిన్ను ఇపుడే చేరుస్తాను అన్నాను.

రాముడు రావాలి. రావణుని చంపాలి. నన్ను తీసుకెళ్ళాలి అందామె.

సరే అన్నాను. ఏదైనా గుర్తు ఇమ్మని అడిగాను. చూడామణి ఇచ్చింది. సందేశం వినిపించింది. ఆమెకు నమస్కారం చేశాను. ప్రదక్షిణ చేశాను. రెండు నెలలు గడువు. ఈలోగా రాముడు లక్ష్మణుడు రావాలి. నన్ను తీసుకెళ్ళాలి. లేకపోతే నన్ను చూడలేరు. అనాథలా మరణిస్తాను అంది.

ఆ మాటలు నాకు కోపం తెప్పించాయి. రాక్షసులతో యుద్ధం చేయాలి. చంపాలనుకున్నాను. అశోకవనం ధ్వంసం చేశాను. చూశారు రాక్షస స్త్రీలు. భయపడ్డారు. రావణునికి చెప్పారు.

ఎనిమిది వేలమంది కింకరులను పంపాడు రావణుడు. ఒక పరిఘను పట్టాను. అందరినీ చంపాను. జంబుమాలి వచ్చాడు. వాణ్ణి, వాడి సేనని చంపాను. మంత్రి పుత్రులు, సేనానాయకులు వరుసగా వచ్చారు. అందరినీ మట్టి కరిపించాను. అక్షకుమారుడు మండోదరి చిన్న కొడుకు వచ్చాడు. వాడు రణపండితుడు. వాడి కాళ్ళు పట్టాను. గిరగిరా తిప్పాను. నేలకేసి కొట్టి చంపాను. రావణుని పెద్ద కొడుకు ఇంద్రజిత్తు వచ్చాడు. వాడి సేనల్ని చంపాను. బ్రహ్మాస్త్రం వేశాడు వాడు. కట్టుబడ్డాను. పగ్గాలు తెచ్చారు. బంధించారు రాక్షసులు నన్ను. రావణుని దగ్గరికి లాక్కెళ్ళారు.

లంకకు ఎందుకు వచ్చావు? ఎందుకు అందరినీ చంపావు? అని అడిగాడు.

సీతాదేవిని చూశాను. బాధ కల్గింది. కోపం వచ్చింది. అలా చేశానని చెప్పాను. ఆమెని చూడాలని వచ్చాను. నేను సుగ్రీవుని మంత్రిని. వాయు పుత్రుణ్ణి. నా పేరు హనుమంతుడు. రామ దూతను. రామ సందేశం తెచ్చాను అన్నాను. నరవానర స్నేహం వివరించాను. వాలిని ఒకే బాణంతో చంపాడు రాముడు. ఇపుడు సీతాదేవిని రామునికి అప్పగించు. అలా చేయకపోతే వానరులందరూ వస్తారు. నీ సేనల్ని నాశనం చేస్తారు. నిన్ను చంపేస్తారు.

విన్నాడు రావణుడు. వాడి కన్నులు జ్యోతుల్లా ఉన్నాయి. నన్ను కాల్చేట్టు చూశాడు. చంపండని ఆజ్ఞాపించాడు. విభీషణుడు బుద్ధిమంతుడు. దూతని చంపరాదన్నాడు. వికృత రూపుణ్ణి చేయవచ్చు అన్నాడు. అది నచ్చింది రావణునికి. జనపనారలు తెచ్చారు. గుడ్డ పేలికలు తెచ్చారు. తోకకి చుట్టారు. నూనెపోసి తడిపారు. నిప్పంటించారు. తాళ్ళతో లాగారు నన్ను. పిడికిళ్ళతో పొడిచారు. రాజవీధిలో ఆపారు. నా గూర్చి చాటింపు వేయించారు.

నా శరీరం చిన్నది చేశాను. తాళ్ళన్నీ ఊడిపోయాయి. పర్వతాకారుణ్ణయ్యాను. ఇనుప గుదియ తీసుకున్నాను. రాక్షసుల్ని చంపేశాను. లంకంతా తిరిగాను. భవనాలు కోట బురుజులు గృహాలు అన్నింటికీ నిప్పు పెట్టాను. లంకా దహనం కావించాను.

**(సశేషం)**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 377. ప్రాగ్జోతిషాధిప ధ్వంసినే నమః

ప్రాగ్జ్యోతిష నగరమునకు అధిపతి నరకాసురుడు. అతనిని సంహరించినవాడు కృష్ణుడు.

ప్రాగ్జ్యోతిషము కిరాతులు, బోయలు నివసించు కామరూప దేశమునకు రాజధాని.

ఇతడు భూమిని ఉద్ధరించిన శ్వేత వరాహమూర్తియైన విష్ణువునకు, భూదేవికి పుట్టిన అసురుడు. ఇతని రాజధాని ప్రాగ్జ్యోతిషము. వాహనము సుప్రతీకమనెడు ఏనుగు. పుత్రుడు భగదత్తుడు. ఈ నరకాసురుడు ఇంద్రుని జయించుటచే ఇంద్రుని తల్లి అదితి యొక్క కర్ణకుండలములను, వరుణుని ఛత్రమును, మణిపర్వతమనుయెడు అమరాద్రి స్థానమును నరకునికి ఇంద్రుడు కోల్పోయినాడు. ఈ సంగతి ఇంద్రుడు ద్వారకకు వచ్చి కృష్ణునకు విన్నవించి నరకాసురుని సంహరించి దేవలోకమును రక్షించమని ప్రార్థించాడు. కృష్ణుడు సత్యభామా సహితుడై గరుడ వాహనారూఢుడై ప్రాగ్జ్యోతిషపురము చేరి నరకునితో యుద్ధము చేసి నరకాసురుని సంహరించినాడు. ఈ యుద్ధములో నరకునితో కొంతసేపు సత్యభామ కూడా యుద్ధము చేసింది.

కృష్ణుడు నరకుని పుత్రుడు భగదత్తునకు రాజ్యాభిషేకము చేయించినాడు. నరకుని మందిరమున చెరలో బంధింపబడిన పదునారు వేల రాజ కన్యలను బంధ విముక్తులను చేసి ద్వారకకు పోయినాడు. అనాథలైనవారు కులీనులైన రాజకుమారులకు అపరిగ్రహీతులు అయినందున ఆ 16 వేల రాజకన్యలను కృష్ణుడు వివాహము చేసికొని వారికి సుఖ జీవనముతో పాటు సమాజములో సముచిత స్థానమును కల్పించిన దయామూర్తి, సంఘ సంస్కర్త.

ప్రాగ్జ్యోతిషాధిపతి యగు నరకాసురుని సంహరించిన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 378. తత్సైన్యాంతకరాయ నమః

నరకాసురుని సైన్యమును హతమార్చినవాడు కృష్ణుడు.

నరకాసురుని సైన్యమును సంహరించిన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 379. అమృతాయ నమః

నమ్రీయతే అనేన అమృతః. మృతి లేకుండా చేయునది అమృతము. తనను భక్తితో అనుభవించు వారికి అమృతము వలె నుండి వారికి ఎంత అనుభవించినను ఇక చాలును అని తృప్తి కలిగించని అపర్యాప్తామృత స్వరూపుడు విష్ణుదేవుడు, కృష్ణుడు.


అమృతముతో సాటి అయిన భగవంతుడగు విష్ణువు యొక్క అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 380. భూమి స్తుతాయ నమః

భూదేవి చేత లేక భూలోకమున స్తోత్రముతో ఆరాధింపబడువాడు విష్ణువు. కృష్ణుడు.

కృష్ణుడు నరకాసురుని సంహరించిన తరువాత భూదేవి కృష్ణుని వద్దకు వచ్చి నమస్కరించి

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**



**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

అదితి కుండలములను వైజయంతి యను వనమాలను, వరుణుని తెల్లని గొడుగును, మేరు పర్వతము యొక్క మణి శిఖరమును కృష్ణునికి సమర్పించి ఇట్లు స్తుతించింది.

సీ. అంభోజనాభున కంభోజనేత్రున
కంభోజ నిలయా సమన్వితునకు
నంభోజపదను కనంత శక్తికి వాసు
దేవునకును దేవ దేవునకును
భక్తులు గోరిన భంగి నేరూపైన
బొందువానికి నాది పురుషునకును
నిఖిల నిదానమై యాపూర్ణ విజ్ఞాన
మైన వానికి బరమాత్మునకును

ఆ. ధాతను గన్న మేటి తండ్రికి నజునికి
నీకు వందనంబు నే నొనర్తు
నిఖిలభూత రూప నిరుపమ ఈశ ప
రా పరాత్మ మహిత యమిత చరిత ॥

పద్మనాభునకు, పద్మనేత్రునకు, లక్ష్మీదేవితో కూడి యున్నవానికి, పద్మముల వంటి పాదములు కలవానికి, అనంత శక్తివంతునకు, వాసుదేవునకు, దేవదేవునకు, భక్తుల కోరికల ననుసరించి ఏ రూపమైనా పొందు వానికి ఆదిపురుషునకు, సమస్తమునకు ఆది కారణమైన, పరిపూర్ణ విజ్ఞానమైన వానికి, పరమాత్మునకు పరాపరాత్మునకు, బ్రహ్మను కనిన తండ్రికి, విష్ణుదేవునకు నీకు వందనములు చేయుచున్నాను. సమస్త ప్రాణి రూపములందు సాటి లేనివాడా, ఈశుడా, అమితమైన చరిత్ర గల వాడా! అని స్తుతించింది.

భూమి స్తుతించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 381. భూరి భోగాయ నమః

మితి లేని భోగములను అనుభవించువాడు కృష్ణుడు. విష్ణువు.

అమితమైన అష్టభోగములను అనుభవించువాడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

అష్ట భోగములు – గృహము, స్త్రీ, శయ్య, వస్త్రము, ఆభరణము, పుష్పము, గంధము, తాంబూలములు.

## 382. భూషణాంబర సంయుతాయ నమః

విష్ణువు అలంకార ప్రియుడు. ఆ దేవుడు మహార్ఘములైన ఆభరణములు, వస్త్రములు ధరించువాడు.

పీతాంబర ధారిగా విష్ణువు ప్రసిద్ధుడు. అమూల్యములైన రత్నమాలలు, కౌస్తుభమణిని ధరించినవాడగు విష్ణువు యొక్క అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

భూషణాంబరములు అష్ట భోగములలోనివి.

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



## 37వ శ్లోకం

**వక్తుం సమర్థోపి న వక్తి కశ్చిత్**
**అహో జనానాం వ్యసనాభి ముఖ్యం**

అనంత! వైకుంఠ! ముకుంద! కృష్ణ! గోవిందా! దామోదరా! మాధవా! ఇలా భగవంతుని పవిత్ర నామాలను ఉచ్చరించటానికి మానవులకు సామర్థ్యమున్నా మానవు లెవ్వరూ అలా ఉచ్చరించ లేకుండా పోవటం ఎంత దురదృష్టకరం. కేవలం స్మరణ మాత్రమున అభీష్టఫలాలు ప్రసాదించే భగవన్నామాన్ని విస్మరించి జనులు క్లేశ కరములైన కార్యాలలో ఆసక్తులై, జూదం మొదలగు వ్యసనాలతో కాలం గడుపుతూ ఉండటం ఎంతో శోచనీయం.

మనిషికి పరమాత్మ నామస్మరణ చేయగల శక్తి ఉన్నప్పటికీ, అది చేయకుండా లోక వ్యవహారాలపై, వ్యసనాలపై, తక్కువ విషయాలపై మనసు పెట్టుకుంటాడు. దైవ నామస్మరణం ద్వారా లభించే శాంతి, విముక్తి వదిలి లౌకిక వ్యసనాలలో మునిగిపోవడం మనుషుల దౌర్భాగ్యం అని ఈ శ్లోకం గాఢంగా చాటుతుంది.

నామోచ్చారణమే అన్నింటికీ మూలం అని కులశేఖరులు అంటారు. అదే విషయాన్ని నిరూపించారు భద్రాద్రి "అన్నపూర్ణ సత్ర" నిర్వాహకుడు –వెంకట రమణ బ్రహ్మచారి గారు.

**జనన విశేషాలు**

గుంటూరు జిల్లా అలవలపాడులో ఆరువేల నియోగుల కుటుంబంలో పుట్టిన వెంకట రమణ బ్రహ్మచారి తండ్రి సుబ్బరామయ్య. పొట్టిగా, సన్నగా, ఎప్పుడూ ధావళీ గోచీతో మాత్రమే తిరిగేవాడు. గోదావరి నుండి నీళ్ళు మోసుకొని వచ్చి, తన సత్రానికి అందించేవాడు. ఆ సత్రానికి యజమాని వంటవాడు, నీళ్ళవాడు, పూజారి, సేవకుడూ అన్నీ సుబ్బరామయ్యే. 15వ ఏట భార్య చనిపోతే కొడుకును తీసుకొని భద్రాచల సీతారామకల్యాణం చూడటానికి వెళ్లి, చూసి ఆనందం పొంది అక్కడే ఉండి పోవాలనుకొని, భిక్షాపాత్ర చేబట్టి వచ్చేదానితో తానూ కొడుకు జీవిస్తూ అతిధి అభ్యాగతులను కూడా ఆదరిస్తూ, కొంతకాలానికి చనిపోయాడు.



**భద్రాద్రి అన్నపూర్ణ సత్రం**

అన్నపూర్ణ ఉపాసకుడైన వెంకట రమణ, తండ్రి మార్గంలోనే, శునక సూకరాలకూ ఇంతపెడుతూ, జీవిస్తూ, ధన్యుడయ్యాడు. 21వ ఏట "అన్నపూర్ణ సత్రం" అనే పేరుతొ ఒక కుటీరాన్ని, యాత్రికులకు ఒక పాకను నిర్మించి, దేవ మందిరంగా మరో గుడిసె వేసి అన్నదానం నిర్విఘ్నంగా సాగిస్తూ, క్రమంగా సత్రాన్ని పెద్ద అన్నదాన సత్రంగా మార్పు చెందించాడు. వంటపాత్రలు మొదలైన సామగ్రి కూడా బాగా సమకూర్చాడు. బ్రహ్మచారి చేతిలో చిల్లిగవ్వ లేదు. ఆ వూరు వదలి ఎక్కడికీ వెళ్ళే వాడు కాదు. సత్రం అరణ్యం దగ్గరలో ఉండటం, ధనవంతులు అక్కడ లేకపోవటం ఇబ్బందే కానే సత్రం మూడు పూలు ఆరుకాయలుగా దినదినాభివృద్ధి చెంది అందరికీ ఆశ్చర్యం కలిగించింది. తూము నరసింహదాసు గారు పూజించిన అర్చామూర్తుల పూజను బ్రహ్మచారి గారు భక్తీ శ్రద్ధలతో అర్చిస్తున్నారు.

**శ్రీరామ మహిమ**

ఒకసారి సీతారామకల్యాణానికి అనుకోకుండా వేలాది యాత్రికులు వచ్చి గోదావరీ స్నానం చేసి ఈ సత్రానికి భోజనాలకు వచ్చారు. వండిన పదార్థాలు చాలా స్వల్పంగానే ఉన్నాయి. అంతమందికి చాలవని భయపడుతూ వంటవాళ్లు భగవరాదనలో ఉన్న బ్రహ్మచారి గారితో చెప్పారు. ఆయన చాలా నిబ్బరంగా వంటశాలకు వెళ్లి "శ్రీరామానుగ్రహం ఉంటే మనకు తరుగు లేదు. ముందు వడ్డన పని మొదలు పెట్టండి" అని చెప్పి, ఆ పదార్థాలపై ఒక వస్త్రం కప్పి, చేతులు జోడించి నందీశ్వర సాన్నిధ్యం పొంది "భగవానుని గుణగానం చేసి, నరసింహదాసు గారి అర్చా

వైభవం ఎవరు పొందారో, నా పూర్వజన్మ సుకృతంతో నాకు నాపూజలో ఆత్మ స్వరూపుడుగా ఉన్నడో, ఆ శ్రీరామచంద్ర మూర్తి ఈ అన్నోదకాల చేత భూత సంతృప్తి గావించి అనుగ్రహించుగాక" అని చెప్పి యాత్రికులతో –

"తక్కువ లేదు నాకు నిరతంబు సుదర్శన చక్ర ధారియై – ప్రక్కల నిల్చి లోపముల బారగా దోలుచు, సౌఖ్య సంతతుల్ – మిక్కిలి కూర్చు మించు దయ మేలు లొనర్చెడి రాముదుండ – నాకెక్కడి లేము లెక్కడివి, ఇష్ట ఫల వ్యతిరేక సంగతుల్" అని చెప్పి వడ్డన మొదలు పెట్టమని వంటవారికి చెప్పి తన పూజా మందిరంలోకి వెళ్లి స్వామికి మంత్రం పుష్పం చెప్పి పూజ ముగించారు. పంచ భక్ష్య పరమాన్న విందు భోజనాలు తృప్తిగా ఆ రగించి బ్రహ్మచారి గారి ప్రభావాన్ని స్తుతిస్తూ సీతారామ దర్శనం చేసి కల్యాణం చూసి, నిత్యం ఈ సత్రం లోనే భోజనం చేసి, బ్రహ్మచారి గారి సత్కారాలు పొంది సంతృప్తిగా స్వగ్రామాలకు వెళ్లి పోయారు.

**మారు వేషాలలో రామ లక్ష్మణ దర్శనం**

ఇంకోసారి ఉత్సవాల రోజుల్లో ఓరోజు పగలు రెండు జాముల వరకు వంట పదార్థాలు లేకపోవటంతో వంటవాళ్లు భయపడి పారిపోయారు, రామపాదాలపై వ్రాలి "ఈ కష్టాన్ని ఎలా తీరుస్తావో నీదే భారం" అంటూ స్తోత్రగానాలు చేసి – "తిరురేఖ లేర్పడ తిరునామములు బెట్టి – దౌత వస్త్రంబులు దనర గట్టి – తులసి పేరులు మెడ దులకరింపగ దాల్చి – ననెమ్మేన గంధంబు నెరి దగిల్చి – వెడ నుత్తరీయముల్ నడుములకు జుట్టి – పూలదండలు శిఖ వ్రేలగట్టి – కుడిచేత జపమాల కొమరొప్పగా బూని – ఎడమచే బళ్ళెము లెనగ నంది – గక్ష భాగంబుల బుస్తకముల బూని – నలుపు నెరుపు గల మేను లరచుచుండ – బొడుగు గల వైశ్యు లిరువురు వడివడిగ వచ్చి – రా భూసురోత్తమ వసతి కడకు" వారిద్దరూ బ్రహ్మచారి దగ్గరకు వెళ్లి నమస్కరించి "అయ్యా! ఒకసారి సీతారాములకు మా ఆపద తీరితే రెండు వందల రూపాయలు మొక్కు చెల్లిస్తామని మొక్కుకొని అది తీర్చుకోవటానికి ఇప్పుడు వచ్చాం" అని చెప్పి ఒక పళ్ళెం నిండా ఉన్న ఆడబ్బు, రెండు కొబ్బరి కాయలు, తాంబూలం, కర్పూరం, సమర్పించగా బ్రహ్మచారి గారు పరమానందంతో కొబ్బరికాయలు కొట్టించి హారతిప్పించి, కట్నం చదివించి, వారిద్దరిని అన్నప్రసాదం భోజనం చేసి వెళ్ళమని కోరి వారిది ఏవూరో చెప్పమంటే "మేము తూర్పు దేశ వైశ్యులం కుటుంబంతో సహా వచ్చి గోదారితీరాన మీకుటీరంలో ఉన్నాం. మొక్కు తీర్చుకొని స్వామి దర్శనం చేసి వెడతాం. మా వాళ్ళు మాకోసం ఎదురు చూస్తుంటారు" అని చెప్పి అదృశ్యమయ్యారు.

ఆ ధనంతో పదార్థాలు తెప్పించి వంటవాళ్లు లేకపోవటంతో తానే గరిటకు పని చెప్పుదామని అనుకొంటుంటే – "పవిత్ర గోదావరి స్నానం చేసి నుదుట విభూతితో పిలక జుట్టు నీరుకావి ధోవతి తడిపొడి బట్టలతో, అంగోస్త్రాలతో చేతులలో ఉదకపాత్రలతో వేద పనసలు చదువుతూ సత్రం ఎక్కడుంది అని వెతుకుతూ ఇద్దరు వచ్చి "బీదవాళ్ళం వంట చేస్తాం. మీ సత్రంలో వంట పని మాకు ఇవ్వండి. మా పని మీకు ఎప్పుడు ఇష్టం లేకపోతే అప్పుడే వెళ్ళిపోతాం" అని చెప్పి బ్రహ్మచారి చేతిలో ఉండే రెండు జలపాత్రలనూ చెరొకటి తీసుకొని స్నానానికి గోదావరికి వెళ్ళారు. బ్రహ్మచారి గారు పూజామందిరంలో భగవంతుని లీలకు కృతజ్ఞతలు చెప్పుకొనగా, వారిద్దరూ వచ్చి అద్భుతంగా వంటలు చేయగా, స్వామికి సహస్రనామార్చన చేసి నైవేద్యం పెట్టి "రంగా! ఆరగింపు" అని వేడగా, ఎక్కడి నుంచో ఒక పాము సర్రున వచ్చి నైవేద్యాన్ని ఆఘ్రాణించి బ్రహ్మచారి గారి తొడపై కెక్కి హాయిగా ఆడింది, భోజనాలు పూర్తయ్యాయి. ఆ ఇద్దరు వంట కుర్రాళ్ళు గోదావరికి వెళ్లి వస్తామని చెప్పి మళ్ళీ రాలేదు. సర్వమూ మాయమైంది అంటూ భోజనం చేయకుండానే రామ మంత్రం జపిస్తూ, తెల్లవార్లూ జాగారం చేశారు. మర్నాడు ఉదయం ఈ వార్త తెలుసుకొన్న పురజనులు వచ్చి శ్రీరామ దర్శనం పొందిన ఆయనను అభినందించారు.

**గోదారి నీరే నెయ్యి**

మరోసారి ఒక బ్రాహ్మణ సమారాధనకు నెయ్యి లేదు. అభ్యాగతులను భోజనానికి కూర్చోమని చెప్పి, ఇద్దరు వంట వాళ్లకు చెరో నేతిపాత్రలిచ్చి "గోదావరికి వెళ్లి ఈ రెండు పాత్రల నిండా నెయ్యి అప్పుగా ఇవ్వమని చెప్పి నీటిని నింపుకొని రండి" అని పంపారు. వాళ్ళు ఇంటికి వచ్చేలోపు నీరు నెయ్యిగా మారిపోయి ఆశ్చర్యం కలిగించింది. దానితో వడ్డన పూర్తి చేసి అందరికీ సంతృప్తిగా అన్న సమారాధన జరిపించారు.

**గురు- శిష్యులు**

ఈ సత్రంలోనూ, మరికొన్ని చోట్లా ఊరు పేరు లేని ఒక పిచ్చివాడు తిరిగేవాడు. సన్నగా పొడుగ్గా చామన చాయతో చింపిరి బట్టలతో మూట, చిల్ల పెంకుల హారంతో ఉండేవాడు. బ్రహ్మచారిగారు అతడిని అత్యధికంగా ప్రేమించేవారు. ఆయన ఎవరు అని ఎవరైనా అడిగితే "నా గురువు" అని చెప్పేవారు. అతడిని అడిగితే "బ్రహ్మచారి నా శిష్యుడు" అనేవాడు అతడికి భోజనం పెడితే కానీ, బ్రహ్మచారిగారు భోజనం చేసేవారు కాదు. అతడు అన్నం తింటుంటే వెంట రెండు కుక్కలు ఉండి అవి కూడా తినేవి. ఇలా నిరతాన్న దానాన్ని వెంకట రమణ బ్రహ్మచారి 40 ఏళ్ళు నిర్విఘ్నంగా నిర్వహించి, ఈ భారమంతా వకీలు తుంగతుర్తి నరసింహారావు గారికి అప్పగించి క్రీ శ.1919లో శ్రీరామ రంగైక్యం పొందారు. నామోచ్చారణ మహిమను, దాని పరమార్థాన్ని తెలియచేసిన ధన్యులు బ్రహ్మచారి గారు.

ఓం నమో భగవతే వాసుదేవాయ

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## శ్రీ వామన పురాణాంతర్గతం

గత సంచిక తరువాయి

### కపిలతీర్థ మాహాత్మ్యం

పాతాళంలో కపిల మహర్షి పూజించిన శివలింగం కపిల లింగంగా ప్రసిద్ధి చెందింది. ఆ శివలింగాన్ని కామధేనువు తన క్షీరధారలచే అభిషేకించింది. అప్పుడు ఆ శివలింగం భూమిని ఛేదించుకొని పైకి వచ్చింది. అంతట ఆ కామధేనువు కోపించి తన కాలిగిట్టను ఆ శివలింగంపై పెట్టి దానిని నొక్కిపెట్టి 'నీవింక పెరగవద్దు' అని ఆజ్ఞాపించింది. ఆ విధంగా తన కాలిగిట్టలతో కామధేనువు అణచిపెట్టడం వలన ఆ శివలింగం ఆ పైన పెరుగలేదు. ఆ శివలింగం మొదట్లో రజత వర్ణంతోను, మధ్యభాగంలో బంగారు కాంతితోను, పైభాగాన ఎరుపు రంగుతోను ఉద్భవించింది. ఐదు ముఖాలు, మూడు నేత్రాలు కలదై పంచవర్ణ శోభితమై మహాభయంకరమై పాతాళంలో ఉన్న ఆ శివలింగాన్ని పూర్వం కృతయుగంలో కపిలమహర్షి పూజించాడు. అందువల్ల ఆయన కృతయుగంలో కపిలేశ్వరుడుగా ప్రసిద్ధి చెందాడు.

మహర్షిగా కృతే పూర్వం కపిలేన ప్రపూజితమ్ ।
'కపిలేశ్వర' ఇత్యేతత్ కృతేఖ్యాతం యుగేపురా ॥

- వామనపురాణం, అ.23 శ్లో.40

ఆ తరువాత త్రేతాయుగంలో అగ్నిచేత పూజించబడుటచే 'ఆగ్నేయ లింగం' గా ప్రసిద్ధి చెందింది. ఆద్యంతములేని ఆ మహాశివలింగం ద్వాపరయుగంలో సుదర్శన చక్రం చేత పూజింపబడింది. భవిష్యత్తులో కలియుగంలో మంగళకరమైన ఆ శివలింగాన్ని మరల కపిలమహర్షి పూజిస్తాడు. ఆ కపిలేశ్వరునికి ఎదురుగా మహత్తరమైన సరోవరమున్నది. దానిలోని నీరు పాతాళం నుండి పైకి ఉబికి వచ్చినది. పాతాళము నుండి పైకి వచ్చిన (మహాత్ముడైన కపిలమహర్షి బిలమార్గం రహస్యంగా ఉంది.) దానిని 'కపిలద్వారం' అని పిలుస్తారు. ఆ పవిత్ర సరోవరం నీటితో నిండి శోభాయమానంగా ఉంది.

ఆ తీర్థాన్ని దర్శిస్తేనే సర్వపాపాలు నశిస్తాయి. పార్వతీ! స్త్రీగాని, పురుషుడు కాని దాన్ని దర్శిస్తే స్వర్గప్రాప్తి కలుగుతుంది. ఆ తీర్థంలో స్నానం చేసి ఆ తీర్థాన్ని త్రాగినవారికి జరామరణాలుండవు. దానిలో ఒకమారు స్నానం చేస్తే వారు వాజపేయ, అశ్వమేధం మొదలగు యాగాలు చేసిన పరిపూర్ణ ఫలాన్ని పొందుతారు. వాజపేయ యాగాన్ని చేసిన, వానికి కూడా పునర్జన్మ ఉంది. కాని ఈ తీర్థంలో స్నానం చేసిన వానికి పునర్జన్మ లేదు.

కపిల తీర్థానికి పైభాగంలో వజ్రతీర్థముంది. దాంట్లో స్నానం చేస్తే యింకా పదిరెట్లు అధికఫలం పొంది దేవేంద్ర లోకానికి వెడతారు. ఆ వజ్రతీర్థానికి పైభాగంలో ఉన్న కుండంలో,

విష్వక్సేన సరోవరంలో స్నానం చేసిన వారికి వందరెట్లు అధిక ఫలం వస్తుంది. ఈ విధంగా ఆ పదిహేడు తీర్థాలకు చాలా గొప్ప ఫలం చెప్పబడింది.

దర్శనాదేవ తత్తీర్థం సర్వాఘౌఘ వినాశనమ్ ।
స్నానే పానే కృతే తస్మిన్ జరామరణ నాశనమ్ ।
వాజపేయాశ్వమేధానాం పుష్కలం ఫలమశ్నుతే ॥

**- వామనపురాణం - ఉ.23 శ్లో.44,45,46**

## కపిలతీర్థ స్నానకాల నిర్ణయం

ఓ పార్వతీ! కార్తీకమాసంలో పౌర్ణమినాడు మధ్యాహ్నసమయంలో ముల్లోకాలలోని సకల తీర్థాలు కపిలతీర్థంలో సంగమిస్తాయి. ప్రాణులను రక్షించుటకై మధ్యాహ్న సమయంలో పది ఘడియల కాలం ఆ సర్వతీర్థాలు కపిలతీర్థంలో ఉంటాయి. అప్పుడు ఆ తీర్థంలో స్నానం చేసిన పాపాత్ములైన పురుషులు గాని, స్త్రీలు గాని సకల పాపములనుండి విముక్తులై బ్రహ్మలోకానికి వెళతారు.

త్రైలోక్యే సర్వతీర్థాని కార్తికే మాసి పర్వణి ।
మధ్యాహ్నే కాపిలే తీర్థే సాన్నిధ్యం యాన్తిపార్వతి ।
తిష్ఠంతి ప్రాణిరక్షార్థం మధ్యాహ్నే ఘనాడికాః ।
తత్ర స్నాతాస్తు యే సాపాః పురుషా యోషితోనుతే ॥
సర్వపాప వినిర్ముక్తాః బ్రహ్మలోకం ప్రయాన్తి వై ।

**- వామనపురాణం అ.23 శ్లో.50,51,52**

ఆ తీర్థ సన్నిధిలో నువ్వు గింజంత బంగారాన్ని దానంచేస్తే అది మేరుపర్వతంతో సమానంగా ఫలితాన్నిస్తుంది. భిక్ష పెట్టినట్లు అక్కడ అన్నదానం చేస్తే చంద్రలోకాన్ని పొందుతారు. కన్యాదానం, గోదానం, భూదానం చేసేవారు, విద్యాదానం చేసేవారు, మంత్రోపదేశం చేసేవారు స్వర్గాన్ని, కైలాసాన్ని, వైకుంఠాన్ని బ్రహ్మలోకాన్ని పొందుతారు.

'ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి పర్వదినాన మధ్యాహ్న కాలంలో సకల తీర్థాలు కపిలతీర్థానికి వస్తాయి'. అవే ఈ మంత్రాన్ని ఉచ్చరించి స్నానంచేస్తే పైన చెప్పిన ఫలితాన్ని పొందుతారు.

'వర్షే వర్షే తు కార్తిక్యాం పౌర్ణమాస్యాం మహాతిథౌ ।
ఆయాంతి సర్వతీర్థాని మధ్యాహ్నే కాపిలం సరః ॥
ఇమం మంత్రం సముచ్చార్య స్నాతస్తత్ఫలమాప్నుయాత్ ॥

**- వామనపురాణం, అ.23 శ్లో.55,56.**

ఆ కపిల తీర్థంలో స్నానం చేసే మహాభాగ్యం కలగడం చాలా దుర్లభం. అది శ్రీమహావిష్ణువు యొక్క పరమపదమై యున్నది. ఓ పార్వతీ! ఇంత వరకు నీకు ఉత్తమమైన సకల తీర్థ మాహాత్మ్యాన్ని చెప్పాను. ఇకపైన వాయుదేవుని మహత్తరమైన తపస్సు గురించి వివరిస్తాను' అని పరమేశ్వరుడు పార్వతీదేవితో అన్నాడు.

స్నానంతు దుర్లభం తత్ర తద్విష్ణోః పరమం పదమ్ ।
ఇతి తే కథితం సర్వ తీర్థ మాహాత్మ్య ముత్తమమ్ ।
అతః పరం ప్రవక్ష్యామి పవనస్య తపో మహత్ ॥

**- వామనపురాణం, అధ్యాయం 23, శ్లోకం 5**

## వాయుదేవుని తపస్సు

మహాదేవుడైన శంకరుడు పార్వతీదేవితో 'దేవీ! పార్వతీ! వాయుదేవుడు భగవంతుని గూర్చి ఘోరమైన తపస్సు చేస్తాడు. ఆయన చేసే తపస్సు గురించి చెబుతాను విను. గ్రీష్మఋతువులో పంచాగ్ని మధ్యంలో నిలబడి, వర్షాకాలంలో భూమిపైన నిలబడి హేమంత శిశిర ఋతువులలో స్వామి పుష్కరిణిలో మునిగి వాయుదేవుడు తపస్సు చేస్తాడు. ఈ విధంగా వేయి సంవత్సరాలు తపస్సు చేయగా దేవదేవుడైన జనార్దనుడు వాయుదేవునికి అభీష్టాన్ని నెరవేర్చుటకై, ఆ తరువాత శంఖ మహారాజుకి ప్రియం చేకూర్చుటకై, ఆ నెపంతో విశ్వవిఖ్యాతిగాంచే మహాస్వరూపంతో సర్వలోకాలకు హితం చేకూర్చుటకై భగవంతుడు పరమ పవిత్రమైన శ్రీవేంకటాచలంలో అవతరిస్తాడు. అందువల్ల మనమిద్దరం ఆయన గురించి తపస్సు చేయటానికి అక్కడికి వెళదాం. చాలాకాలం తరువాత దేవతలు, మహర్షులు అందరూ కలిసి అక్కడకు వస్తారు. అప్పుడు మనం విష్ణుభక్తి పరాయణుడైన కుమారస్వామిని చూస్తాం' అని శంకరుడు చెప్పగా పార్వతీదేవి విని ఊరుకున్నది.

చాలాకాలం తరువాత శంకరుడు వేంకటాచలానికి బయలుదేరుతూ పుత్రసందర్శన కుతూహలం గల పార్వతీదేవితో 'దేవీ! నేను పూర్వం చెప్పిన మహాపుణ్యప్రదమైన పరమ పావనమైన వేంకటాచలానికి వెళ్ళే సమయం ఆసన్నమైంది' అని గుర్తుచేయగానే పార్వతీదేవి శంకరునితో 'నాథా! వాయుదేవుని తపస్సు పూర్తయిందా? భగవంతుడు ప్రత్యక్షమయ్యాడా? వాయుదేవునికి నారాయణుడేవిధంగా దర్శనమిచ్చాడు? ఏం వరం ప్రసాదించాడు? ప్రభూ! అదంతా నాకు వివరించండి! అని అడిగింది.

అప్పుడు శంకరుడు పార్వతీదేవితో యిలా చెప్పసాగాడు – 'దేవీ! వాయుదేవుడు ఘోరతపస్సు చేశాడు కదా! ఆ విధంగా వేయి సంవత్సరాలు దారుణమైన తపస్సు చేయగా సనాతనుడు, పరమాత్మ దేవదేవుడు అయిన జనార్దనుడు శ్రీదేవి, భూదేవులతో కూడి గరుత్మంతుని అధిరోహించి శేషునితోకూడ శంఖచక్రాలను, శారఙ్గమును, బాణములను ధరించి ప్రత్యక్షమయ్యాడు.

ఆ విధంగా సాక్షాత్కరించిన సర్వాంతర్యామి సకల జీవనివాసి అయిన భగవంతుని చూసి వాయుదేవుడు ఆశ్చర్యచకితుడై ఆసనమునుండి లేచి పిచ్చివానివలె అటు యిటు తిరుగుతూ గెంతులేస్తూ ఆనందంతో గిరగిర తిరుగుతూ 'ఆహా'

ఈ వృషభాచలంలో నాకు ఎటువంటి అద్భుతమైన దర్శనం లభించింది' అనుకుంటూ ఆనందంతో ఉన్మత్తుడై కొంచెం సేపు స్పృహ కోల్పోయాడు. మరల తిరిగి స్పృహ వచ్చిన తరువాత శ్రీహరిని దర్శించాడు.

వేదముల చేతను, తపస్సుల చేతను, యోగులకు, మునులకు కూడా దర్శించటానికి వీలుకాని సనాతనమైన పురాణపురుషుడైన దేవదేవుని దర్శించి ఆయనకి మరల మరల సాష్టాంగ నమస్కారాలు చేసి వాయుదేవుడు, వేదవేద్యుడు, పురాణ పురుషుడు, అయిన జనార్దనుని వేదాంతసారభూతము లైన అర్థయుక్తములైన వాక్కులతో ఈ విధంగా స్తుతించాడు.

## వాయుకృత విశ్వరూపస్తుతి

నమస్తే దేవదేవేశ! పురాణ పురుషోత్తమ ।
శ్రీధరానంత! గోవింద! జిష్ణవే విష్ణవే నమః ॥
ఏకస్త్వం పురుషః సాక్షాత్ ఆదౌ మాయాసమన్వితః ।
జగదేకార్ణవీకృత్య శేషే సాగరసంప్లవే ॥
త్వన్నాభి పంకజోద్భూతో బ్రహ్మ బ్రహ్మవిదాం వరః ।
యేనేదం జగదుత్సృష్టం చరాచరసమన్వితమ్ ॥

**- వామనపురాణం, అ.24 శ్లో.20-22**

ఓ దేవాధిదేవా! పురాణపురుషోత్తమా! లక్ష్మీపతీ! అనంతా! గోవిందా! జయశీలుడవు, సర్వవ్యాపివి అయిన నీకు నమస్కారము. సృష్టి ఆదిలో నీవొక్కడవే పరమ పురుషుడవు. నీవు మాయతో కూడినవాడవై జగత్తునంతా జలమయం చేసి ఆ మహాసాగరంలో శయనిస్తావు. ఈ చరాచర జగత్తును సృష్టించినవాడు, బ్రహ్మవేత్తలందు శ్రేష్ఠుడు అయిన చతుర్ముఖ బ్రహ్మ నీ నాభి కమలం నుండి ఉద్భవించాడు. ప్రభూ! నీవు రజోగుణంతో ఈ జగత్తునంతా సృష్టించావు. సత్త్వగుణంతో అఖిల జగత్తును రక్షిస్తున్నావు. తమోగుణంతో లయం చేస్తున్నావు.

బ్రహ్మరూపిణివైన నీనుండి తొమ్మిదిమంది ప్రజాపతులు పుట్టారు. వారి నుండి దేవతలు, మానవులు, రాక్షసులు పుట్టారు. బ్రహ్మదేవునికి ఆపద కలిగినపుడు నీవు మధుకైటభులను సంహరించావు. ఆ తరువాత మత్స్యరూపివై సోమకాసురుని చంపి అతని చేతి నుండి వేదాలను తీసుకొని బ్రహ్మదేవునికిచ్చావు. ఈ చరాచర జగత్తు నిరాశ్రయమై నిరాధారమై ఉన్న సమయంలో ఓ పురుషోత్తమా! నీవు కూర్మరూపం ధరించి ఈ జగత్తుకు ఆధారం కల్పించావు.

పర్వతములు, అడవులతో కూడిన భూమిని పాతాళ లోకం నుండి వరాహరూపంతో ఉద్ధరించిన మహాత్ముడవైన సనాతనుడవు నీవే. మరల కృతయుగాదిలో హిరణ్యకశిపుడనే రాక్షసుని సంహరించి ప్రహ్లాదుని రక్షించుటకై సగం సింహం, సగం మానవశరీరం గల నరసింహరూపాన్ని ధరించి నల్లని ఇనుపస్తంభం నుండి ఉద్భవించి ఆ మహాసురుణ్ణి చీల్చి ప్రహ్లాదుని కాపాడి లక్ష్మీదేవితో కూడా ముల్లోకాలను రక్షించావు.

ఆ తరువాత బలిచక్రవర్తి యజ్ఞం చేస్తుండగా ఇంద్రుని ప్రేరణతో నీవు వామనుడవై వాక్చతురులలో శ్రేష్ఠుడవై బలిని మూడడుగుల భూమిని యాచించి తీసుకొని భూలోకాన్ని, భువర్లోకాన్ని, స్వర్గలోకాన్ని ఆక్రమించి ఆ ముల్లోకాలను ఇంద్రుడికి ప్రసాదించావు. నీవు చంద్రమండలమునకు వెళ్ళి పద్మాసనంలో కూర్చొని అమృతానికి అన్నానికి అధిపతివై, అమృత కిరణుడవై అన్నానికి ఆధారమైన ఓషధులను (సస్యములను) పోషిస్తూ తుల్యమైన వెన్నెలను వర్షిస్తూ చరాచర జగత్తును కాపాడుతున్నావు. ఓ మహాబాహూ! నీవు జమదగ్ని కుమారుడవైన పరశురాముడవై రాజుల రూపంలో ఉన్న రాక్షసులందరినీ సంహరించి ఆ రక్తపు మడుగులలో పితృదేవతలకు తర్పణాలిచ్చి భూమిపైన రాజులు లేకుండా చేసి ఆ తరువాత అశ్వమేధయాగం చేసి ఆ యాగంలో దక్షిణగా కాశ్యపునికి ఈ భూమిని దానం చేశావు. జగత్ప్రభూ! ఆపైన నీవు మహాసముద్రానికి వెళ్ళి ఆ సముద్రతీరంలో ఉన్న సుందరమైన సహ్య పర్వతంపై తపస్సు చేసిన భార్గవరాముడవు.

ఓ దేవదేవా! రావణుడనే రాక్షసుడు దేవతలను హింసిస్తూ ఉండగా త్రేతాయుగంలో నీవు దశరథుని కుమారుడైన రామునిగా అవతరించి లక్ష్మణునితో కూడి యుద్ధంలో నీ భార్య సీతనపహరించిన ఆ దుష్ట రాక్షసుని పుత్రపౌత్ర పరిజన మంత్రులతో సహ సంహరించావు. సనాతనుడనైన వాసుదేవుడవు నీవే. బలరాముడవు, కృష్ణుడవు నీవే. కలియుగాంతంలో నీవే కల్కి రూపుడవై ముల్లోకాలను కాపాడతావు.

నీవు ఆదిత్యులలో విష్ణువువు, తేజశ్శాలులలో శూరుడవు, వసువులలో పావకుడవు, రుద్రులలో శ్రేష్ఠుడైన శంకరుడవు. గ్రహాలలో బుధుడవు, దేవతలలో ఇంద్రుడవు, సిద్ధులలో కపిలుడవు, దేవర్షులలో నారదుడవు. యజ్ఞాలలో జపయజ్ఞానివి నీవే. తపశ్శాలురలో తపస్వివి నీవే. యక్షులలో కుబేరుడవు, నియమించే వారిలో యముడవు నీవే.

జలచరాలలో మొసలివి నీవే. సముద్రంలోని జీవులకు ప్రభువైన వరుణుడవు నీవే. నదులలో గంగానది, సరస్సులలో సముద్రం, వాయువులలో ప్రాణవాయువు, సృష్టికర్తలలో బ్రహ్మవు నీవే. వర్ణాలలో బ్రాహ్మణ వర్ణము, ఆశ్రమాలలో గృహస్థాశ్రమము నీవే. నక్షత్రాలలో చంద్రుడవు, ఇంద్రియాలలో మనస్సు నీవే.

మృగాలలో సింహము, నాలుగుకాళ్ళ జంతువులలో ఏనుగువు, రెండు కాళ్ళు కల మానవులలో బ్రాహ్మణుడవు, పక్షులలో గరుత్మంతుడవు నీవే. సర్పాలలో వాసుకివి, విషాలలో కాలకూటవిషము, నాగులలో ఆదిశేషుడవు. కులపర్వతాలలో మేరు పర్వతము, పర్వతాలలో హిమవత్పర్వతము నీవే. వేదాలలో

సామవేదము, ఛందస్సులలో గాయత్రి, మంత్రాలలో ఓంకారం నీవే. జంతువులలో కామధేనువు, యజ్ఞభోక్తలలో అగ్నిమిత్రుడు నీవే.

స్థిరమైన వాటిలో పర్వతము, వృక్షాలలో రావిచెట్టు, సేనాపతులలో కుమారస్వామివి, పరాక్రమ జంతువులలో ఓర్పువు నీవే. బీజాలలో అంకురం, ప్రాణములో ప్రాణవాయువు, బ్రహ్మర్షులలో వసిష్ఠుడవు, సంచరించే వాటిలో వాయువు నీవే. మహర్షులలో భృగుమహర్షివి, వేదవేత్తలలో వ్యాసుడవు. కవులలో వాల్మీకివి, ప్రజలలో రాజువు నీవే. లోకాలన్నింటిలో తేజస్సు, బలములతో కూడిన భూతజాతమంతా, సకల చరాచర ప్రాణి సమూహములన్నీ నీవే నని బ్రహ్మవేత్తలు చెబుతారు.

వేయి (అసంఖ్యాకములైన) శిరస్సులుగల పరమపురుషుడవైన నీకు నమస్కారం. వేయి భుజాలు, వేయి పాదాలు గల నీకు నమస్కారం. దేవా! అనేక విధాలైన నీ ఆయుధాలు వేల రెట్లు ప్రకాశిస్తూ దశదిశలను ప్రకాశింపజేస్తున్నాయి. నీ ముఖాలు తీక్షణంగా ఉన్నాయి. నీ కోరలు భయంకరంగా ఉన్నాయి. నీ ముఖాలు (బాల) లేత, సూర్యమండలం వలె ఉన్నా కుండలాలతో (కాంతితో) శోభిస్తున్నాయి. లేత సూర్యకాంతిచే వికసించిన ఎఱ్ఱని పద్మములతో అలంకరించబడినట్లు నీ వేయి పాదపద్మములలో కూడిన దివ్యమంగళ స్వరూపం విరాజిల్లుతున్నది. నీ పాదాలతో భూమి, శిరస్సులతో ఆకాశము, బాహువులతో దిక్కులు నిండినై అటువంటి మహావిష్ణువైన నీకు నమస్కారం. వేదాలు నీ నిశ్వాసలే. సూర్యచంద్రులు నీ నేత్రాలు. కాంతి కణాలు నీ కనుగుడ్లు. విశ్వరూపా! నీకు నమస్కారం.

**పృథివీ పూరితా పద్భిః ఆకాశం మూర్తిభిస్తవ ।**
**బాహుభిశ్చ దిశోవ్యాప్తా మహావిష్ణో! నమోస్తుతే ॥**
**వేదాస్తవైవ నిశ్వాసాః చంద్రసూర్యౌ తవాక్షిణీ ।**
**జ్యోతిష్కణాశ్చ తారాణి జగద్రూప! నమోస్తుతే ॥**

**- వామనపురాణం, అధ్యాయం 24, శ్లోకాలు 57,58.**

పద్దెనిమిది రెప్పపాట్ల కాలం ఒక కాష్ఠ. అటువంటి ముప్పై కాష్ఠల కాలం ఒక కళ. ఇటువంటి కాష్ఠలు, కళలు, క్షణములు, నిమిషములు, గంటలతో పగలు, రాత్రి ఏర్పడుతున్నాయి. ఇటువంటి రోజులు కొన్ని నెలలు, సంవత్సరాలుగా, కొన్ని సంవత్సరాలు, యుగాలుగా మారతాయి. ప్రభూ! నీవు కృత, త్రేత, ద్వాపర, కలి యుగాల రూపంలో ఏర్పడే అనంతమైన కాలస్వరూపుడవు. అటువంటి నీకు నమస్కరిస్తున్నాను.

నీవు కాలాన్ని ధరిస్తావు. కాలాన్ని దర్శిస్తావు. కాలమునకు నీవే ఆత్మ. కాలానికి కారణం కూడా నీవే. కాలాన్ని తెలుసుకున్నవారికి కూడా నీవు తెలియవు. అటువంటి విశ్వరూపుడవైన నీకు నమస్కారము. ఓ మధుసూదనా! భూతభావనా! అనాది నుండి ఉన్న ఈ పంచమహాభూతాలు సకల ప్రాణులు నీ స్వరూపాలే. సకల జీవులను పోషించే నీకు నమస్కారము.

నీవు ప్రాణస్వరూపుడవు. ప్రాణాన్ని భరించేవాడవు. ప్రాణాన్నిచ్చేవాడవు. సర్వ కర్మలకూ నీవే సాక్షి. నీవు నాశరహితమైన వాడవు, శాశ్వతుడవు, సర్వవ్యాపకుడవు, సర్వాంతర్యామివి. నిర్వికారుడవు. నిశ్చలుడవు. అటువంటి నీకు నమస్కారము. శరీరాన్ని భరించే వాడవు, శరీరాన్ని ధరించే వాడవు. శరీరం లోపల ఆత్మ స్వరూపంగా ఉండే ఉంటావు. ఈ శరీరంతో చేసే పుణ్యపాప కర్మల సంబంధం అంటనివాడవు. పరిశుద్ధమైన, నిర్మలమైన, పవిత్రమైన, అప్రాకృతమైన దివ్యదేహుడవైన నీకు నమస్కారము.

నీవు అణువుకంటే సూక్ష్మమైనవాడవు, అణువులలో పరమాణువువి. మహత్తులలో మహత్తరమైనటువంటి వాడివి. గొప్పవాటిలో కెల్లా చాల గొప్పవాడివి. విశ్వవ్యాపకుడవు. విశ్వమూర్తివి అయిన నీకు నమస్కారము. నీవు ఆకాశంలోను, పరమ పదంలోను (పరమాకాశం) ఉంటావు. ఆకాశ గుణమైన శబ్దమయమైన ఓంకార స్వరూపుడవు. శబ్దమయమైన వేదవేద్యుడవు. ప్రాకృతమైన శబ్దాలకు అందనివాడవు. ఆకాశమే శరీరంగా కలవాడవు. అనంతమైన ఆకాశంవలె అందరికి ఆశ్రయభూతుడవు. పక్షిరాజైన గరుత్మంతు నధిరోహించిన నీకు నమస్కారము.

నీవు జ్ఞానస్వరూపుడవు. జ్ఞాననేత్రం కలవాడవు, జ్ఞానం కలవారిలోని జ్ఞానం నీవే. జ్ఞానం కలవారికి కూడా తెలియబడనివాడవు. తెలుసుకోదగిన ఆత్మస్వరూపుడవైన నీకు నమస్కారం. నీవు వేదస్వరూపుడవు. వేదం తెలిసినవాడవు. వేదం చేత తెలుసుకోదగినవాడవు. భవరోగ వైద్యుడవు. వేదవేత్తలలో శ్రేష్ఠుడవు. వేదాంతముచే తెలుసుకోదగిన స్వరూపం కలవాడు. పరబ్రహ్మ స్వరూపుడవైన నీకు నమస్కారం.

**వేదాత్మా వేదవిత్ వేద్యో వైద్యో వేదవిదాం వరః ।**
**వేదాంత వేద్యరూపాయ బ్రహ్మరూపాయ తే నమః ॥**

**- వామనపురాణం, అ.24, శ్లో.67**

నీవు నాశ రహితుడవు. నశించే పదార్థాలన్నిటికి మూలకారణుడవు. శాశ్వతమైన, నిత్యమైన, నాశరహితమైన దివ్యదేహాన్ని ధరించినవాడవు. క్షరాక్షర రూప ప్రకృతి స్వరూపుడవు. ఈ రెండు విభూతులు నీవే. కాని నీవు ఈ రెండింటికీ అతీతుడవు. అట్టి పురుషోత్తముడైన నీకు నమస్కారము. నిరంతరానందానికి మూలకారణుడవైన నీకు నమస్కారము. జయశీలుడవైన నీకు నమస్కారము. అగ్నిలో వేడి, నీటిలో చల్లదనం, భూమిలో సుగంధం, వాయువులో స్పర్శ, ఆకాశంలో నిర్మలత్వం నీవే. అట్టి నీకు నమస్కారం.

నీ కేశాలలో మేఘాలను, అవయవసంధులలో నదులను, ఉదరంలో సప్తసముద్రాలను ధరించిన జలరూపుడవైన నీకు

నమస్కారం. నీవు స్తోత్రాలచే స్తుతించబడతావు. నీకు నమస్కారం. ఆ స్తోత్రం కూడా నీవే. ఆ విధంగా స్తోత్రం చేసే వారికి ప్రియం చేకూరుస్తావు. స్తోత్రంచేత తెలియబడతావు. స్తుతింపదగిన వాడవు, స్తోత్రరూపుడవు అయిన నీకు నమస్కారము.

అద్భుతమైన రూపం కలవాడవు, శారఙ్గమనే ధనుస్సును చేతిలో ధరించిన నీకు నమస్కారము. భక్తులకు ప్రియము చేకూర్చేవాడవు, పరమశాంతి స్వభావుడవు, భక్తుల చిత్తమును అనుసరించి ప్రవర్తించేవాడవు, భక్తుల పాపములను నశింపజేసేవాడవు శారఙ్గపాణివియైన నీకు నమస్కారము. జగత్తులకు రక్షకుడవు. రాక్షసులను సంహరించేవాడవు, దైత్యవైరివి, శ్రీవత్సమనే పుట్టుమచ్చ వక్షఃస్థలంలో కలవాడివైన నీకు నమస్కారము.

**భక్తి ప్రియాయ శాంతాయ భక్తచిత్తానువర్తినే ।**
**భక్తపాపవినాశాయ నమస్తే శారఙ్గపాణయే ॥**
**రక్షాకరాయ జగతాం రక్షోఘ్నే రాక్షసారయే ।**
**శ్రీవత్సవక్షసే తుభ్యం శారఙ్గపాణీ! నమోనమః ॥**

**- వామనపురాణం, అ.24, శ్లో.73,74**

పద్మము చేతియందు కలది. పద్మము లోపల ఉండే రంగు వంటి రంగు కలది, దివ్యాభరణాలతో ప్రకాశిస్తున్న దివ్యదేహం కలది, దివ్యమైన, మనోహరమైన స్వరూపంగల లక్ష్మీదేవి చేతను, మోదుగ చెట్టువలె నల్లని దేహం కలది. చేతిలో కలువ పువ్వును ధరించిన భూదేవిచేతను రెండు ప్రక్కల ఆశ్రయించబడిన శారఙ్గపాణివియైన నీకు నమస్కారం. ఓ దేవదేవా! నీ భయంకరమైన రూపాన్ని చూసి భయపడి చరాచర జగత్తులోని ప్రాణములన్నీ స్థిమితం లేకుండా అటుయిటు సంచరిస్తున్నాయి. యుగాంత ప్రళయంలో ఈ లోకాలన్నింటిని కోటి అగ్నిహోత్రాలతో సమానమైన కాంతులతో నింపుతావు. రత్నాలు పొదగబడిన భుజకీర్తులచే అలంకరింప బడిన సహస్రబాహువులు కల నీకు నమస్కారము.

ఓ విశ్వరూపా! అనేక నేత్రములు కలవాడా! దేవతలు, లోకపాలకులు, పంచభూతాలు వాటి అభిమాన దేవతలు అందరూ ఆకాశంలో విమానాలలోనూ సంచరిస్తూ నీకు నమస్కరిస్తున్నారు. ఓ దేవాధిదేవా! అటువంటి నీకు నమస్కారము. ఓం జగన్నివాసా! నన్నునుగ్రహించు ఓ దేవదేవా! నీ దేహంలో ఈ చరాచర జగత్తును ఈ జగత్తులో యిప్పటికి గతించిన ప్రాణులు, పుట్టబోయే ప్రాణులు అన్నింటిని సర్వజీవవాసా! నీ ప్రభావం వల్ల నీ అనుగ్రహం వల్ల చూస్తున్నాను.

నీవు ధరించిన బహురత్న ఖచితములైన ఆభరణముల కాంతులతో లోకాలన్నీ వెలిగిపోతున్నాయి. మెరుపులతో అలంకరింపబడిన మేఘకాంతి గల నీలమేఘశ్యాముడవు, దేవదేవుడవు, జగత్తుకు నివాస స్థానమైన ప్రభూ! నాయందు ప్రసన్నుడవు కా! నీ ముఖాలు ప్రళయకాల సూర్యుని కాంతితో తీక్షణంగా వెలిగిపోతున్నాయి. కోరలతో భయంకరమై గర్జిస్తున్నాయి. దేవదేవా! అట్టి భయంకరమైన నీ రూపాన్ని చూసి నేను భయపడుతున్నాను. కాబట్టి నీవు ప్రసన్నుడవుకా!

ఓ జగన్నివాసా! దేవదేవా! నీ శరీరంలో బ్రహ్మ రుద్ర ప్రముఖులైన దేవతలను, యక్షులను, గంధర్వులను మహానాగులను దర్శిస్తున్నాను. స్వామీ! ప్రసన్నుడవుకా! ఓ దేవతాశ్రేష్ఠ! నాకు దిక్కులు తెలియడం లేదు. మనస్సు స్థిమితం లేకుండా ఉంది. నా అవయవాలన్నీ వణుకుతున్నాయి. ఓ దేవదేవా! భక్త పారిజాతా! భక్తులయందు దయ కలవాడా! పరబ్రహ్మస్వరూపా! విష్ణుమూర్తీ! ప్రభూ! నాయందు ప్రసన్నుడవై నన్ననుగ్రహించు.

**బ్రహ్మేత్రినేత్ర ప్రముఖాంశ్చ దేవాన్ సయక్ష గంధర్వమహోరగాశ్చ ।**
**పశ్యామి సర్వాంస్తవ దేవ! దేహే ప్రసీద దేవేశ జగన్నివాస ॥**
**దిశో న జానే న లభే చ శర్మ సీదామ్యహో! దేవవర! ప్రసీద! ।**
**భక్త్యానుకంపిన్! పరమార్థరూప! ప్రసీద విష్ణో! భగవన్! ప్రసీద ॥**

**- వామనపురాణం, అ.24 శ్లో.83,84**

వాయుదేవుడు భగవంతుని ఈ విధంగా స్తుతించి నమస్కరించి అనుగ్రహించమని చేతులు జోడించి ప్రార్థిస్తూ నిలబడ్డాడు. అప్పుడు వాయుదేవుని స్తుతితో సంప్రీతుడైన విష్ణుభగవానుడు శంఖచక్రగదాధరుడై శ్రీదేవీ భూదేవీ సహితుడై వాయుదేవుని యందు అనుగ్రహంతో ప్రసన్నుడై 'ఓ వాయుదేవా! నీ కిష్టమైన వరాన్ని కోరుకో. నీ మనోభీష్టాలు నెరవేరుస్తాను. నీకు శుభమగుగాక!' అని పలుకగా వాయుదేవుడు 'లక్ష్మీపతి' జగన్నాథా! దేవదేవా! నేను వరం కోరను. నేనెల్లప్పుడు నీ సన్నిధానంలో ఉండేటట్లు నన్ననుగ్రహించు' అని ప్రార్థించాడు.

అంతట శ్రీహరి అది విని దేవతలందరి సమక్షంలో యిలా అన్నాడు – 'వాయుదేవా! నీవిప్పుడు చేసిన అరవై నాలుగు శ్లోకాలతో కూడిన ఈ స్తోత్రాన్ని పఠించే మానవులు నా అనుగ్రహం వల్ల భుక్తిని, ముక్తిని పొందుతారు. ఇందుకు సందేహం లేదు. నిశ్చలచిత్తంతో భక్తితో మూడు పూటలా పఠిస్తూ ఈ విధంగా ఆరు నెలలు ఈ స్తోత్రాన్ని పఠించేవారు నా సాన్నిధ్యాన్ని పొందుతారు. ఇందుకే మాత్రం సందేహం లేదు. దేవతలకు కూడా దుర్లభమైన నీ అభీష్టం నెరవేరుతుంది. ఈ కుమారస్వామికి కూడా కలియుగాంతం వరకు ఎల్లప్పుడు నన్ను ఆరాధించునట్టుగా నా సాన్నిధ్యంలోను ఉండేటట్లుగాను నేను వరం ప్రసాదించాను'.

పార్వతీ! వాయుదేవుడు ఈ విధంగా శ్రీమహావిష్ణువు నుండి వరములను పొంది స్వర్గలోకానికి వెళ్ళాడు. దేవదేవుడు శ్రీదేవీ భూదేవులతో కూడి వేంకటాచలంలో ఉన్నాడు. ఆ దేవదేవుడు తాను గాని, తన మందిరం కాని కనబడకుండా ఆ

పర్వత శిఖరాలపై విహరిస్తున్నాడు. అనేక వృక్షాలు, లతలతో దట్టమై గజిబిజిగా అల్లుకుపోయి అన్ని ఋతువులలో పుష్పించే ఫలించే వృక్షాలతో లతలతో ఆ పర్వతం శోభిస్తున్నది. స్వామి పుష్కరిణీ తీరంలో కోటి మన్మథుల సౌందర్యంతో శోభిస్తున్న పదహారేళ్ళ వయస్సు గల శ్రీనివాసుడు శ్రీదేవీ భూదేవులతో ఆ వేంకటాచలంపై విహరిస్తున్నాడు.

కుమారస్వామి ఆ దేవదేవుని దర్శించి చైత్రమాసంలో ఒక శుభ తిథినాడు ఆయనను మూడు పూటలా ఆరాధించాడు. దేవతలు, గంధర్వులు, కిన్నరులు గానం చేశారు. అప్సరసలు నాట్యం చేశారు. గీత, వాద్య ఘోషతో ఆ రమానాథుణ్ణి ఆరాధించారు. ఆ వేంకటాద్రికి ఉత్తరం వైపున ఉన్న గుహలో కుమారధార అనే పవిత్రమైన తీర్థముంది. దేవీ! మయూర వాహనుడైన కుమారుడు దాని తీరంలో నివసిస్తున్నాడు. అతనిని వెంబడించిన భయంకరమైన బ్రహ్మహత్య (బ్రహ్మరాక్షసి) ఆ వేంకటాచల శిఖరాన్ని చూసినంత మాత్రానే దూరంగా ఉండిపోయింది. ఆ స్కందుడు శేషగిరిలో నిత్యము శ్రీహరిసేవను కాంక్షిస్తూ అక్కడే ఉండిపోయాడు. షణ్ముఖుడు మరల తిరిగి రావాలని అనుకోలేదు.

**(సశేషం)**

# మీ ప్రశ్న - మా సమాధానం

## నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు

**1. నవరాత్రుల యొక్క ప్రాశస్త్యం ఏమిటి? (దేవీ నవరాత్రులు, గణేశ నవరాత్రులు మొదలగు)**

జవాబు – నవ అంటే తొమ్మిది. దుర్గాదేవి తొమ్మిది దినాలు రాక్షసునితో యుద్ధం చేసి పదో రోజున (విజయదశమి నాడు) ఆ యుద్ధంలో విజయం సాధించింది. దుష్టశిక్షణ, సాధుజన సంరక్షణ జరిగింది. ఆ ఆనందంలో జరుపుకునే మహాపర్వమే ఇది. దీనినే దసరా (దశహరా) – పది రకములైన బాధలను / పాపములను పోగొట్టునది అని కూడా అంటారు. ఈ తొమ్మిది రోజులూ అమ్మవారి ఒక్కొక్క రూపాన్ని అద్భుతంగా సంభావించి, అలంకరించి ఆరాధిస్తారు. తొమ్మిది రకాల పేర్లు కలిగి దుర్గమ్మ, భక్తుల అర్చనలు, ఆరాధనలు పొందుతుంది. అనుగ్రహిస్తుంది. ఇక గణపతి దేవుని నవరాత్రులు అంటే భాద్రపద శుద్ధ చవితి నుండి మొదలుపెట్టి తొమ్మిది రోజులు దేశమంతా ఎంతో వైభవంగా గణపతిని దేవాలయాల్లోనూ, బయటా రకరకాల రూపాలలో ఆరాధిస్తారు. వివిధ రకాలైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నవరాత్రులలో ఆధ్యాత్మిక చైతన్యం మనకు దశ దిశలా గోచరిస్తుంది. అన్ని వయసుల వారు, సంప్రదాయాల వారు, ఆచారాల వారు గణపతిని ఆరాధిస్తారు. ఈ మధ్యకాలంలో ఇదే సందర్భంలో లడ్డూ వేలంపాటలు కూడా 9 రోజుల తర్వాత జరగడం, ఆ ధర్మాన్ని ఊరు బాగుకో లేదా మరేదైనా ధార్మిక ప్రయోజనం నిమిత్తం ఉపయోగించడం మనం చూస్తున్నాం. నవరాత్రులలో పాల్గొనడం, దైవంతో అనుబంధం పెంచుకోవడం ఎంతైనా అవసరం ఉంది.

**2. గరుడ పురాణం ఎప్పుడు, ఏ విధంగా చదవాలి?**

జవాబు – మంచి ప్రశ్న. మనకు ఉన్న పురాణాలలో దేని ప్రత్యేకత, ప్రాముఖ్యత వాటికి ఉన్నాయి. ప్రతి పురాణమూ చదవదగినదే. అందులో ఉన్న భగవత్, భాగవత సంబంధమైన విశేషాలను, అంతరార్థాలను, ఉపదేశాలను గ్రహించాలి. ఇక గరుడ పురాణం గురించి – ఇది శ్రీమహావిష్ణువు గరుత్మంతునికి చెప్పిన పురాణం. మానవుడు దేహం వదిలాక, తాను భూలోకంలో చేసిన పాప, పుణ్య కర్మల ఆధారంగా, ముఖ్యంగా పాపాలు, ఘోరాలు, నేరాలు చేసినవారు నరక లోకానికి ఏవిధంగా తీసుకువెళ్ళబడి అక్కడ తగిన క్రూర, కఠిన శిక్షలనుభవిస్తారో అంతా విశదంగా ఉంది. ఈ పుస్తకం ఎవరికి వారు కొనుక్కుని చదవడం కంటే, ఎక్కడైనా పెద్దలు అనగా ఈ పురాణం గురించి తెలిసిన, పూర్తి అవగాహన ఉన్న వారిద్వారా వినడమే మేలు. పెద్దలు చెప్పింది కూడా ఇదే. గరుడపురాణం ఆస్తికులే కాక, నాస్తికులు కూడా తెలుసుకోదగిన గొప్ప గ్రంథం. విన్నవారిలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించి, ఆలోచనా దృక్పథాన్ని, జీవన శైలిని మార్చడం, వారు తమ జీవిత పరమార్థం తెలుసుకుని, సన్మార్గంలో నడిచేట్టు చేయడమే ఈ పురాణ పఠనం లేదా శ్రవణాల లక్ష్యం. గరుడపురాణ శ్రవణం – జీవన సార్థకతకు సాధనం.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**

***– ఎడిటర్, శ్రీవేంకటేశం***

# శ్రీవారి హృదయం

## “మంగళకైశికి నామ రాగఝరి – మాలదాసరి”

భక్తి ప్రపత్తులకు భారతదేశం పెట్టింది పేరు. ఎంతోమంది భక్తులు ఈ నేలపై నడయాడి భక్తి మార్గాన్ని సుసంపన్నం చేశారు. వేదభూమిగా, నాదభూమిగా, దివ్యభూమిగా భారతదేశం ఎంతగానో ప్రసిద్ధి పొందింది. రామాయణం, మహాభారతం, భాగవతం, అష్టాదశ పురాణాలు, వేదాలు, ఇతిహాసాలు వెలసినది ఈ పవిత్రమైన దేశం లోనే. భూమండలంలోనే జంబూద్వీపం మణిపూస వంటిది.

“కలియుగే, ప్రథ మపాదే, జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే” అనే శ్లోకం ఆధారంగా భూమండలంలో దైవభక్తికి అగ్రతాంబూలం భారతదేశమే. అందులో దక్షిణా పథమందు మరీ ముఖ్యంగా భక్తి తత్వం అధికం. ముక్తి మార్గానికి భక్తి మా ర్గ మే సులువైన సాధనం. నవవిధ భక్తి మార్గాల ద్వారా ముక్తిని పొందవచ్చని వేదాలు బోధిస్తున్నాయి. తన హృద్భాషల శ్రవణమున్, కీర్తనం, వందనార్చనముల్, సఖ్యమున్, పాదసేవనం, దాస్యమున్, ఆత్మనివేదనమున్ అనే పోతన రాసిన పద్యము ఆధారంగా తొమ్మిది విధాల భక్తి మార్గాలున్నాయని పేర్కొన్నారు. ఏ భక్తి మార్గాన్ని అవలంబించినా భగవంతుణ్ణి చేరుకుని ముక్తిని పొందవచ్చునని ఆచార్యులు ప్రబోధించారు.

ఏడు రోజులు భాగవతం శ్రవణం చేసి పరీక్షిన్మహారాజు, స్నేహభక్తి ద్వారా అర్జునుడు, కుచేలుడు, కీర్తనం ద్వారా ప్రహ్లాదుడు, పాదసేవనం ద్వారా లక్ష్మీదేవి, దాస్యం ద్వారా హనుమంతుడు, ఆత్మనివేదనం ద్వారా బలిచక్రవర్తి మోక్షం పొందారు. ఇంకా భక్తపోతన, భక్త రామదాసు నిరంతరం శ్రీమన్నారాయణునికి వందనార్చనములు చేసిన మహాభక్తులు. త్యాగయ్య, క్షేత్రయ్య, పురందరదాసు, అన్నమయ్య మొదలగు సంకీర్తనాచార్యులు నిరంతరం నామస్మరణ ద్వారా ముక్తిని పొందిన భక్తాగ్రేసరులు ఎందరో ఈ నేలపై భక్తి సామ్రాజ్యాన్ని సుసంపన్నం చేసి విస్తరించారు. అలాంటి భక్తులలో మాల దాసరి ఒకరు. అతడు తన మంగళ కైశికి రాగంతో భగవంతుణ్ణి మెప్పించిన ధన్యజీవి.

**“కలడొకరుండు పేరు కొనగాని కులంబు మదీయ భక్తు డి**
**య్యిలమును వాడు వామన తనే వసించిన పుణ్యభూమియం**
**దుల కొక యోజన త్రయపు దూరపుటూర వసించి బ్రాహ్మవే**
**ళల జనుదెంచి పాడు మము లాలస మంగళ నామ కైశికిన్”**

పంచమ కులమందు పుట్టిన మా భక్తుడొకడు కలడు. అతడు తొల్లి నేను వామనావతారమున నివసించిన దివ్య దేశమునకు మూడు ఆమడల దూరంలో ఉన్న కుగ్రామమందు నివసించి, ప్రభాత సమయములయందు మంగళకైశికి రాగము చేత నిత్యము మమ్ము గానము చేయుచుండెడి వాడని ఆది వరాహమూర్తి అవతారములో ఉన్న శ్రీమన్నారాయణుడు భూదేవితో చెప్పిన వృత్తాంతాన్ని బట్టి మాలదాసరి పండితుడు కాకపోయినా, నిమ్నజాతిలో జన్మించినప్పటికీ అకుంఠిత భక్తి శ్రద్ధలతో తనకు తెలిసిన మంగళ నామ కైశికి రాగంతో భగవంతుణ్ణి మెప్పించి ముక్తిని పొందిన భక్తశిఖామణి మాలదాసరి.

**“జాత్యుచిత చరిత్ర మమ**
**త్రీప్త్యర్థంబూది తనదు హృదయము శుచితా**
**నిత్యంబుగ దత్తను సాం**
**గత్యము మసిపాత మాణికంబై యొదుగున్”**

మాలదాసరి చండాలపు కులములో పుట్టినప్పటికీ ఏమాత్రము ఆధిక్యానికి, అహంకారానికి పోకుండా తన కుల ఆచారమునకు తగ్గట్టుగా నిత్యము పరిశుద్ధమై ఆ చండాల శరీర సాంగత్యము అనెడి మసిగుడ్డను కట్టిన మాణిక్యం లాగా ఉన్న మహాభక్తుడు. జాతి చేత చండాలుడైనను అగ్రవర్ణముల వారి శీలము వంటి శీలము కల్గినవాడు. ప్రతిదినము తన బరువుల ఆ చెంత దింపి యెండను, గాలిని, ఆకలిని లెక్కచేయక మధ్యాహ్నం దాకా ఒళ్ళంతా గగుర్పాటు కలుగగా రాళ్ళు సైతం కరిగే విధంగా తన చండాల వీణను మీటుచు స్తోత్రములు పాడి భక్తితో తాండవమాడును. ఇట్లు చాలాసేపు భగవంతుణ్ణి సేవించి, నమస్కరించి గర్భాలయము కడిగిన సమ్మార్జనోదకము తాకకుండా, శూద్రునొక్కనిని యాచించి, అతని చేత తెప్పించుకొని ఆ ఉదకమును తీర్థముగా సేవించి సాష్టాంగ ప్రణామమును చేసి వచ్చేవాడు. అతడు నిగర్వి. ప్రసాదాదుల యందు అత్యంత శ్రద్ధ కలిగినవాడు. విప్రులను

తాకకుండా ఒక మూలన నిలబడి శూద్రుని కొరకు వేచియుండి అతడిచ్చే తీర్థప్రసాదాలను స్వీకరించేవాడు. అనంతరం గుడి చుట్టూ ప్రదక్షిణ గావించి తన నివాసమునకు వెళ్ళేవాడు. ఇదే ఆ మాలదాసరి నిత్యకృత్యము. అతని గానామృతానికి భగవంతుడు కూడా మిక్కిలి పరవశించేవాడు.

**"అద్దమరేయ ద్దాసరి**
**యద్దండ బిడాల గాహితాలయ కృకవా**
**కూద్దండ రవము విని చను**
**ప్రొద్దాయె నటంచు బాడ బోవుచు త్రోవన్"**

ఒకనాడు అర్ధరాత్రి సమయంలో తన నివాసం ముందున్న కోళ్ళ గుంపులోకి ఒక పిల్లి ప్రవేశించగా భయముతో కోళ్ళన్నీ అరిచాయి. ఆ అరుపులను విన్న మాల దాసరి వేకువజాము కోడి కూతలని భ్రాంతి చెంది తాను నిత్యము చేయు కార్యమునకు సమయమైనదని తలచి దేవాలయమునకు బయలుదేరెను.

**"మరులు తీగె మెట్టి యిరులన్ననోయని**
**యెదు తమిస్త గాడుపడి పొలంబు**
**లెల్ల దిరిగి దూర్పు దెల్లనౌ తఱినొక్క**
**శూన్య గహన వాటి జొచ్చి చనుచు"**

అలా అర్ధరాత్రి యందే ఆలయానికి బయలుదేరిన ఆ దాసరి మర్లు మాతంగి తీగెను త్రొక్కి దారి తప్పి అక్కడనే తిరుగుచు తెల్లవారేసరికి ఒక నిర్మానుష్యమైన అడవి ప్రాంతానికి చేరుకున్నాడు. అలా దారి తప్పి నడుచుచు, ఉత్తరేణి ముండ్లు కాళ్ళకు గుచ్చుకొనగా వాటిని ప్రతిలోమముగా తొలగించుకుంటూ ముందుకు సాగగా మెలకువ రాగా ముందుకు సాగుచుండెను. అక్కడ ఒక గొప్ప మఱ్ఱి చెట్టును చూశాడు.

**"కాంచెన్వైష్ణవు దర్ధయోజన జటాఘాటోత్థ శాఖోపశా**
**ఖాంచద్ఘోట చరన్మరుద్రయ దవీయః ప్రేషితోద్వచ్ఛదో**
**దంచత్కోటకృత వ్రణచ్ఛల నలిప్యాపాది తాజ్వన్యని**
**స్సంచారాత్త మహాపలోపమ ఫలస్వాయద్వటక్ష్మాజమున్"**

భాగవతుడైన మాలదాసరి ఆ మార్గంలో రెండు కోసుల నిడివితో అనేక ఊడలు కల్గిన ఒక మఱ్ఱి చెట్టును చూశాడు. ఆ చెట్టుక్రింది భాగాన బ్రహ్మరాక్షసులు అనేకులను పట్టి చంపడం చేత ఆ ప్రదేశమంతా కపాలాలు, శల్యమైన మాంసపు ముద్దలు కలిగి పెక్కు దుర్గంధ పూరితంగా, అత్యంత భయంకరంగా, ఒళ్ళు గగుర్పాటు కలిగే విధంగా ఉంది.

**"కండ కన్నుల వాని నాకటను బండు**
**తిట్ల బేతాళికల సారె దిట్టువాని**
**నగ గరిమవాని నవ్వర్థ నామ గుంభ**
**జానువను నొక్క ద్విజు నిశాచరు గనియె"**

దారి తప్పిన భాగవతుడైన మాలదాసరి ఆ వట వృక్ష సమీపమునకు ప్రవేశింపగానే చల్లని మేఘంలా కండలు తిరిగిన కండ్లతో, భయంకరంగా అరుస్తున్న కుంభజానువనే బ్రహ్మరాక్షసుని చూడగానే ఒక్కసారిగా భయంతో వణికిపోతూ నిశ్చేష్టుడుగా అలాగే నిలబడిపోయాడు. అంతలో ఒక్కసారిగా బ్రహ్మరాక్షసుడు ఆకలిగొన్న పులిలా మాలదాసరిపైకి దూకి పిడిగుద్దులతో మాలదాసరిని హింసించగా, మాలదాసరి కూడా బ్రహ్మరాక్షసుణ్ణి అనేక విధాల గాయపరిచాడు. ఇలా ఆ ఇరువురి మధ్య భయంకర యుద్ధం జరిగింది. చివరికి బ్రహ్మరాక్షసుడే గెలిచి అలసి సొలసి పోయిన దాసరిని ఆ మఱ్ఱి చెట్టుకు కట్టి బంధించి అతడు, అతని భార్యలైన ఆడ రాక్షసులతో కలిసి మంచి మానవ మాంసం దొరికిందని ఎంతగానో సంతోషించారు.

బ్రహ్మరాక్షసునిచే బంధించబడిన మాలదాసరి చేయునది ఏమీ లేక భారమంతా ఆ భగవంతునిపై వేసి మొండి ధైర్యముతో ఆ రాక్షసునితో ఇలా అన్నాడు.

**"వినుమొకమాట రాత్రిచర! వేగిర మేటికి నిన్ జయింతురే**
**య నిమిషులైన భాజనగతాన్నమ నేనిక నెందు బోయెదన్**
**బెనగక ప్రాణ రక్షణము పేక్ష యొనర్చు పాపమిందుకై**
**కనలకు నాకు మేనియెడ గాంక్షయు లేదిది పోవుటే యురున్"**

ఓ రాక్షసుడా! నాదొక మాట వినుము. తొందరపాటు యేల? నిన్ను జయించుటకు దేవతలకు కూడా సాధ్యము కాదు. నేను నీ కంచంలో వడ్డించిన అన్నాన్ని. అయినా ప్రాణరక్షణ కొరకై ప్రాకులాడడం మహాపాపం. నాకు ఈ దేహంపై ఏమాత్రం ఆశ లేదు. ఈ శరీరం నశించుటే ఉత్తమం. రోగాదుల చేత ఈ తనువు నశింపకుండా ఆకలిగొన్న ఒక్కనికి తృప్తిని కలిగించుట మేలైనది అని శాస్త్ర ప్రమాణాలతో ప్రార్థించాడు మాలదాసరి. అయిన ఆ బ్రహ్మరాక్షసుడు కరుణించకుండా ఈ శాస్త్ర ప్రసంగాల వలన ఏమీ ప్రయోజనం లేదు. వీటికి భయపడు వాడు ఎవడూ లేడు. ఈ రోజు నిన్ను వధించుట తథ్యమని బ్రహ్మరాక్షసుడు భయంకరంగా అరిచాడు.

**"ప్రఖ్యాతుండవు దైత్యులందు మును పాపై నొక్క నీకా యశో**
**భిఖ్యన్నేనును జేర్తుమే యొసగు దప్పింపన్ వ్రతంబొక్కడే**
**ముఖ్యంబై యొనరింతు దాని సఫలంబున్జేయగా లేవుగా**
**సఖ్యం సాప్తపదీన మన్మనమిధ స్స్వాజ్ఞత్య మూహించుచున్"**

అవహేళనగా మాట్లాడిన బ్రహ్మరాక్షసునితో పరమ భాగవతోత్తముడైన మాలదాసరి ఇలా అన్నాడు. ఓ రాక్షసోత్తమా! నాకు ఒక వ్రతమున్నది. అది యేమనగా ఈ రోజు ఈ సమీపంలోని కురుంగడిలో ఉన్న వైకుంఠునికి మంగళకైశికి రాగాన్ని ఆలపించి, ఆ స్వామిని మనసారా అర్చించి తిరిగి నీకు ఆహారంగా నన్ను నేను సమర్పించుకుంటాను. మనమిరువురము చెలికాండ్రమగుట వలన నా వ్రతమును సఫలము చేయుమని రాక్షసుని కోరుకొనెను.

**“ఈ కుఱుంగటి ఈ కుఱుగుడి**
**వైకుంఠుని బాడివత్తు వ్రతముగ దత్సే**
**వాకృతి కడపట నశనము**
**నీకౌదున్మఖ్య మిదియ నేదగు తుదకున్”**

దాసరి మాటలకు ఆ రాక్షసుడు నవ్వి అతని చెంప మీద సుతిమెత్తగా గిల్లి అన్నన్నా! ఓ దాసరీ ఎంతటి అమాయకుడవోయి. ఏ దేశమందైనను తన నోటికి అంది వచ్చిన ఆహారాన్ని విడుచువాడు ఉంటాడా? బాప యిచ్చి వచ్చితినని తన శరీరము ఆహారముగా ఇచ్చువాడు ఉంటాడా? కావున నిన్ను విడిచిపెట్టను. నీవు మరల వచ్చుట యన్నది కుదరని పని. ఓ చండాలుడా నిన్ను నేను ఎప్పటికీ నమ్మను. నీ అరుపులతో, నీ విచారముతో నాకు పని లేదు. విపరీత వాదనలతో ఏ మాత్రం ప్రయోజనం లేదని బ్రహ్మ రాక్షసుడు పలుకగా –

**“ఎవ్వని చూడ్కి జేసి జనియించు జగంబు వసించు నిజ్జగం**
**బెవ్వనియందు డిందు మఱి యెవ్వని యందిది యట్టి విష్ణుతో**
**నివ్వల నొక్క వేల్పు గణియించిన పాతకినౌదు నేడు నే**
**నెవ్విధినైన నిన్గదియ నేనియ నన్విని బంధమూడ్చినన్”**

ఓ రాక్షసోత్తమా! నేటి దినమే నిన్ను నే ఏ ప్రకారమునైనను చేర రాకపోతినేని విష్ణునితోడ సరియగు దేవుడున్నాడని చెప్పెడు వాని పాపమున బోవగల వాడనని ఆ దాసుడు ప్రమాణము చేయగానే ఆ శపథానికి మారు మాట్లాడకుండా బ్రహ్మరాక్షసుడు అతనిని బంధించిన కట్లను విప్పి సరేనని అతనిని విడిచి పెట్టాడు.

బ్రహ్మరాక్షసునిచేత బంధ విముక్తుడైన మాలదాసరి అత్యంత భక్తి శ్రద్ధలతో పరుగు పరుగున కురుంగడి కేగి బ్రాహ్మణోత్తములకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా మంగళకైశికి నామ రాగాన్ని గానం చేస్తూ ఆడి పాడి స్వామి సంతోషించునట్లుగా అర్చన గావించి, గర్భాలయం కడిగిన నీటిని సేవకులు తెచ్చి ఇవ్వగా వాటినే స్వామివారి తీర్థంగా భావించి స్వీకరించి తన వ్రతాన్ని పరిసమాప్తము గావించి అమితమైన ఆనందముతో రాక్షసుడు విధించిన గడువు లోపే అతని ముందు నిలబడి ఓ రక్కసుడా! వ్రతము చెల్లించుటకు అనుమతి ప్రసాదించిన తమరికి కృతజ్ఞతలు. మీరు నన్ను పంపునప్పుడు నా శరీరము, కాళ్ళు, చేతులు ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలాగే ఉన్నాయి. ఏ మాత్రమూ తేడా లేవు. నీ తనివి తీరా నన్ను భుజించి నాకు ధన్యత చేకూర్చుమని రెండు చేతులు జోడించి పరమానంద హృదయముతో బ్రహ్మరాక్షసుని వేడుకున్నాడు.

ఇట్లనగానే ఆ రక్కసుడు ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాడు. ఆ మాల దాసరి యొక్క సత్యసంధతకు, నిజాయితీకి కండ్ల వెంట ఆనంద బాష్పములు రాలుచుండగా సంతోషము చేత గగుర్పొడిచిన గాత్రంతో మధ్యాహ్నం ఎండ తన బట్టతల మీద పడుతుండగా పులకించిన శరీరముతో ఆ దాసరి చెంతకు చేరాడు బ్రహ్మరాక్షసుడు.

**“కొండయు బోలె భక్తి వల గొంచు నేవాదు నిజ భ్రమ భ్రమీ**
**హిండనవ్రాలు పాకలపు టేనుగు బోలె నొసల దంష్ట్ర రి**
**దుండ రౌదన్మహాగిరులు హోరన భ్రస్తుతి వాలి దంష్ట్రకా**
**దండము లెత్తి పట్టిన పదంబొకడొక్క నెత్తి జేర్చుచున్”**

కొండవంటి శరీరం గల ఆ రక్కసుడు హరిదాసుడైన మాల దాసరికి ప్రదక్షిణము చేయుచు తన మ్రోత చేత నద్రులు మారుమ్రోగగా ప్రస్తుతి చేయుచు ఆ దాసరి పాదములపై వ్రాలగా, ఏనుగు తన కట్టు కంబము చుట్టు తిరిగి బృంహీ తథ్యము తథ్వనితో నేల వ్రాలినట్లుండెను. అంతేకాక ఆ బ్రహ్మరాక్షసుడు ఆ వైష్ణవదాసుని పాదాలకు మ్రొక్కి అతనిని ఎత్తుకొని నెత్తిమీద పెట్టుకున్నాడు.

ఓ దాసరీ! దేవతలయందును, రాక్షసులయందును, మునులయందును, ఇతర రాజుల యందును నీ సత్యము లేదు. నీ సత్యమే సిద్ధాంతము. దీనికి నేను పెద్దవాడను కాను. నీతో సమానులగు సత్యవంతులు లేరు అని ప్రమాణము చేస్తున్నాను అని బ్రహ్మరాక్షసుడు పలుకగా, ఆ పలుకులు విని ఆ దాసుడు పరమానంద భరితుడై, ఆ రక్కసుని గాఢాలింగనము చేసుకుని ఓయీ! పాపరహితుడైన రాక్షస శ్రేష్ఠుడా! నీ కృప చేతనే నేను ఈ రోజు వ్రతమును పూర్తి చేశాను. నీ దయతోనే ధన్యుడనైనాను.

**“బాసలు బండి కండ్లు మఱి ప్రాణభయంబున లక్ష సేసినం**
**గ్రాసము గ్రుచ్చు లబ్ధ ముదుగన్వసమే యిది నీక చెల్లెనో**
**భూసుర వంశ బుణ్యజన పుణ్యజనాంకము తావకీనమే**
**పో సమకూరెడిం గులము పొత్తున దైత్యుల కెల్లనం కతన్”**

నీవు ఇంత పుణ్యాత్ముడవు కావుననే పుణ్యజనుడను బిరుదు నీకే చెల్లినది. ఇంతేగాక నీ కులము వారగుట చేత రాక్షసుల కందరికీ నీకు వచ్చిన పుణ్యజన నామమే వచ్చినది. అందువలన నన్ను కృతార్థుడను కావించుటకు విడిచిపెట్టితివి. దానితో నేనూ వ్రత సమాప్తి చేసి వచ్చితిని. నీవు చాలా ఆకలిగొన్న వాడవు. బ్రహ్మదేవుడు మీకు ప్రసాదించిన ఆహారం మానవ మాంసం. నన్ను నీ తృప్తితీరా భుజించి నీ క్షుద్బాధను చల్లార్చుకొని నన్ను ధన్యుడను గావింపుమని మాలదాసరి వేడుకొనెను.

ఓ పావనపురుషా! నేనింతమాలము ఎందరో నరులను చంపి వారి మాంసాన్ని భుజించి ఎంతో పాపాన్ని మూట కట్టుకొన్నాను. ఆ మాంసపు ముద్దలతో నా దేహమంతా కుళ్ళి కృశించింది. నామీదే నాకే అసహ్యం వేస్తోంది. ఈ జన్మ పోవాలని ఎంతగానో తపన పడుతున్నాను. ఎవరేని పుణ్యాత్ముడు ఇటువైపు రాకపోతాడా, వారి కృపతో ఈ జన్మకు మోక్షం రాకపోతుందా అని ఎదురు చూస్తున్నాను. ఇన్నాళ్ళకు నా యొక్క ఎదురు చూపులు ఫలియించి నీవు నాకు తారసపడ్డావు. పైగా మాటకు కట్టుబడి నీ సత్యసంధతను నిరూపించుకున్నావు. నీ కన్నా గొప్ప

భాగవతోత్తముడు ఎవరుంటారు? దయచేసి ఈ హేయమైన రూపాన్ని పోగొట్టి నన్ను పవిత్రునిగా చేయి. పరుసవేది ఇనుమును సువర్ణము చేసినట్లే మీరు మమ్ములను పవిత్రులుగా జేయుము.

దేహ సమర్పణము నొల్లక జాలిపడి వేడుకొన్న ఆ రక్కసుని గాంచి ఆ దాసరి ఇంతకూ నీ అభిప్రాయమేమి అని అడుగగా వాడు నా బ్రహ్మరాక్షసత్వము వదుల్చుటయే దయ. కాక శరీరమిచ్చెదనుట దయ కాదని చెప్పెను. అంతేకాదు మరొక్క మాట –

**"ఘంటా కర్ణుని మించు కర్మమొకో నాకర్మంబ మానీంద్రులు**
**దుంటల్సేయడె మాన్పి యీడె భగవంతుడట్టి శ్రీయట్టి శ్రీ**
**కంటెన్భాగవతుండు మించ నొసగంగా లేడె యా మేలు నా**
**కంటింప న్మతిరాడె పూజనము గాదా ప్రాణిమేల్చ క్రికిన్"**

ఘంటాకర్ణుడనే రాక్షసుని కంటె తాను ఎక్కువ పాపములు చేయలేదని, ఆ శ్రియాపతి అతని పాపములను పోగొట్టి అతనికి మహోన్నతమైన పదవినిచ్చాడని, భగవంతుని కంటె భాగవతుడు గొప్పవాడని శాస్త్రాలు బోధిస్తున్నాయి. ఒక ప్రాణి మేలు కోరుట పరమేశ్వరుని పూజించుటతో సమానము. అటువంటి నీవు నన్ను రక్షింపమని ప్రాధేయపడ్డాడు ఆ బ్రహ్మరాక్షసుడు. అంతేకాదు తన పేరు కుంభజానుడని, అంతకు ముందు తాను సోమశర్మ అనే బ్రాహ్మణుడనని, ధనకాంక్షతో హరినామ స్మరణ చేయకుండా బ్రాహ్మణులు చేయకూడని దుర్మార్గపు పనులు చేయడం వలన బ్రహ్మరాక్షసుడనయ్యానని, ఈ పాపిష్టి జన్మ పోగొట్టి తనను రక్షించాలని మాలదాసరిని వేడుకొన్నాడు.

**"ఇటువంటివి యిట కెక్కుడు**
**నిట దిగుడువి యొంద నెన్నియేనియును**
**క్కటి యొక నాటిద కాదొక**
**త్రుటి గీత ఫలంబు నొసంగుదునె యిమ్మెయికిన్"**

ఓయీ రక్కసుడా! ఇటువంటి శరీరములు ఇంతకు మించినవైనను, వీటికన్నా తక్కువైనను అనేక శరీరములెత్తియున్నాను కావున నా శరీరములలో ఇది ఒక్కటే కాని దీని కొరకు నా గాన ఫలము ఒక్కనాటిదే కాదు కదా. అటువంటి ఫలాన్ని ఏ కొంచెమైనను నీకు ఇవ్వను. కావాలంటే నా శరీరాన్ని భుజించి నాకు ధన్యత చేకూర్చమని మాలదాసరి తన నిర్ణయాన్ని తెలుపగా, ఓ దాసరీ! నీవు, నేను ఎన్నో జన్మలెత్తాము గాని, ఏ జన్మనందైనా విష్ణువు నందు భక్తి గలవారము కాము. అందువలన అనేక జన్మలు ఎత్తవలసి వచ్చినది. విష్ణుభక్తి కలిగినచో మరి ఏ జన్మ ఉండదు అని రాక్షసుడు పలికెను. ఈ అస్థిరమగు శరీరము కొరకు నా పుణ్యమును వ్యయము చేయుట కర్పూరమును అమ్మి ఉప్పు కొనుట వంటిదే. ఇక బేతాళ ప్రశ్నలు మాని నీకు ప్రమాణము చేసినట్లుగ నన్ను భక్షింపుము. లేని యెడల వేరే రాక్షసులు నన్ను భక్షిస్తారు అని దాసరి పలికెను.

ఆ మాటలు విన్న రక్కసుడు ఒక్కసారి కుప్పకూలి నేలపై బడి రోదిస్తూ తాను పూర్వాశ్రమములో అనగా సోమశర్మగా ఉన్నప్పుడు బ్రాహ్మణ తత్త్వానికి భిన్నంగా ప్రవర్తించానని, ధనకాంక్షతో అన్ని కులాలవారిని పీడనకు గురి చేశానని, హరినామ స్మరణ చేయకుండా, శ్రీహరి కైంకర్యములు చేయకుండా అనేక దుర్మార్గాలు చేశానని, దాని ఫలితమే ఈ హేయమైన రాక్షస జన్మ వచ్చిందని, అందువల్లనే ఈ జన్మలో కూడా అనేకమందిని చంపి మరింత పాపాన్ని మూట కట్టుకున్నానని, ఇక నన్ను రక్షించువాడు ఆ వేంకట నారాయణుడు దప్ప మరొక దైవము లేడని పశ్చాత్తాపము చెంది భాగవతోత్తముడైన మాలదాసరి పాదాలపై పడి శరణు వేడుకున్నాడు.

అప్పుడా మాలదాసరి పరమానంద భక్తిభావంతో, పశ్చాత్తాపంతో దుఃఖిస్తున్న ఆ బ్రహ్మరాక్షసుడైన కుంభజానువును లేవనెత్తి గాఢంగా ఆలింగనము చేసుకోగానే అతనిలోని గానఫల తేజస్సుతో రాక్షసరూపం పోయి నిజమైన బ్రాహ్మణ రూపం పొందగానే ఆ దాసరికి ప్రదక్షిణ చేసి అనేక విధాల స్తుతించి తన నిజనివాసానికి వెళ్ళి పోగా మాలదాసరి అనునిత్యం ఆ శ్రీమహావిష్ణువును నిరంతరం తన శక్తికొలదీ గానకైంకర్యము చేస్తూ మోక్షం పొందగలిగాడు.

ఈ కథ ద్వారా ఎవరైతే శ్రీవారి హృదయాన్ని దోచుకుంటారో వారికి తప్పనిసరిగా మోక్షం లభిస్తుంది. అటువంటి భాగవతుల వల్ల దుష్టస్వభావం కలిగినవారు కూడా వారి సత్సాంగత్యము వలన ఉద్ధరింపబడుతారు. హీనమైన చండాలపు కులములో పుట్టిన ఒక మాలవాడు నిరంతరం ఆ భగవంతుని యందే తన మనస్సు నిలిపి గాన కైంకర్యముతో భగవంతుడిని పరమానందభరితుణ్ణి గావించి భాగవతోత్తముడుగా మారితే, విశిష్టవంశమైన బ్రాహ్మణ కులంలో పుట్టిన సోమశర్మ తన చంచలమైన స్వభావంతో అనేక దుష్టకార్యాలు చేసి ధన కాంక్షతో శ్రీవారి హృదయంలో చోటు కోల్పోయి రాక్షసునిగా మారి అనేక పాపకార్యాలు చేసి నరక బాధలు అనుభవించాడు. అతడు ఏ కులాన్ని అసహ్యించుకుని అవమానించాడో చివరికి ఆ కులం వాడైన దాసరి కృపా కటాక్షాల వల్ల నిజస్వరూపం ప్రాప్తించి సద్గతి పొందాడు. కాబట్టి మోక్షానికి, ఈ జన్మ సార్థక్యానికి శ్రద్ధా భక్తులు ఎంతో అవసరం కాని, కులాన్ని బట్టి గాని, వయస్సును బట్టి కాని మోక్షం సిద్ధించదు అని ఈ కథ ద్వారా తెలుస్తోంది. ఇది యదార్థ సంఘటన అని తెలపడానికి తిరుమలకు మెట్లదారి మార్గంలో అలిపిరి వద్ద ఒక సాష్టంగ ప్రణామం చేస్తూ కనిపించే విగ్రహమే మాల దాసరి విగ్రహమని చరిత్ర పరిశోధకుల అభిప్రాయం. ఇప్పటికీ తిరుమల క్షేత్రంలో కార్తీక శుద్ధ ఏకాదశి నాడు ప్రతి యేటా మంగళకైశికి నామ ఉత్సవాన్ని నిర్వహించడం విశేషం.

పూర్వం ఈ కథను వరాహావతారంలో విష్ణుమూర్తి స్వయంగా

భూదేవితో చెప్పి నట్లుగా వరాహపురాణం పేర్కొంటున్నది. భూదేవి అంశతో జన్మించిన గోదాదేవి (ఆండాళ్) కూడా మాలదాసరి గాన కైంకర్యానికి ప్రేరణగా 30 పాశురాలు (తిరుప్పావై) రచించి, గానాలాపన చేసి ఆ శ్రీరంగేశునిలో ఐక్యం చెందారు.

**"అలర చంచలమైన ఆత్మలందుడ నీ**
**అలవాటు సేయనీ ఉయ్యాల**
**ఉయ్యాలా ఉయ్యాలా**
**పలుమార్లు ఉచ్ఛ్వాస పవనమందుండ నీ**
**భావంబు తెలిపెను ఉయ్యాల**
**ఉయ్యాలా ఉయ్యాలా!"**

ఈ చరణాలను బట్టి భగవంతుడు చంచలమైన ఆత్మలలో ఉండరని, నిశ్చల భక్తిగల వారియందు మాత్రమే ఆ సర్వేశ్వరుడు కొలువై ఉంటాడని అన్నమయ్య పేర్కొన్న మాటలు అక్షర సత్యాలు. గాన ఫలము చాలా గొప్పది కాబట్టే అన్నమయ్య 32 వేల సంకీర్తనలతో కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరునిపై రచించి, వాటిని పాడి ఆ గోవిందునిలో ఐక్యం పొందాడు.

**"జయ దురుత్తరణ సంసరణాబ్ధి దళనీర**
**జయ జయ గాయక సార్వభౌమ**
**జయ శౌరి గాథా రసజ్ఞ పుణ్య రసజ్ఞ**
**జయ జయ తత్త్వ సంశయ లవిత్ర**
**జయ జనార్వాచన జని సంగవంచక**
**జయ జయ దేశిక చరణ శరణ**
**జయ యుక్త వాక్ప్రతిష్ఠా తృణీత దేహ**
**జయ జయ భగవదాజ్ఞ తిష్ఠ**
**జయ సకల జంతు సమచిత్త జయ యార్ద్ర**
**జయ ముకుందా న్యదేవోస్తి శాస్త్ర బధిర**
**జయ చతుర్ద్వయ భక్తి లక్షణ చితాంగ**
**జయ మురారి ప్రసన్నాంఘ్రి జలజ మధుప"**

ఇది కదా శ్రీవారి హృదయమంటే. అలాంటి హృదయంలో చోటుకోసం ప్రయత్నించడం సద్భక్తుల లక్షణం.

★★★

# బ్రహ్మోత్సవాలలో

**– శ్రీమతి వెలమకన్ని పద్మావతి**

కలియుగ వైకుంఠమైన తిరుమలకొండ నిత్యమూ భక్తజన సందోహంతో అలరారుతుంది. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీనివాసునికి నిత్య వార పక్ష మాస సంవత్సరోత్సవాలు వైభవంగా తిరుమలలో జరుగుతాయి. ఈ ఉత్సవాలన్నీ ఒక ఎత్తయితే కన్యామాసంలో పది రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు మరొక ఎత్తు. ఈ బ్రహ్మోత్సవ సమయంలో భజనలు, కోలాటాలు, నృత్యాలు, సంగీత కచేరీలు, కనువిందు చేసే పుష్పాలంకరణలు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలతో, ఉత్సవాలు, ఊరేగింపులు అడుగడుగునా మంగళ హారతులతో తిరుమల కొండ అనంతమైన ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతుంది. ఈ సమయంలో తిరుమల కొండపై శాంతి భద్రతల పర్యవేక్షణ చేస్తూ భక్తులకు ఏ ఆపదా రాకుండా కంటికి రెప్పలా కాచుకునేదెవరు? అనే విషయాన్ని ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఈ భద్రతా బాధ్యత వహించే స్వామి శ్రీ సుదర్శన చక్రత్తాళ్వారు. శ్రీవారి చేతిలో ఆయుధంగా అలరారుతూ, జ్యోతి స్వరూపంలో అర్చించబడే, సుదర్శనుల వారు ప్రతి క్షణం అప్రమత్తంగా వుంటూ తిరుమలలో భద్రతను పర్యవేక్షిస్తారు. బ్రహ్మోత్సవ వేడుకలలో భాగంగా శ్రీదేవీ భూదేవీ సమేతంగా మలయప్ప స్వామి రెండు పూటలా తిరుమల వీధులలో ఊరేగుతారు. ఈ ఊరేగింపులనే వాహన సేవలు అంటారు. ఈ వాహన సేవల కోసం స్వామివారు బయలుదేరడానికి ముందుగా సుదర్శనులవారు పల్లకిలో తిరుమల వీధులలో భద్రతా పర్యవేక్షణ నిమిత్తం సంచరిస్తారు. "శ్రీవారు ఊరేగింపుకు వస్తున్నారు దుష్ట రక్కసులారా! ప్రతికూల శక్తులారా! పలాయనం చిత్తగించండి. భక్తుల జోలికి రాకండి. జాగ్రత్త!" అంటూ హెచ్చరిస్తారు. ఇలా భద్రతా పర్యవేక్షణ పూర్తి చేసుకుని ఆలయంలోకి ప్రవేశించి శ్రీవారికి తన భద్రతా నివేదిక అందిస్తారు. ఈ నివేదిక అందిన తరువాత మాత్రమే మలయప్పస్వామి వాహన సేవకు బయల్దేరుతారు. ఇలా తొమ్మిది రోజులూ, రెండు పూటలా సుదర్శనులవారు వాహన సేవకు ముందుగా తాను పల్లకిలో తిరుమల వీధులలో సంచరించి, భద్రతా నివేదిక స్వామికి సమర్పించి "ఊరేగింపుకు వెళ్ళవచ్చు" అనే సానుకూల సంకేతాన్ని అందించిన తరువాత మాత్రమే స్వామి ఊరేగింపుకు బయల్దేరుతారు. ఇలా తొమ్మిది రోజులూ తిరుమల కొండపై శాంతి భద్రతలతో పాటు తన భక్తుల భద్రత కూడా పర్యవేక్షించినందుకు – అలా బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరగడానికి తోడ్పడినందుకు ప్రశంసా పూర్వకంగా పదవరోజు స్వామి తాను అధిష్ఠించిన పీఠంపై సరసనే సుదర్శన చక్రాన్ని అధిష్ఠింప చేసి తనతో పాటుగా "తిరుమంజనం" చేయిస్తారు. ఆ తరువాత స్వామి పుష్కరిణిలో చక్రస్నానం జరుగుతుంది.

★★★

# కనగ కనగ కమనీయం, రమణీయం

## శ్రీ పద్మావతీదేవి బ్రహ్మోత్సవ పంచమీ తీర్థ వైశిష్ట్యమ్

– చింతలపాటి శివశంకర శాస్త్రి

శ్లో॥ "శ్రీంకారం వరదాభయప్రద కరాం పుల్లాబ్జ హస్తాం శుభాం
కళ్యాణీం కమలామనంత ధనదాం సర్వార్థ ధాత్రీ ప్రభాం
బ్రహ్మేశాది సురార్చితాం భగవతీం శ్రీవిష్ణు పత్నీం రమాం
శ్రీలక్ష్మీం ప్రణమామి సర్వజననీం భక్తార్తి విధ్వంసినీమ్"

కృత్తిక అనే నక్షత్రంతో కూడిన పున్నమి గల మాసాన్ని కార్తీక మాసమని అంటారు. కృత్తికా నక్షత్రం అగ్ని నక్షత్రం. కార్తీకం కమనీయం, రమణీయం, మహనీయం, కైవల్యకారకం, హరిహరప్రియం, జగద్రక్షాకరం. హరిహరులిద్దరూ అద్వైతంగా, అన్యోన్యంగా పూజలందుకుంటూ భక్తులను అనుగ్రహించే మాసం కార్తీకం. దీపారాధనలు, దీపదానాలు, ధార్మిక క్రతువులు, పుణ్యనదీ స్నానాలు, దానధర్మాలు, తులసీ పూజలకు అనువైన, మేలైన కాలం కార్తీకం.

పుణ్యాల రాశి, సర్వజగత్తునూ కాచే తల్లి, దారిద్ర్య నాశిని, సంతత సౌభాగ్యదాయిని అయిన శ్రీ పద్మావతీదేవి కార్తీక బహుళ పంచమి శుభలగ్నాన ఆకాశరాజు, ధరణీదేవి దంపతులకు పద్మసరోవరంలోని పద్మంలో లభించింది. ఈనాడు పంచమీ తీర్థంలో ఉత్సవాలు జరుగుతాయి. పద్మావతీదేవికే అలమేల్ మంగ అని పేరు. 'అలర్' అంటే పువ్వు. 'మేల్' అంటే మీద ఉన్న 'మంగై' అంటే పువ్వు మీద ఆసీనురాలై ఉన్న యువతిగా తమిళులు పిలుచుకున్న ఆ మహాలక్ష్మిని తెలుగువారు అలమేల్ మంగ అని, పద్మావతి అని పిలుచుకుంటారు. నిండుగా పద్మం పైన కూర్చుని, రెండు చేతుల్లో పద్మాలను పట్టుకుని అభయ వరద హస్తాలతో భక్తులకు దర్శనమిస్తుంది.

అలమేల్ మంగమ్మ సుందర రూపంతో వర్ణనలకు అందని రీతిలో ఉంటుంది. ఆమె సొంపు, సోయగం నయన మనోహరం. అమ్మ ముఖారవిందం పూర్ణచంద్రుడిలా గుండ్రంగా ఉంటుంది. పెదవులపై చెరగని, తరగని చిరు మందహాసం కనిపిస్తుంది. ఆ పెదవుల మధ్య దోబూచులాడుచూ కనపడీ, కనపడకుండా ఉన్న ముత్యాల వంటి పలువరుస ఉంటుంది. సంపెంగ వంటి నాసిక, రతనాల ముక్కెర, నాసికకు ఇరువైపులా దయారసాన్ని పొంగింప చేస్తున్న సుందరమైన విశాల నేత్రాలు, వాటి అంచున ఇరువైపులా ఓంకారంలాగా భాసిస్తున్న కర్ణద్వయం, నిగనిగ లాడే చెక్కిళ్ళు, వాటి సొంపును మరింత ప్రస్ఫుటం



చేస్తున్న మణిమయ కర్ణాభరణాలు, నాసికకు పైన కస్తూరి కుంకుమలతో భాసిస్తున్న ఫాలభాగం, పద్మ సరోవరం నుంచి వీస్తున్న చల్లని పిల్లవాయువులకు సుకుమారంగా కదలాడుతున్న నల్లని తుమ్మెదల వంటి ముంగురులు, ఆ జగన్మాతయే అఖిల లోకాల సామ్రాజ్ఞి అన్నట్లుగా దివ్యకాంతులతో మిరుమిట్లు గొలుపుతూ ఆమె శిరస్సు పైన చక్కగా అమరిన అందాల నవరత్న కిరీటం, మామిడి చిగురుల వంటి ఎర్రని వర్ణంతో ప్రకాశిస్తున్న ఆ తల్లి దివ్య మంగళ శరీరం, ఆపాదమస్తకం లావణ్య కాంతులతో వింత వింత సొబగులు చూచువారికి చక్కటి నయనానందకరంగా, భక్తిభావంతో, తాదాత్మ్యంతో గోచరిస్తాయి. మెడలో కంఠాభరణాలు, చేతులకు నవరత్నాల గాజులు, కాళ్ళకు కడియాలు, కాలివేళ్ళకు బంగారు మట్టెలు,

నడుముకు వడ్డాణం , కింది కుడిచేయి అభయ ముద్రతోను, ఎడమచేయి వరదముద్రతోను అలరారుతూ ఉంటుంది.

తిరుచానూరులో వెలసిన శ్రీ పద్మావతీ అమ్మవారికి కార్తీక మాసంలో బ్రహ్మోత్సవాలు నవాహ్నిక దీక్షతో నిర్వహిస్తారు. తి రుచానూరు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) తో ఉత్సవ సన్నాహాలు ప్రారంభమవుతాయి. తొలిరోజు సేనాపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహిస్తారు. ఆ మరునాడు ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అమ్మవారి ధ్వజపతాకంపై ఐశ్వర్యవంతుడు, మహాబలుడు, ఓంకార నాదమయుడు అయిన గజరాజు ఉత్సవాలకు ఆహ్వానం అందిస్తాడు. 'హస్తినాద ప్రబోధిని' అయిన శ్రీమహాలక్ష్మి బ్రహ్మోత్సవాలకు దేవతలంతా తరలి రావాల్సిందిగా కోరుతూ పండితులు రాగ తాళ గద్య చూర్ణికలతో ఆహ్వానిస్తారు.

బ్రహ్మోత్సవాలలో తొలిరోజున విశ్వమాత చిన్న శేషవాహనంపై ఊరేగుతూ తను ప్రసాదించిన ప్రకృతిని కన్నులారా చూసి ఆనందిస్తుంది. చిన్న శేషుడు ప్రపంచానికి ప్రతీక. పంచ తత్వాలకు సంకేతం పెద్ద శేషవాహనం. అంటే ఏడు పడగలు కలిగిన ఆదిశేషుడు. శంఖ చక్ర గదా పాణి యైన నారాయణి ఆదిశేషునిపై విచ్చేసి జగద్రక్షణకు పూనిక వహిస్తుంది. హంసలోక ప్రదాయిని అయిన లక్ష్మీదేవి రెండవరోజు రాత్రి హంస వాహనంపై సరస్వతీ అలంకారంతో ఊరేగి విద్యాభిక్ష ప్రసాదిస్తుంది.

బ్రహ్మోత్సవాలలో మూడవ రోజు అలమేల్ మంగమ్మ ముత్యాల సరాల పందిరిలో కాళియ మర్దనుడైన కృష్ణుని రూపంలో దర్శనమిచ్చి, ఆశ్రయించిన వారికి జన్మరాహిత్యాన్ని ప్రసాదిస్తుంది. సింహవాహినియై దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తుంది. కల్పవృక్షాలు దేవజాతికి చెందినవి. మందారం, పారిజాతం, సంతానం, కల్పం, హరిచందనం అనే కల్పవృక్షాలు కోరిన కోరికలను ఫలింపచేస్తాయి. కల్పవృక్షం కంటే అధికురాలైన జగన్మాత వాంఛితార్థ ఫలదాయినియై కల్పవృక్షంపై నాలుగోరోజు అనుగ్రహిస్తుంది. హనుమ దాస్యభక్తికి ముగ్ధురాలైన పద్మావతీదేవి అయిదవ రోజు హనుమద్వాహనంపై ఊరేగి భక్తులకు తృప్తి కలిగేటట్లు అభయ ప్రదానం గావిస్తూ దర్శనమిస్తుంది. ఆనాటి సాయంత్రం గరుడ వాహనంపై అమ్మవారిని ఊరేగిస్తారు. స్వామివారు మోహినీదేవి అవతారంతో పల్లకీలో ఊరేగుతారు.

ఆరవ రోజు గజవాహనంపైన ఊరేగిస్తారు. గజవాహనం పట్టభద్రతకు సంకేతం. శ్రీహరి రాణిని జగద్ధాత్రిగా నిరూపిస్తుంది. ఏడవరోజు ఉదయం సూర్యప్రభ వాహనంపైన, సాయంత్రం చంద్రప్రభ వాహనంపైన ఊరేగిస్తారు. ఎనిమిదవ రోజున సర్వాలంకృతమైన రథం పైన ఊరేగింపు చేస్తారు. మరియు అశ్వవాహనంపైన ఊరేగి వాటి సేవలను అందుకున్న అలమేల్ మంగమ్మ అరిషడ్వర్గాలను అరికట్టి మోక్షపదవిని అనుగ్రహిస్తుంది.

అమ్మవారి బ్రహ్మోత్సవాలలో చివరి ఘట్టం "పంచమీ తీర్థం" కన్నుల పండువగా జరుగుతుంది. తిరుమల నుంచి శ్రీవారు దేవేరికి సారె పంపుతారు. భక్తుల కోలాటాల నడుమ, ఏనుగు అంబారీపై ఆ సారెను తిరుచానూరులోని పసుపు మండపానికి చేరుస్తారు. పసుపు, కుంకుమ, తులసి, పట్టుచీర, అన్నప్రసాదం ఆ సారెలో ఉంటాయి. అలమేల్ మంగమ్మ జన్మదినం సందర్భంగా పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహిస్తారు. శ్రీవారు పంపిన చీరను అమ్మవారికి అలంకరిస్తారు. విశేష అర్చనలు కావిస్తారు. అయ్య పంపిన నైవేద్యమును అమ్మకు అందిస్తారు. అమ్మవారి ప్రతినిధిగా సుదర్శన చక్రత్తాళ్వార్ సారథ్యంలో భక్తులందరూ పద్మసరోవరంలో పవిత్రస్నానం చేస్తారు.

పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణోత్సవం ఆగమ శాస్త్ర పద్ధతిలో పాంచరాత్ర దీక్షతో నిర్వహిస్తారు. నారాయణగిరి వనంలో వైభవోపేతంగా మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవంలో కళ్యాణవేదికను అత్యంత మనోహరంగా అలంకరిస్తారు. సుముహూర్తపు వేళకు స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు. మరునాడు ఋత్విగ్వరణ, మృత్ సంగ్రహణం, అంకురార్పణ తరువాత ధ్వజారోహణం చేస్తారు. కళ్యాణోత్సవానికి ముందురోజు రాత్రి ఎదుర్కోలు ఉత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఈ కళ్యాణోత్సవాలలో రథోత్సవం చూసిన వారికి కన్నుల పంట. అవభృథ స్నానం నిర్వహిస్తారు. వేదసభ జరుగుతుంది. నిత్య హోమ, బలిహరణలు, పూర్ణాహుతి, మౌనబలి సమర్పిస్తారు. ధ్వజాన్ని అవరోహణ చేస్తారు.

చివరి రోజు ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం వేడుకగా జరుగుతాయి. కళ్యాణోత్సవం సందర్భంగా ప్రభుత్వం అమ్మవారికి, అయ్యవారికి పట్టుచీర, పట్టువస్త్రాలు సమర్పిస్తారు. చివరి రోజు రాత్రికి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు చేసిన అనంతరం పుష్పయాగం, పవళింపు సేవలతో కళ్యాణోత్సవాలు ముగుస్తాయి. భక్తులు బాణసంచా కాలుస్తారు.

పుణ్యాలరాశి, సకలజగత్తును కాచే కల్పవల్లి, సంతత సౌభాగ్యదాయిని అయిన శ్రీమహావిష్ణు ధర్మపత్ని పద్మావతీదేవిని పవిత్ర బ్రహ్మోత్సవాల సందర్భంగా సేవించి, పూజించి తరిద్దాము.

**ఓం నమ శ్రియై లోక ధాత్ర్యై బ్రహ్మ మాత్రే నమో నమః**
**నమస్తే పద్మనేత్రాయై పద్మ ముఖై నమో నమః**
**ప్రసన్న ముఖ పద్మాయై పద్మకాంతై నమో నమః**
**నమో బిల్వ వనస్థాయై విష్ణుపత్న్యై నమో నమః**
**ఓం నమో వేంకటేశాయై నమో నమః**

★ ★ ★

# కార్తీకంలో వనభోజనాలు

– కౌతా నిర్మల



కార్తీకంలో ఉసిరి చెట్టు కింద సాలగ్రామాన్ని, తులసి మొక్కను ఉంచి, తులసిని, విష్ణుమూర్తిని పూజించి, ఆ తర్వాత ఆ వనంలో భోజనాలు చేసి, సత్కాలక్షేపం చేయడం కార్తీక వనభోజనాల విశేషం. కార్తీకంలో వనభోజనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. సామూహిక భోజనాలు, పచ్చని చెట్ల కింద, ప్రకృతి ఆహ్లాదకరమైన వాతావరణంలో చేయడం వల్ల, వారి మధ్య ఐక్యత, ఆదరాభిమానాలు, స్నేహభావం పెంపొందుతాయి.

ఆఫీసులో ఒకచోట పనిచేసే ఉద్యోగులు, అపార్టుమెంట్లలో నివసించే కుటుంబీకులు, కార్తీక మాసంలో వనభోజనం చేయటానికి ఎంతో ఉత్సాహపడతారు. వారేకాదు, సన్నిహిత బంధువులు, మిత్రులు, ఇరుగు పొరుగున ఉన్నవారు కూడా వనభోజనాలు ఏర్పాటు చేసుకుంటారు. సామూహికంగా భోజనాలు చేసే వారిమధ్య ఎక్కువ తక్కువ భేదభావాలు, కులమత తేడాలు ఉండవు. అందరూ తలో పని అందుకుంటూ మిత్రభావంతో మెలగుతారు.

ఉసిరి చెట్టుకు ప్రదక్షిణాలు చేసి, పూజించిన తరువాతనే వంటకాల తయారీ మొదలుపెట్టాలి. తాము చేసిన ఆహార పదార్థాలను ఉసిరి, తులసి మొక్కలకు నైవేద్యంగా సమర్పించాలి. ఇంటి దగ్గరే ఆహార పదార్థాలను తయారు చేసి, వాటిని వనానికి తీసుకువెళ్ళి, అక్కడ భోజనం చేయడమన్నది సంప్రదాయం కాదు. వంటకు కావలసిన పాత్రలు, సామగ్రిని తీసుకెళ్ళాలి. చెట్లకింద చక్కగా శుభ్రం చేసి చాపలను, జంపఖానాలను పరచాలి. కూరగాయలు తరగడం, వంట చేయడం, పిండివంటల తయారీ, వడ్డించడం, మంచినీళ్ళు అందించడం, భోజనం పూర్తవగానే విస్తళ్ళు తీసి చెత్తబుట్టలో వేయడం, అక్కడ శుభ్రపరచటం లాంటి పనులెన్నింటినో అందరూ పంచుకుని, సమిష్టిగా పని చేస్తే, అలసిపోకుండా ఉత్సాహంగా, చురుకుగా పనులను చేయగలుగుతారు. ఎవరిమధ్యనైనా అంతకుముందు అపార్థాలు, అశాంతి, దూరం ఏర్పడి ఉంటే, అవి తొలగిపోయేలా చేసి వారి మధ్య అవగాహన సద్భావం, ఐకమత్యం ఏర్పడేలా చేస్తుంది వనభోజనం.

కార్తీక భోజనాల సందర్భంగా కార్తీక మాసపు విశిష్టతను, కార్తీకంలో చేయవలసిన పనులను, శివకేశవుల కథలను పెద్దలు తెలియచేస్తే అది సత్కాలక్షేపం అవుతుంది. విష్ణుసహస్రనామ పారాయణం చేయడం, దైవ భజన చేయడం, గీతాలను ఆలపించడం పుణ్యప్రదం. కార్తీక శుక్లపక్షంలో వనభోజనాలు చేసిచ విష్ణువును పూజించి, ఆయనను ధ్యానిస్తూ, ఆయన అవతారాలను స్మరించుకుంటే పాప విముక్తులై, విష్ణు సాయుజ్యాన్ని చేరవచ్చని పురాణ వచనం. వృక్షాలను రక్షించాలని ధర్మం చెబుతోంది. చెట్లు కూడా సంతోషం, బాధ లాంటి అనుభూతి చెందుతాయని మనుస్మృతి తెలిపింది. చెట్లకు ప్రాణం ఉందని శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్ నిరూపించారు. కార్తీక వనభోజనాలు చేసి పురాణ శ్రవణం, భజనలతో ఆ చెట్ల క్రింద గడిపేవారికి అమిత పుణ్యం లభిస్తుందని పద్మపురాణం వివరించింది. చెట్లకు స్వార్థం కానీ, స్వలాభాపేక్ష కాని ఉండవు. వృక్షాలు అనేక జీవాలకు, పక్షులకు నివాస స్థలాలు. చెట్లు మానవులకు ఆహారాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. ప్రాణవాయువును అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడుతాయి. సంవత్సరానికి ఒక రోజు కార్తీక మాసంలో, ఈ విధంగా చెట్లమధ్య, వనభోజనాల పేరిట, ఎక్కువ సమయం, ముఖ్యంగా అందరితో కలిసి సంతోషంగా గడపడం ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తుంది. వనభోజనానికి వెళ్ళిన ప్రతివారూ ఆ వనంలోని వృక్షాలకు కృతజ్ఞతలు తెలియజేయడమన్నది మన కనీస బాధ్యత.

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## పక్ష, మాసోత్సవాలు, పక్షోత్సవాలు

శ్రీవారికి ప్రతి ఏకాదశి నాడూ పక్షోత్సవం జరుగుతుంది. ఆనాడు విశేష ఉత్సవాలు, ఊరేగింపులూ ఉండవు. అయితే, నివేదనలో మాత్రం ప్రత్యేకంగా దోశెలు, సుండలు (గుగ్గిళ్ళు) సమర్పించబడతాయి.

## మాసోత్సవాలు

శ్రీవారి ఆలయంలో ప్రతినెలా ఆయా నక్షత్ర దినాల్లో విశేషంగా కొన్ని ఉత్సవాలు జరుగుతున్నాయి. కాబట్టి వీటిని నక్షత్రోత్సవాలుగా కూడా పిలుస్తారు. నెలకు ఒక్కసారే వస్తాయి కనుక వీటిని మాసోత్సవాలుగా కూడా పిలుస్తారు. వీటిలో ముఖ్యమైనవి అయిదు.

**1. రోహిణీ నక్షత్రోత్సవం**

ప్రతినెలా శ్రీకృష్ణుని జన్మ నక్షత్రమైన రోహిణీ నక్షత్రం నాటి ఉదయం సుప్రభాతానంతరం, భోగశ్రీనివాసునితో పాటు గర్భాలయంలోని రుక్మిణీ శ్రీకృష్ణులకు కూడా అభిషేకం జరుగుతుంది. ఆరోజు సాయంత్రం శ్రీకృష్ణుడు రుక్మిణీ సమేతంగా ఆలయం వెలుపలకు వేంచేసి, సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొంటారు. పిదప, మాడ వీధుల్లో ఊరేగి ఆలయ ప్రవేశం చేస్తారు. ఈ సేవలో పాల్గొన్న 27 నక్షత్రాల వారందరికీ, విశేషంగా రోహిణీ నక్షత్రం వారికి నక్షత్రశాంతి జరిగి దోష విముక్తులవుతారు.

**2. ఆర్ద్రా నక్షత్రోత్సవం**

శ్రీ భగవద్రామానుజుల వారి అవతార నక్షత్రమైన ఆర్ద్రా నక్షత్రం నాటి సాయం సంధ్యలో శ్రీ మలయప్ప స్వామి వారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొంటారు. ఆరోజు భగవద్రామానుజుల వారు మరో పీఠాన్ని ఎక్కి, శ్రీ స్వామివారికి అభిముఖంగా, స్వామివారికి స్వాగతం పలుకుతున్నట్లుగా, తిరుమల మాడ వీధుల్లో ఊరేగింపబడతారు. మేషమాసంలో ప్రత్యేకంగా, ఆర్ద్రా నక్షత్రానికి పది రోజుల ముందు నుండి భాష్యకారుల ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఆ పదిరోజులూ స్వామివారికి అభిముఖంగానే రామానుజాచార్యుల వారు ఊరేగింపబడతారు. ఆలయంలో భాష్యకార్ల సన్నిధి యందు స్వామివారికి ఆస్థానం జరుపబడుతుంది. నివేదనానంతరం స్వామివారి పూలమాలలు రామానుజాచార్యుల వారికి సమర్పిస్తారు. అలాగే స్వామివారి శేషహారతి రామానుజులకు ఇవ్వబడుతుంది. ఈ దర్శనంతో ఇరవయ్యేడు నక్షత్రాల వారికీ ముఖ్యంగా ఆర్ద్రా నక్షత్ర సంజాతులకు, నక్షత్ర శాంతి జరిగి శుభం చేకూరుతుంది.

**3. పునర్వసు నక్షత్రోత్సవం**

శ్రీరాముని జన్మనక్షత్రం పునర్వసు. ప్రతినెలా పునర్వసు నక్షత్రదినాన సుప్రభాతానంతరం, భోగశ్రీనివాసునితో పాటుగా శ్రీ సీతారామాలక్ష్మణులకు కూడా అభిషేకం జరుగుతుంది. శ్రీరామనవమి రోజు, ఆ మరునాడైన దశమి రోజూ

బంగారు వాకిలి ముందు శ్రీ సీతారామలక్ష్మణులకు ఆస్థానం జరుగుతుంది. ఆ సాయంత్రం జరిగే సహస్ర దీపాలంకరణ సేవలో శ్రీ సీతారామలక్ష్మణులు, శ్రీ దాసాంజనేయస్వామి మాత్రమే పాల్గొంటారు. అనంతరం తిరుమల పురవీధుల్లో ఊరేగింపు జరిగిన తరువాత శ్రీ సీతారామలక్ష్మణులు శ్రీ బేడీ ఆంజనేయస్వామివారి సన్నిధికి వేంచేస్తారు. రాములవారి పూలమాలలను ఆంజనేయుడికి సమర్పించిన తరువాత, వారికే శేషహారతి కూడా ఇవ్వబడుతుంది. పిదప శ్రీ సీతారామలక్ష్మణులు ఆలయ ప్రవేశం చేసి యథాస్థానంలో ఆసీనులవుతారు. ఈ సేవలో పాల్గొనడం ద్వారా 27 నక్షత్రాల వారికీ, విశేషంగా పునర్వసు నక్షత్రంలో జన్మించిన వారికీ నక్షత్రశాంతి జరుగుతుంది.

బేడీ ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన విశేషాల్ని ఈ రోజే, రాబోయే ఉప ప్రకరణంలో తెలుసుకుందాం.

**"రామచంద్రుడితడు రఘువీరుడు**
**కామిత ఫలము లియ్యగలిగే నిందరికి**
**తలప శబరి పాలి తత్త్వపు రహస్యము**
**అలరి గుహుని పాలి ఆదిమూలము**
**కలదన్న వారి పాలి కన్ను లెదుటి మూరితి**
**వెలయ శ్రీవేంకటాద్రి విభుడీతడు"**

**4. శ్రవణా నక్షత్రోత్సవం**

శ్రీవేంకటేశ్వరస్వామి శ్రవణా నక్షత్ర పుణ్యదినాన అవతరించారు. వేంకటేశునికి అభిన్నుడైన ఆదివరాహుడు కూడా శ్రవణా నక్షత్ర సంజాతుడే! శ్రవణా నక్షత్రం ఉదయాన భోగశ్రీనివాసునితో పాటుగా, ఉభయ నాంచారులతో కూడిన మలయప్పస్వామికి అభిషేకం జరుగుతుంది. ఆ రోజు పగటి సేవలన్నీ సమాప్తం అయిన తరువాత, మలయప్ప స్వామివారు దేవేరులతో సహా సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొన్న పిదప పురవీధుల్లో ఊరేగి ఆలయంలో పునః ప్రవేశం చేస్తారు. కొన్ని మాసాల్లో శ్రీవారి అవతార నక్షత్రమైన శ్రవణా నక్షత్రంలో విశేష పూజలు జరుగుతాయి. ప్రతి కన్యారాశిలో, శ్రవణా నక్షత్రం నాటికి ముగిసేటట్లుగా, బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆ తరువాత వచ్చే కార్తీకమాసంలోని శ్రవణా నక్షత్రం రోజున, స్వామివారికి కన్నుల పండువగా పుష్పయాగోత్సవం నిర్వహిస్తారు.

**5. పున్నమి గరుడసేవ**

వివిధ నక్షత్రోత్సవాలే కాకుండా, ప్రతినెలా, ప్రతి పున్నమి రాత్రి తిరుమలేశునికి పున్నమి గరుడసేవ జరుపబడుతుంది. ఆ రోజు సాయంకాలం ఏడు గంటలకు వజ్రకవచ, వజ్రకిరీటధారి, సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్పస్వామివారు గరుడునిపై వేంచేసి ఛత్ర చామరాలతో, గజ, తురగ, వృషభరాజాలతో తిరువీధుల్లో విహరిస్తారు.

## బేడీ ఆంజనేయుని సన్నిధి

త్రేతాయుగంలో శ్రీరామునికీ – శ్రీ ఆంజనేయునికీ ఉన్న ఆత్మీయతానుబంధం కలియుగంలోనూ కొనసాగుతోంది. దాస్యభక్తికి ప్రతిరూపమైన ఆంజనేయుడు, ముకుళిత హస్తాలతో, శృంఖలా బద్ధుడై, స్వామివారి మహాద్వారానికి ఎదురుగా, సమున్నతంగా, అఖండానికి చేరువగా ఉన్న ఓ మందిరంలో దర్శనమిస్తారు. దీనినే బేడీ ఆంజనేయస్వామి ఆలయంగా వ్యవహరిస్తారు.



ఆంజనేయుడికి ఈ పేరు రావడం వెనుక అనేక కథనాలు వెలుగులో ఉన్నాయి.

పూర్వం సప్తగిరులలో ఒకటైన అంజనాద్రిపై, అంజనాదేవి తనయుడైన ఆంజనేయుడు పసిబాలునిగా ఉన్నప్పుడు అతనితో కలిసి నివసించేది. చిన్నారి ఆంజనేయుడు చిలిపితనంతో ఒక ఒంటె వెనుక అల్లరిగా పరుగెడుతూ ఉండేవాడు (ఒంటెను ఆంజనేయ స్వామి వాహనంగా పేర్కొంటారు). విసుగెత్తిన అంజనాదేవి తన కుమారుణ్ణి ఇప్పుడీ ఆలయం ఉన్న ప్రదేశంలో శృంఖలాబద్ధుణ్ణి గావించి, తాను తిరిగి వచ్చేవరకూ అక్కడే ఉండమని ఆజ్ఞాపించి తపస్సు నిమిత్తం ఆకాశగంగ తీర్థానికేతెంచింది. కారణాంతరాల వల్ల ఆమె తిరిగి రాలేకపోయింది. ఆజ్ఞాబద్ధుడైన ఆంజనేయుడు తల్లి రాక

కోసం ఎదురు చూస్తూ ఇంకా ఆ ప్రదేశంలోనే స్వామివారికి నమస్కరిస్తూ నిలబడి ఉన్నాడు. ఆవిధంగా అచంచల రామభక్తికే కాదు, మాతృవాక్య పరిపాలనకు కూడా ఆంజనేయుడు ప్రఖ్యాతి గాంచాడు.

మరో కథనం ప్రకారం భేఁ అనే ఉత్తర భారత పదానికి ''సమ్ముఖం'' అని అర్థం. స్వామివారి సమ్ముఖంలో ఉన్నాడు కనుక 19వ శతాబ్దంలో తిరుమల క్షేత్రం ఉత్తర భారత దేశానికి చెందిన మహంతుల ఆధ్వర్యంలో ఉన్నప్పుడు ఈ ఆంజనేయుడిని భేఁ ఆంజనేయుడిగా పిలిచేవారు. అదే కాలక్రమంలో బేడీ ఆంజనేయుడిగా రూపాంతరం చెందింది.

ఇంకా అనేక ఆసక్తికరమైన కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

తిరుమలలో స్వామివారి ఆలయం, ఆదివరాహస్వామి ఆలయం తరువాత అత్యంత ప్రసిద్ధి చెందినది ఈ ఆలయమే. ఈ ఆలయం గర్భాలయం, ముఖమండపం అని రెండు భాగాలుగా నిర్మించబడింది. గర్భాలయంలో గోడవారకు మధ్యలో ఆరడుగుల నిలువెత్తు ఆంజనేయుడు ప్రతిష్ఠింపబడ్డాడు. గర్భాలయంపై ఏక కలశ గోపురం నిర్మింపబడింది. దీనికి నాలుగు మూలలా సింహాల ప్రతిమలు అమర్చబడి ఉన్నాయి. ఆలయం చుట్టూ ప్రదక్షిణ మార్గం కూడా ఉంది. ప్రతిరోజూ మూడు పూటలా, స్వామివారి నివేదనానంతరం, స్వామివారి ఆలయం నుండి వచ్చిన అన్న ప్రసాదాలతో ఆంజనేయునికి నైవేద్యం జరుగుతుంది.

బ్రహ్మోత్సవాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు బేడీ ఆంజనేయుని ఆలయం నుండి ఊరేగింపుగా వెళ్ళి శ్రీవేంకటేశునికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

అంజనాదేవి తపస్సు ముగించుకుని ఎప్పుడు వస్తుందో? పాపం ఆంజనేయుడికి ఈ బేడీల నుండి ఎప్పుడు విముక్తి కలుగుతుందో? అంతా శ్రీనివాసుని చిద్విలాసం.

ఉభయులూ ఒకరిని విడిచి వేరొకరు ఉండలేక, జన్మ జన్మలకూ ఈ సాన్నిహిత్యాన్ని కొనసాగిస్తున్నారేమో.

**"కలశాపురము కాడ గంధపు మాకుల నీడ –**
**లరేవు మేలు మేలు హనుమంతరాయ....**
**దిక్కులు గెలిచితివి ధీరత బాజ గొంటివ మిక్కిలి ప్రతాపాన మెరసితివి**
**ఇక్కువతో శ్రీవేంకటేశ్వరు బంటు వైతివి హనుమంతరాయ"**

శ్రీవారి దర్శనం ముగించుకోగానే, మనం సాధారణంగా మాడవీధుల ప్రక్కనే ఉన్న తరిగొండ వెంగమాంబ సత్రంలో ఉచిత భోజనం చేసి అదే శ్రీవారి మహాప్రసాదంగా భావిస్తాము. ప్రతిరోజూ సుమారు లక్షమందికి, అదే బ్రహ్మోత్సవాల్లో రెండు లక్షల మందికి వండి వడ్డించే ''నభూతో నభవిష్యతి'' అన్న చందంగా ఉండే ఈ భోజనశాలకు ఆ భక్తురాలి పేరెందుకు పెట్టారు?

**(సశేషం)**

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**



## 88 వ కళ్యాణం

ఇది తేది 11-10-2025 శుక్రవారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. జామై ఉస్మానియా వద్ద కల లలితానగర్ కమ్యూనిటీ హాల్ లో శ్రీమాన్ టి.విశ్వేశ్వరరావు, విశ్వజ్యోతి దంపతుల ఆధ్వర్యములో వైఖానసాగమోక్తంగా జరిగింది.

# పుణ్య పౌర్ణమి



– డా॥ దేవులపల్లి పద్మజ

**కార్తీకమాసములో చేసిన పుణ్య కార్యక్రమాలు శీఘ్ర ఫలితాలను అందిస్తాయి. ఈ మాసములో మధ్యరోజైన పౌర్ణమి అత్యంత శుభప్రదమైనది. శివకేశవులకు ప్రీతికరమైన మాసం కాబట్టి ఈ మాసంలో చేసే పూజలు వారిరువురి అనుగ్రహం కలిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. కార్తీకమాసం నెల రోజులు చేసే పూజలన్నింటికంటే కార్తీకపౌర్ణమి నాడు చేసే పూజకు ఫలితము అధికముగా ఉంటుంది. కార్తీకపౌర్ణమి నాడు చేసే పౌర్ణమి వ్రతము సౌభాగ్యమునిచ్చు అరుదైన పర్వదినముగా పేర్కొనవచ్చును. అటువంటి కార్తీక పౌర్ణమి విశేషాలను తెలుసుకుందాము.**

ఈ కార్తీక పౌర్ణమి రోజున స్త్రీలు సూర్యోదయానికి పూర్వమే పూజావిధిని పూర్తి చేయవలసి ఉంటుంది. మన సాంప్రదాయం ప్రకారం ఈరోజు ఉదయమే పుణ్యస్త్రీలు మంగళ స్నానం ఆచరించి శుచియైన వస్త్రములు ధరించి ఇంటిముంగిట రంగవల్లులు దిద్ది పార్వతీ పరమేశ్వరులకు ఆహ్వానం పలుకుతూ ఇల్లంతా అలంకరించాల. సూర్యోదయానికి పూర్వమే తులసికోట వద్ద తనవంతుగా 365 వత్తులు, భర్త వంతుగా మరొక 365 వత్తులు వెరసి 730 వత్తులతో దీపాలను ఆవునేతితో గాని, కొబ్బరినూనెతో కాని, నువ్వుల నూనెతో కాని తడిపి వెలిగించాలి. అంతేకాకుండా బియ్యపుపిండితో చేసిన దీపాలను, ఉసిరికాయ దీపాలను కూడా సమర్పించాలి. అన్నింటికన్నా ఆవునెయ్యి శ్రేష్ఠము. ''దీపం జ్యోతి పరబ్రహ్మ. దీపం జ్యోతి జనార్దన. దీపో హరతుమే పాపం దీపం జ్యోతి నమోస్తుతే'' అంటూ నమస్కారం చేయాలి. అటు పిమ్మట శివాలయమునకు వెళ్ళి గుమ్మడి, కంద దుంప, తాంబూలాదులతో బ్రాహ్మణులకు దానమిచ్చి, నమస్కరించి వారి ఆశీర్వాదాన్ని పొందాలి. అరటి దొన్నెలో దీపాలను వెలిగించి పవిత్ర నదులలో, కాలువలలో వదులుతారు. నదీమతల్లికి పసుపు కుంకుమను సమర్పిస్తారు. ఈ దృశ్యం అత్యంత మనోహరంగా, కనులకింపుగా ఉంటుంది. దీనివల్ల నదీమతల్లి సంతసించి సకల సంపదలు ప్రసాదిస్తుందని, సంపూర్ణ సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందని నమ్మకం. ఈ దినమంతా ఉపవసించి, సంధ్యాసమయంలో యథావిధిగా తిరిగి స్నానాదులు గావించి, చంద్రునికి భక్తితో కుటుంబ సౌఖ్యం, ఐశ్వర్యం కోరుకుంటూ దీపాలు సమర్పించి వేడుకోవాలి.

''కళ్యాణప్రదమైన ఓ సంధ్యాజ్యోతీ మాకు ఆరోగ్యం, ధనం, సంపద, శుభం అనేవి కల్పించి మా యొక్క బాహ్యాంతర శత్రు వినాశనం కలిగించమని నమస్కరిస్తున్నాను'' అని దీపాలతో అంజలి ఘటించి నమస్కారం చేయాలి. పార్వతీ పరమేశ్వరులను, లక్ష్మీనారాయణులను ధనం, సౌభాగ్యం, ఆరోగ్యం, యశస్సునిమ్మని ప్రార్థించాలి. ఆవునేతితోను, మంచి నువ్వుల నూనెతోను వెలిగించే దీపాలు వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించి, ఆహ్లాదకరంగా మారుస్తాయి. దీనివలన చక్కని ఆరోగ్యం సమకూరుతుంది. రాత్రివేళ చలిమిడిని

చంద్రుడికి సమర్పించి స్వీకరిస్తారు. వైద్యపరంగా కూడా ఇది అనేక గర్భాశయ సమస్యలను పోగొడుతుందని చెబుతారు.

ఈ రోజు శివాలయంలో ఈశ్వరునికి నవరసాలతో, పంచామృతాలతో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. తదనంతరం లక్షపత్రి పూజ, లక్ష కుంకుమార్చనలను నిర్వహిస్తారు. ధాత్రీపూజను కూడా చేస్తారు. తులసి మొక్కకి, ఉసిరి చెట్టుకి వివాహం చేసినట్లయితే లక్ష్మీనారాయణుల ఆశీర్వచనం లభిస్తుంది. ఉసిరి చెట్టు లభ్యం కాకపోతే కనీసం ఉసిరి కొమ్మనైనా తులసి కోటలో ఉంచి పూజిస్తే మంచిది. ఈ రోజు సాయంత్రం సంధ్యాసమయంలో శివాలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తారు. ఎండు గడ్డితో తాడును తయారు చేసి ఆలయం ముంగిట తోరణంగా అమర్చి దానిని ఆవునేతి దీపంతో వెలిగిస్తారు. పార్వతీపరమేశ్వరులను పల్లకిలో నుంచి ఈ తోరణం నుండి మూడు సార్లు ప్రదక్షిణలు చేస్తారు. అనేక జన్మల నుండి చేసిన పాపాలన్నీ పటాపంచలయి ఆనందం కలుగుతుందని శాస్త్ర వచనం.



కార్తీక పౌర్ణమి నాడు శంకరుడు త్రిపురాసురుణ్ణి వధించిన రోజు. అందువలన ఈరోజు త్రిపుర పూర్ణిమ అని కూడా పిలుస్తారు. కార్తీక పురాణం ప్రకారం ఈరోజు దీపదానం, సాలగ్రామదానం చేయాలి. పేదలకు తమకు తగినంత దానధర్మాలు చేయాలి. ఇవి కోటిరెట్లు ఫలితాన్నిస్తాయని నమ్మిక. అగ్ని తత్వాత్మకమైన కృత్తికా నక్షత్రంలో చంద్రుడు సంచరించే ఈ పౌర్ణమి రోజు అరుణాచల క్షేత్రంలో అఖండ జ్యోతిని వెలిగిస్తారు. ప్రాముఖ్యత గలిగిన ఈ జ్యోతి దర్శనానికి అనేక రాష్ట్రాల నుండి భక్తులు వస్తారు.

అత్యంత ఫలప్రదమైన ఈ కార్తీక పౌర్ణమిని భక్తి శ్రద్ధలతో ఆచరించి మన సంప్రదాయ విధి విధానాలను ముందు తరాలకు పదిలపరచి లోక క్షేమానికి కృషి చేద్దాం. మన హిందూ పండుగలలో, ఉత్సవాలలో ఆధ్యాత్మిక తత్వంతో పాటు లోక కళ్యాణము, ప్రకృతి పరిరక్షణ వంటి విజ్ఞాన విషయాలు కూడా దాగి వుంటాయి.

**సర్వేజనాః సుఖినో భవంతు**



# నామాల సామీ

**నామాలసామీ దండాలయా**
**మమ్మేలు నీకు పది వేలయా**
**శంఖమ్ము, చక్రమ్ము అమరేనయా**
**నీ వజ్ర కిరీటం బహు బాగుందయా**
**ఏడు కొండలు నీకు వాసమయ్యా**
**మాకెన్నెన్ని జన్మాల బంధమయ్యా**
**శ్రీదేవి మాకు సిరులిచ్చునా?**
**అలమేలు మంగా తోడుండునా?**
**తిరుమల గిరులు నీవి**
**సిరి సంపదలు నీవి**
**శుభమైన నామమ్ము మెరసేనయా**
**నీ అభయహస్తం**
**మాదేనయా**
**జన్మ జన్మాలకు**
**తరగని సంపదయ్యా**
**నీ అభయహస్తం**
**మాకు సహస్రం**
**కష్టాల కడతేర్చు**
**కమనీయ హస్తం**

— అమరవాది వైజయంతిమాల

## (కబీర్ దాస్ భార్య)

# మహాపతివ్రత లూయీ

– మందరపు వి.జి.శంకరాచారి



**కబీర్ దాసు రామభక్తుడే కాక, అతిథులకు, సత్పురుషులకు తనకు చేతనైనంతలో ఆతిథ్యమిచ్చి వారినుండి ఆశీర్వచనాలు తీసుకుంటూ ఉండేవాడు. కబీర్ దాసు తన జీవితంలో రామనామాన్ని ఎన్నడూ విడువలేదు. నిరంతరం రాముడిపై 'దోహాలు' పాడుతూ భక్తి పారవశ్యంలో మునిగిపోయేవాడు. అతడి భార్య 'లూయీ' గొప్ప పతివ్రతయే కాకుండా సద్గుణశీలి. ఏనాడూ భర్త మాటని జవదాటేది కాదు.**

**ఈమె కూడా సత్పురుషులకు ఆతిథ్యమివ్వడమంటే ఎంతగానో ఇష్టపడేది. అమిత ఉత్సాహంగా రుచికరంగా వండి పెట్టేది. భార్య తనకి బాగా సహకరించడం వలన కబీర్ దాసు ఏనాడూ అతిథులకు ఆతిథ్యమివ్వడంలో వెనకడుగు వేసేవాడు కాదు. ఉత్తమురాలైన భార్య తనకు లభించడం పూర్వజన్మలో చేసుకున్న అదృష్టంగా భావించేవాడు.**

ఈ విధంగా సత్పురుషులకు తమ ఇంట ఆతిథ్యమివ్వటం ఆ దంపతులకు అమితానందంగా ఉండేది.

ఒకరోజు కబీర్ దాసు ఇంటికి పదిమంది వరకు సత్పురుషులు సాయం సమయంలో రావడం జరిగింది. వారితో పురాణగాథలు, రామకథలను చర్చిస్తూ... భార్య లూయీని పిలిచి ''ఈరోజు మన ఇంట ఆతిథ్యం స్వీకరించడానికి పదిమంది వరకూ సత్పురుషులు వచ్చారు. వారందరికీ భోజన ఏర్పాట్లు చేయి. బహు కమ్మగా వంటలు వండి వారికి ఆతిథ్య మివ్వాలి'' అని లోపల గదిలో ఉన్న భార్య దగ్గరకు వెళ్ళి చెప్పాడు.

భర్త మాటను జవదాటని లూయీ ''తప్పనిసరిగా అందరికీ వండి పెడతాను. ఈ సాయంత్రం వేళ మీరందరూ బయటకు వెళ్ళి ఈ గ్రామంలో కీర్తి గడించిన దేవాలయాలను దర్శించి రండి'' అంది.

ఆమె మాటలకు సంతోషించిన కబీర్ దాసు సత్పురుషులతో కలిసి దేవాలయాలు సందర్శించడానికి బయటకు వెళ్ళాడు.

కబీర్ దాసు వెళ్ళిన వెంటనే లూయీ వంటగదిలోకి వెళ్ళి వండటానికి సరుకులు తగినట్లుగా ఉన్నాయా! లేదా అని చూసింది. ఉప్పు తప్ప మరేమీ లేదాయె. 'ఇప్పుడేమి చేయాలి' అనుకుంది లూయీ.

అయితే తాము నివసిస్తున్న వీధిలోని కిరాణా వ్యాపారం చేస్తున్న సుబ్బిశెట్టి గుర్తుకు వచ్చాడు. వెంటనే కిరాణా దుకాణానికి వెళ్ళి ఆ వ్యాపారితో ఈవిధంగా మాట్లాడింది.

''శెట్టి గారూ నేనెవరో మీకు తెలుసు కదా. రామభక్తుడైన కబీర్ దాసు గారి ఇల్లాలిని. నేడు మా ఇంట ఆతిథ్యం స్వీకరించడానికి పదిమంది వరకు సత్పురుషులు వచ్చారు. వారందరి కొరకు వంట చేయమని మావారు చెప్పారు. అయితే ఇంట్లో సరుకులు అయిపోయాయి. చేతిలో చిల్లిగవ్వ లేదు. సత్పురుషులకు ఆతిథ్యమివ్వకపోతే మావారు కృంగిపోతారు. నేను గానీ, నా కొడుకు గానీ, మా వారు కానీ భోజనం చేయకపోయినా కృంగిపోము. పస్తులు ఉంటాము. అలాగని ఇంటికి వచ్చిన అతిథులకి అన్నం పెట్టకుండా పంపించడం అధర్మం అవుతుంది. కావున మీరు సరుకులను అరువుగా ఇవ్వమని వేడుకుంటున్నాను. సరుకులతో పాటు కాస్త ధనమును కూడా ఇస్తే... మొత్తం అరువుగా తీసుకున్న సొమ్మును మావారు తప్పకుండా తీర్చివేస్తారు'' అంది.

లూయీ అడిగిన దానికి వర్తకుడు నవ్వి ''చూడమ్మా! నీ భర్త ఇరవై నాలుగు గంటలూ రామనామ జపం చేస్తూ... జోలె పట్టుకుని ఊరూరా తిరుగుతూ బిచ్చమెత్తుకుంటూ జీవిస్తాడు. అటువంటి వానికి నేను అరువు ఎలా ఇవ్వగలను? ఒకవేళ ఇచ్చినా ఎలా తీర్చగలడు? సందేహం లేదు. మీవారు ఒక పైసా కూడా తీర్చలేడు'' అన్నాడు.

''అంత మాటనకండి. సత్పురుషులు ఆకలితో వెళ్ళిపోవడం మహాపాపకార్యం. కాబట్టి ఏదో ఒకలాగా కిరాణా సరుకులు ఇచ్చి మీరు పుణ్యం కట్టుకోండి. మమ్ములను మాట నిలబెట్టుకునే

వారిగా చేయండి'' అంది.

కబీర్ దాసు భార్య లూయియా మహా పతివ్రతయే కాదు– గొప్ప అందగత్తె. కనులు మరల్చి చూడడం సాధ్యపడదు. ఏ మగాడైనా అటువంటి అందగత్తె తనకు భార్య కాలేదని అసూయ పడతాడు. అందుకే ఆ వర్తకుడు ఆమె అవసరాన్ని తనకు అవకాశంగా మార్చుకోవాలని అనుకున్నాడు.

ఆ ఉద్దేశంతోనే వర్తకుడు ఆమెతో ఇలా అన్నాడు. ''సరే లూయియా! నీవు ఒక పని చేస్తే సరుకులతో పాటు కొంత ధనమును కూడా ఇస్తాను. నేను చెప్పిన పని చేస్తావా?''

లూయియా మరో ఆలోచన లేకుండా ''తప్పకుండా చేస్తాను'' అంది.

వర్తకుడు ''సరే లూయియా! నీకు కావలసిన సరుకులు మరియు ధనమును కూడా ఇస్తున్నాను. ఇవన్నీ తీసుకువెళ్ళి నీవు సత్పురుషులకు అన్నం వండిపెట్టు. అయితే సత్పురుషులు వెళ్ళిపోయిన తర్వాత రాత్రికి నీవు నా దగ్గరకు వచ్చి పడక సుఖాన్ని అందించాలి'' అన్నాడు.

వర్తకుడి కోర్కె విని నిరుత్తరురాలైంది లూయియా. ఒక్కక్షణం ఆలోచనలో పడింది.

సత్పురుషులకు అన్నం పెట్టి సంతృప్తిగా వారిని పంపడమా! లేక తన శీలాన్ని కాపాడుకుని భర్తకు నిజం చెప్పి బాధపెట్టడమా! లిప్తకాలం పాటు సందిగ్ధంలో పడిన లూయియా తర్వాత ఒక ఆలోచనకు వచ్చింది. తన శీలం కన్నా... సత్పురుషులకు భోజనం పెట్టడమే సరైనదని అనుకుంది.

''నీవు చెప్పినట్లే రాత్రి నీ దగ్గరకు వస్తాను'' అని చెప్పి తనకు కావలసిన సరుకులను తీసుకుని ఇంటికి వెళ్ళింది.

ఆ రోజు రాత్రి లూయియా తాను తెచ్చిన సరుకులతో షడ్రసోపేతమైన విందును సత్పురుషులకు ఇవ్వగలిగింది.

తన ఇంటికి వచ్చిన సత్పురుషులు తృప్తిగా భోజనం చేసిన తర్వాత కబీర్ దాసు వారిని కొంతదూరం దిగబెట్టి ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పుడు హోరున వర్షం కురుస్తోంది. ఇంతలో లూయియా రోదిస్తూ ఒక మూల కూర్చుని ఉంది.

భార్య దగ్గరకు వచ్చిన కబీర్ దాసు ''సత్పురుషులందరికీ మంచి భోజనాన్ని ఆదరంగా పెట్టావు. ఇంత మంచి పని చేసినందుకు సంతోషపడవలసింది పోయి ఏడుస్తావెందుకు'' అని అడిగాడు. అప్పుడు లూయియా జరిగిన విషయాన్నంతా చెప్పింది.

అది విన్న కబీర్ దాసు ''చర్మము, రక్తము, మాంసము, కొవ్వు, అస్థి, శుక్ల, మేధ ఈ ఏడింటితో తయారయిన శరీరాన్నా వ్యాపారి కోరుకున్నది. ఈ శరీరం ఎప్పటికైనా నశించేదే కానీ, శాశ్వతంగా ఉండిపోయే అందం కాదన్న విషయాన్ని గుర్తించలేని అజ్ఞాని. ఎంతటి అజ్ఞాని అయినా నా ఇంటికి వచ్చిన సత్పురుషులకు అన్నం పెట్టడానికి సహకరించిన గొప్ప సహాయకుడు. కాబట్టి అతడు కోరుకున్నది ఇవ్వవలసిందే. తప్పదు. సరే. అతడి దగ్గరకు వెళదాం పద'' అన్నాడు.

ఆ మాటలు విన్న లూయియా ఆశ్చర్యపోయింది. మహా పతివ్రత కనుక భర్త మాటలకు విలువనిచ్చి అతడి వెంట నడిచింది.

హోరున వర్షం కురుస్తోంది.

తన భార్య లూయియా తడిసిపోయి వర్తకుడి దగ్గరకు వెళితే అనురక్తి కలగదేమోనన్న ఉద్దేశ్యంతో కబీర్ దాసు ఆమె శరీరం తడవకుండా గొడుగు పట్టుకుని వర్తకుని ఇంటికి వెళ్ళాడు. వర్తకుడి ఇల్లు కొంతదూరం ఉండగా ఒక చెట్టు నీడన నిలిచి ఉంటానని చెప్పి తన భార్య లూయియాకి... తను నిరీక్షిస్తూ ఉందామనుకున్న ప్రదేశం చూపించి ఆ వర్తకుడి ఇంటి దగ్గర భార్యను వదిలివేసి వెనుదిరిగాడు.

లూయియా వర్తకుడి ఇంటి తలుపు తట్టింది. ఆ రాత్రి సమయంలో లూయియా అన్న మాట ప్రకారం తన దగ్గరకు రావడం చూసి ఆశ్చర్యపోయాడు కిరాణా వ్యాపారి.

ఆమెను చూసి 'నీవు ఇక్కడకు వస్తున్నావని నీ భర్తకు చెప్పావా?' అని అడిగాడు.

'నా భర్తకు చెప్పాను. తనే నన్ను ఇక్కడకు తీసుకుని వచ్చారు. మీ కోరిక తీరిపోయినంత వరకు ఈ సందు మలుపులో ఒక చెట్టు క్రింద నా రాక కోసం నిరీక్షిస్తుంటానని చెప్పి వెళ్ళారు' అంది.

లూయియా ఆ విషయం చెప్పగానే వర్తకుడిలో పరివర్తన కలిగింది. అప్పుడతడు ఆమె కాళ్ళపై పడి ''తల్లీ నన్ను క్షమించు. మహా పతివ్రతవైన నీ పొందు నేను కోరడం మహాపాతకం. మహాభక్తుడైన కబీర్ దాసుకి ద్రోహం చేయాలనుకోవడం క్షమించరాని నేరం. పాపం. నన్ను క్షమించు తల్లీ'' అంటూ ఆమె కాళ్ళపై పడి కన్నీరు మున్నీరుగా విలపించాడు.

వర్తకుడిలో వచ్చిన పరివర్తనకు విస్తుపోయింది లూయియా. ఆమె ఇంకా ఆశ్చర్యం నుండి తేరుకోకముందే వర్తకుడు ఆమెతో ''నాకు ఇక ఆధ్యాత్మిక గురువు కబీర్ దాసు గారే. ఆయన శిష్యుడిగా నా జీవితాన్ని కొనసాగిస్తాను తల్లీ. నా కున్న ఆస్తిపాస్తులన్నింటినీ దాన ధర్మాల కోసం వినియోగిస్తూ ఉంటాను. నన్ను క్షమించమని చెప్పమ్మా'' అంటూ ఆమెతో కలిసి చెట్టు దగ్గర తన భార్య లూయియా గురించి నిరీక్షిస్తున్న కబీర్ దాసు దగ్గరికి వెళ్ళి అతడి కాళ్ళపై పడి తనని క్షమించమని కోరాడు. తనని శిష్యుడిగా చేసుకోమని ప్రార్థించాడు.

అతడి ప్రార్థనను సౌహార్ద్రంతో అంగీకరించాడు కబీర్ దాసు. అటుపిమ్మట కిరాణా వ్యాపారి కబీర్ దాసు ముఖ్య శిష్యుడుగా మారి తన యొక్క ఆస్తులన్నింటినీ దానం చేసి గొప్ప శిష్యుడనిపించుకున్నాడు.

★★★

# వాక్కు మౌనం, మనో మౌనంతో

# ధ్యానం చేయాలి

ద్వాపరయుగం ఇంకా కొద్ది రోజులలో ముగిసిపోయి కలియుగం రాబోతుందనగా ఒకరోజు శ్రీకృష్ణుడు బలరాముడితో– "అవతార సమాప్తి జరిగిపోతుంది. యదుకులం నాశనం అయిపోతుంది. మీరు తొందరగా ద్వారకా నగరమును విడిచి పెట్టెయ్యండి" అని చెప్పడాన్ని ఉద్ధవుడు విన్నాడు.



అతడు శ్రీకృష్ణ భగవానుడికి అత్యంత ముఖ్య సఖుడు మరియు పరమ ఆంతరంగిక విశేష భక్తుడు. అతడు కృష్ణుడి దగ్గరకు వెళ్ళి "కృష్ణా! మేము నీతో కలిసి ఆడుకున్నాము. పాడుకున్నాము. అన్నం తిన్నాము. సంతోషంగా గడిపాము. ఇలాంటి కృష్ణావతారం ముగిసిపోతుంది అంటే విని నేను తట్టుకోలేకపోతున్నాను. నిన్ను విడిచి నేను ఉండలేను. కాబట్టి నా మనస్సు శాంతించేటట్లు నిరంతరమూ నీతో ఉండేటట్లు నాకేదైనా ఉపదేశం చేయి" అన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణపరమాత్మ కొన్ని అద్భుతమైన విషయములను ఉద్ధవుడితో ప్రస్తావన చేశాడు.

ఇది మనమందరం కూడా తెలుసుకుని జీవితంలో పాటించవలసిన శ్రీకృష్ణ పరమాత్మ చిట్టచివరి ప్రసంగం. దీని తర్వాత ఇంక కృష్ణుడు లోకోపకారం కోసం ఏమీ మాట్లాడలేదు. ఇది లోకమును ఉద్ధరించడానికి ఉద్ధవుడిని అడ్డుపెట్టుకుని చెప్పాడు.

"ఉద్ధవా! నేటికి ఏడవరాత్రి కలియుగ ప్రవేశం జరుగుతుంది. ఏడవరాత్రి లోపల ద్వారకా పట్టణమును సముద్రము ముంచెత్తుతుంది. సముద్ర గర్భంలోకి ద్వారక వెళ్ళిపోతుంది. ద్వారకలో ఉన్న వారందరూ మరణిస్తారు. తదనంతరం



కలియుగం ప్రవేశిస్తుంది.

కలియుగం ప్రవేశించగానే మనుష్యులయందు రెండు లక్షణములు బయలుదేరుతాయి. ఒకటి అపారమైన కోర్కెలు. రెం డు విపరీతమైన కోపం. ఎవ్వరూ కూడా తన తప్పు తాను తెలుసుకునే ప్రయత్నం కలియుగంలో చేయరు.

కోర్కెల చేత, అపారమైన కోపము చేత తమ ఆయుర్దాయమును తాము తగ్గించుకుంటారు. కోపము చేతను, అపారమైన కోర్కెల చేతను తిరగడం వలన వ్యాధులు వస్తాయి. వీళ్ళకు వ్యాధులు పొటమరించి ఆయుర్దాయమును తగ్గించి వేస్తాయి.

కలియుగంలో ఉండే మనుష్యులకు రాను రాను వేదము ప్రమాణము కాదు. కోట్ల జన్మల అదృష్టము చేత వేదము ప్రమాణమని అంగీకరించగల స్థితిలో పుట్టిన వాళ్ళు కూడా వేదమును వదిలిపెట్టేసి తమంత తాముగా పాషండ మతములను కౌగలించుకుని అభ్యున్నతిని విడిచిపెట్టి వేరు మార్గములలో వెళ్ళిపోతారు.

అల్పాయుర్దాయముతో జీవిస్తారు. రాజయోగం చేయడం మరచిపోతారు. తద్వారా బ్రహ్మ యోగం అనబడే క్రియా యోగం లేదా నేనున్న స్థితికి చేర్చే లయ యోగం ఒకటి ఉందనేది తెలుసుకునే ప్రయత్నం చేయరు. ఆడంబరాలకు ప్రాధాన్యత నిస్తారు. ఉపవాసములు తమ మనసును సంస్కరించుకోవడానికి, ఆచారమును తమంత తాము పాటించడానికి వచ్చాయి. రాను రాను కలియుగంలో ఏమవుతుందంటే ఆచారములను విడిచి పెట్టేయడానికి ప్రజలు ఇష్టపడతారు.

ఆచారం అక్కర్లేదనే పూజలు ఏమి ఉంటాయో వాటియందు మక్కువ చూపిస్తారు. వాటి వలన ప్రమాదము కొని తెచ్చుకుంటున్నామని తెలుసుకోరు. అంతశ్శుద్ధి ఉండవు. చిత్తశుద్ధి ఏర్పడదు.

మంచి ఆచారములు మనస్సును సంస్కరిస్తాయి అని తెలుసుకోవడం మానివేసి ఏ పూజ చేస్తే, ఏ రూపమును ఆశ్రయిస్తే ఆచారం అక్కర్లేదని ప్రచారం ఉంటుందో అటువైపుకే తొందరగా అడుగు వేస్తారు. కానీ దానివలన తాము పొందవలసిన స్థితిని పొందలేము అని తెలుసుకోలేకపోతారు.

ఇంద్రియములకు వశులు అయిపోతారు. రాజులే ప్రజల సొమ్ము దోచుకుంటారు. ప్రజలు రాజుల మీద తిరగబడతారు. ఎవరికీ పాండిత్యమును బట్టి, యోగ్యతను బట్టి గౌరవం ఉండదు. కలియుగంలో ఏ రకంగా ఆర్జించాడన్నది ప్రధానం కాదు. ఎంత ఆర్జించాడన్నది ప్రధానం అవుతుంది.

ఎవరికి ఐశ్వర్యం ఉన్నదో వాడే పండితుడు. భగవంతుని పాదములను గట్టిగా పట్టుకుని తరించిన మహాపురుషులు ఎందరో ఉంటారు. అటువంటి మహాపురుషులు తిరుగాడిన ఆశ్రమములు ఎన్నో ఉంటాయి.

కలియుగంలో ప్రజలందరూ గుళ్ళచుట్టూ తిరిగేవాళ్ళే కానీ, అటువంటి మహాపురుషులు తిరుగాడిన ఆశ్రమాల సందర్శనం చేయడానికి అంత ఉత్సాహమును చూపరు. అటువంటి ఆశ్రమములలో కాలు పెట్టాలి. అటువంటి మహాపురుషుల మూర్తులను సేవించాలి.

కానీ అక్కడకు వెళ్ళకుండా హీనమైన భక్తితో ఎవరిని పట్టుకుంటే తమ కోర్కెలు సులువుగా తీరగలవు అని ఆలోచన చేస్తారు. ఈశ్వరుని యందు భేదమును చూస్తారు. కాబట్టి నీకు ఒక మాట చెపుతాను. ఈ వాక్యమును నీవు బాగా జ్ఞాపకం పెట్టుకో. ఇంద్రియముల చేత ఏది సుఖమును ఇస్తున్నదో అది అంతా డొల్ల. అది నీ మనుష్య జన్మను పాడు చేయడానికి వచ్చినదని గుర్తు పెట్టుకో. దీనినుంచి దాటాలని నీవు అనుకున్నట్లయితే ఇక్కడి నుండి బదరికాశ్రమమునకు వెళ్ళిపో.

కలియుగంలో గాని ఏ యుగంలో కాని నా స్మరణ శ్వాసను గట్టిగా పట్టుకోవడం నేర్చుకో. భజన చేయడం విడిచిపెట్టకు. నీ దారి నా స్మరణ దారి కావాలి. నా నామస్మరణ దారియే నా దగ్గరికి నిన్ను చేరుస్తుంది. నువ్వు చేసే భక్తి సేవలో ప్రతి భజన క్రియ లోనూ నేను ఉన్నాను. వుంటాను. ఇది విశ్వసించు ఉద్ధవా. ప్రయత్న పూర్వకంగా కొంతసేపు మౌనంగా ఉండడానికి ప్రయత్నించు. మౌనము, జపము, ధ్యానం, ఇంద్రియ నిగ్రహం, వాక్ మౌనం, మనో మౌనంతో ధ్యానంలో కూర్చొనుట, నన్ను సేవించుట మొదలగు పనులను ఎవరు పాటించడం మొదలుపెట్టారో వారు మెట్లెక్కడం మొదలుపెడతారు.

ఇది శ్రీకృష్ణ పరమాత్మ ఉద్ధవుడికి ఇచ్చిన చివరి సందేశం. ఈ సందేశం ఉద్ధవుడికి మాత్రమే అనుకుంటే పొరపాటు. ఇది మనందరి కోసం పరమాత్మ చెప్పిన సత్యం.



# బాధ్యతలను విస్మరించడం భగవంతుడికైనా నేరమే

> ఇది కర్మభూమి. మానవుడు కర్మాచరణ పరతంత్రుడు. ఈ లోకంలో ఎవ్వడైనా ఎంతకాలమైనా జీవించాలని కోరుకోవచ్చు. ఎక్కువకాలం బ్రతకాలని కోరడం తప్పు కాదు. కాని అలా బ్రతకడానికి తాను తనకు విద్యుక్తమైన కర్మను ఆచరించడం ద్వారానే యోగ్యతను పొందుతారు. అసలు ఈ జగత్తంతా కర్మ పరతంత్రము. భగవానుడు దేహాన్నిచ్చింది, బుద్ధినిచ్చిందీ తనకు విహితమైన, తన బ్రతుకుకు, సర్వ సమాజ శ్రేయస్సుకు కారణమైన కర్మను క్రమం తప్పకుండా ఆచరించడానికే.

కర్మ అనేది అనేక విధాలుగా ఉంది. ఒక్కొక్క జాతికి ఒక్కొక్క కర్మ నియతం చేయబడింది. లోక వ్యవహారంలో కూడా ప్రతి ఒక్కడు తనకు నచ్చిన, తాను చేయగలిగిన కర్మను ఎంచుకొని దాన్ని సక్రమంగా నిర్వర్తించటం ద్వారానే సమాజంలో తన ఉనికిని కాపాడుకుంటున్నాడు. ఈనాడు ప్రతి వ్యక్తికీ ఒక్కొక్క వ్యాపకం తప్పనిసరిగా ఉంటోంది. దాన్ని కొందరు తమ ధర్మంగా నిర్వహిస్తూ ఉండటం కూడా మనం చూస్తూ ఉంటాం.

కొందరు తాము విద్యావంతులై ఇతరులను విద్యావంతులను చేసే అధ్యాపక కర్మను చేపడతారు. మరికొందరు తాము తినగలగడమే కాక సమాజం సుభిక్షంగా ఉండేలా పంటలు పండించే పనిని చేపడతారు. కొందరు వస్తు వినిమయ రూపమైన వ్యాపారం ఇలా ఏదో ఒక కర్మను ప్రతి ఒక్కరూ ఎంచుకుంటూనే ఉండటం మనం చూస్తున్నాం. కర్మలను సాధారణంగా రెండు రకాలుగా చెప్పవచ్చు. సర్వమానవులు, ప్రాణికోటి తప్పకుండా దైనందినంగా ఆచరించే స్నాన, పాన, భోజన, శయనాది

కర్మలు ఇవి అంద రికీ సమానమే. వీటిని ఆచరించినందువల్ల విశేష సామాజిక ప్రయోజనం లేకపోయినా ఆచరించకపోతే మనకి నష్టం మాత్రం ఉంటుంది. వీటిని నిత్యకర్మలని అంటారు. ఇవేకాక వైదిక కర్మలు, లౌకిక కర్మలు అని రెండు రకాలు ఉన్నాయి. ఏదైనా ప్రయోజనాన్ని ఆశించి మనం చేసే పనులు 'కామ్యకర్మలు'. ఇవి కూడా వైదిక కర్మలు, లౌకిక కర్మలు అని రెండు రకాలుగా ఉన్నాయి. వర్షాలు, పశువృద్ధి, ఐశ్వర్య వృద్ధి, ఆరోగ్యం మొదలైన ప్రయోజనాలాశించి చేసే యజ్ఞ యాగాదులు వైదిక కర్మలంటారు. ఇక బ్రతుకుతెరువు కోసం వ్యవసాయం, వ్యాపారం, అధ్యాపనం ఇలా వారి వారి ఇష్టాన్ని బట్టి, సామర్థ్యాన్ని బట్టి 'వృత్తి'గా ఏర్పరచుకొన్న కర్మలు కూడా బ్రతకడం అనే ఒక ప్రయోజనాన్ని ఆశించి చేసేవి కనుక వీటిని ''కామ్యకర్మ'' లంటారు. ఇవి కాక కొన్ని ప్రత్యేక సందర్భాలలో చేసే కొన్ని పనులు ''నైమిత్తిక కర్మ''లంటారు. ఇవన్నీ మనం ఆచరిస్తూనే ఉంటాం. ఏ దశలోనూ వీటిని విడిచిపెట్టం. విడిచిపెట్టరాదని శాస్త్రం నియమిస్తున్నది.

ఈ కర్మలనే శాస్త్రం 'ధర్మం' అనే పేరుతో వ్యవహరిస్తోంది. ఒకనాడు మనం ఆచరిస్తే మనలను ధరించే (నిలిపే) దానిని ధర్మం అంటారు. ఒక గొడుగును మనం చేత్తో ఎత్తి పట్టుకొన్నప్పుడు అది మనలను ఎండ వానలనుండి రక్షిస్తుంది. ఆ గొడుగు మనకు బరువని అనుకొన్నప్పుడు దానివల్ల పొందవలసిన ప్రయోజనాన్ని మనం పొందలేం కదా. ధర్మమైనా అంతే. దాన్ని మనం సక్రమంగా నిర్వర్తిస్తే అది మనలను కాపాడుతుంది. మనకు ఏ నష్టం కలగకుండా మనలను ధరిస్తుంది. కనుకనే అది ధర్మం. ఈ ధర్మాన్ని ఆచరించడంలో మానవుడు ఏ దశలోనూ ఏమరుపాటు చెందకూడదు. ఏమరుపాటు వల్ల ఎంతో అనర్థం కలుగుతుంది. సూర్యుడు, చంద్రుడు, నీరు, నిప్పు, గాలి, భూమి ఇవన్నీ తమకు నియతమైన పనిని సక్రమంగా అవి చేస్తున్నాయి కనుకనే మనం బ్రతకగలుగుతున్నాము. వాటి ధర్మాన్ని అవి పాటిస్తున్నాయన్నమాట.

గాలి వీచకపోతే, సూర్యచంద్రులు పరిభ్రమించకపోతే, నీరు ప్రవహించకపోతే, తడపకపోతే, నిప్పు కాల్చకపోతే, భూమి బీజాలను మొలకెత్తించకపోతే, ప్రాణికోటిని ధరించకపోతే మన బ్రతుకేమౌతుంది? ఈ విశ్వం గతేమౌతుంది? విద్యుక్త కర్మాచరణం ప్రతి వానికీ అనివార్యం. దీన్నే శ్రీకృష్ణభగవానుడు బోధిస్తున్నాడు.

దుష్టబుద్ధులైన దుర్యోధనాదులను దునుమాడవలసిన కర్తవ్యం పాలకునిగా అర్జునునికి ఉన్నా, దానిని విస్మరించాడు. అలాంటి ధర్మభ్రష్టుని స్వధర్మోన్ముఖుని చేయడానికి శ్రీకృష్ణుడు తననే దృష్టాంతముగా చెప్పవలసి వచ్చింది. కర్మ పరతంత్రమైన మానవ జీవన చక్రాన్ని గురించి లెస్సగా బోధించి కర్మాచరణం లేకుండా ఏ ప్రాణీ ఒక్క క్షణం కూడా మనుగడ సాగించలేదని, ఒకవేళ నేను కర్మాచరణము చేయనని భీష్మించుకుని ఎవ్వడైనా కూర్చుంటే వాడికి అసలు జీవనయాత్ర సాగనే సాగదని నిరూపించి స్వధర్మంగా కర్మాచరణ ఎంత అవసరమో నొక్కి వక్కాణించాడు.



అంతటితో ఊరుకోలేదు. ప్రతి కర్మలోనూ లోక దృష్ట్యా కొంత మంచి, కొంత చెడు కూడా అంటుకొని ఉన్నట్లు అనిపించినా నా కొరకు నేను చేస్తున్నాననే భావనల వల్లనే కర్మ పాడవుతుందని, అది భగవత్సేవగా నిర్వహించదగినదే అన్న భావన ఏర్పడినపుడు కర్మనంటి ఉన్న దోషాలన్నీ తొలగిపోతాయని, 'నాది' అనే స్వార్థబుద్ధిని విడిచి 'పైవానిది' అనే భావన ప్రోది చేసుకున్నప్పుడు, ఆ కర్మయే 'యోగము' అవుతుందని బోధించాడు. జనకాదులు కర్మాచరణం చేతనే సిద్ధి పొందారని దృష్టాంతము చెప్పాడు. వాస్తవానికి సర్వలోక మహేశ్వరుడైన తనకు కర్మాచరణ ఆవశ్యకత లేనేలేదు. అయినా తాను కూడా లోక సంగ్రహార్థము కర్మను ఆచరిస్తున్నానని తననే దృష్టాంతంగా చూపెట్టాడు శ్రీకృష్ణుడు.

సాధారణంగా లోకం తీరు ఎలాంటిదంటే తమకంటే పెద్దవాడు ఏమి చేస్తే, ఎలా చేస్తే తామూ అలాగే చేయాలనే స్వభావము కలిగి ఉంటుంది కనుక తాను కర్మాచరణం మానితే తన మార్గాన్నే లోకం కూడా అనుసరించి కర్మ మాని భ్రష్టమైపోతుందనే జాలితో లోకానికి ఒక ఉత్తమ ధర్మాన్ని చూపించడానికి తాను అవసరం లేకపోయినా కర్మను మిక్కిలి జాగరూకతతో శ్రద్ధగా ఆచరిస్తున్నానని స్వామి బోధిస్తున్నాడు.

ఏ పనీ చేయకుండా సమాజంలో ఏ ఒక్కడూ బద్ధకస్తుడై ఉండకూడదు. అలాగని ఏదో ఒక పని చేయాలనే భావనతో పనికిమాలినవి, తనకు, ఇతరులకు హాని కలిగించేవి అయిన పనులను ఆచరింపరాదు. ఏ పని చేత స్వార్థ, పరార్థ, పరమార్థాలు మూడూ సిద్ధిస్తాయో అటువంటి కర్మను ఎంచుకొని నిర్వహింపవలసి ఉంటుంది. ఇదే శ్రీకృష్ణుడు లోకానికి ప్రబోధించిన ఉత్తమ సందేశం.

# మంచి నీతి కథ

**ఒకరోజు ఒక రాజు రాజ్యంలో చాటింపు వేయించాడు. ఆ చాటింపు ఏంటంటే "రేపు రాజభవనం యొక్క ప్రధాన ద్వారం తెరుచుకున్నప్పుడు, రాజ్య ప్రజలు ఏ వస్తువును తాకితే ఆ వస్తువును పొందుతార"ని ఆ చాటింపు సారాంశం. ఈ ప్రకటన విన్న పౌరులందరూ రాత్రి నగర ద్వారం దగ్గర కూర్చుని ఉదయం కోసం వేచి ఉన్నారు.**



బంగారాన్ని ముట్టుకుంటాను అని కొందరు, విలువైన ఆభర ణాలు ముట్టుకుంటానని మరికొందరు. గుర్రాలంటే ఇష్టమని కొందరు, ఏనుగులను ముట్టుకుంటామని కొందరు, ఆవులను ముట్టుకుంటానని మరికొందరు అనుకున్నారు.

ఆ సమయంలో రాజభవనం ద్వారం తెరుచుకోవడంతో అం దరూ తమకు ఇష్టమైన వస్తువును తాకేందుకు పరుగులు తీశారు. ప్రతి ఒక్కరూ తమకిష్టమైన వస్తువును ముందుగా తాకాలని తొందరపడ్డారు. నాకంటే ముందు మరొకరు తమకు ఇష్టమైన వస్తువును ముట్టుకుంటారేమో అని అందరూ భయపడ్డారు. రాజు తన సింహాసనం మీద కూర్చుని అందరినీ చూస్తూ తన చుట్టూ జరుగుతున్న సందడిని చూసి నవ్వుతూ ఉన్నాడు.

కొందరు ఒక వస్తువును, మరికొందరు మరో వస్తువును కోరారు. ఆ సమయంలో గుంపులోంచి ఒక చిన్న అమ్మాయి వచ్చి రాజు దగ్గరకు వెళ్ళడం ప్రారంభించింది. ఆ అమ్మాయిని చూడగానే రాజు ఆలోచనలో పడ్డాడు. ఈ అమ్మాయి చాలా చిన్నది, ఏదో అడగడానికి వస్తున్నదేమో అని అనుకున్నాడు. ఆ అమ్మాయి మెల్లగా రాజు దగ్గరికి వెళ్ళి తన చిన్ని చేతులతో తాకింది. ఆ అమ్మాయి రాజును తాకడంతోనే రాజుకి సంబంధించినవన్నీ కూడా అమ్మాయివే అయ్యాయి.

రాజు ఆ వ్యక్తులకు అవకాశం ఇచ్చినట్టే దేవుడు కూడా మనకు ప్రతిరోజూ అవకాశం ఇస్తాడు. కానీ మనం ప్రతిరోజూ తప్పులు చేస్తాం. భగవంతుడిని తాకడం లేదా పొందడం కాకుండా, భగవంతుడు సృష్టించిన ప్రాపంచిక వస్తువులను మనం కోరుకుంటాము. మరియు వాటిని పొందడానికి ప్రయత్నిస్తాము. కానీ దేవుడు మనవాడైతే, అతను సృష్టించిన ప్రతీదీ కూడా మనదే అవుతుంది అని మనం ఎప్పుడూ అనుకోము.

దేవుడు కూడా తల్లి లాంటివాడు. ఒక పిల్లవాడు తన తల్లిని విడిచిపెట్టి ఇతర బొమ్మలతో ఆడుకోవడం ప్రారంభించినప్పుడు, తల్లి అతనిని ఆ బొమ్మలతో ఆడుకోవడంలో నిమగ్నం చేస్తుంది. మరియు ఇతర పనులలో బిజీగా ఉంటుంది. అలాగే మనం దేవుణ్ణి మరిచిపోయి భగవంతుడు సృష్టించిన వస్తువలతో ఆడుకోవడం మొదలుపెడితే దేవుడు కూడా మన నుండి దూరంగా వెళ్ళిపోతాడు.

మనం ప్రాపంచిక భ్రమలో చిక్కుకోకుండా పరమాత్మను ఎప్పుడైతే సదా స్మరిస్తూ ఉంటాయో అప్పుడు ఆ సమస్త శాశ్వత సుఖాలకు కారణమైన భగవంతుని కృప తప్పకుండా పొందుతాము.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**
(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆర్థిక వెసులుబాటు. కొన్ని సమస్యలు ఉన్నా సంతృప్తిగా ఉంటుంది. ఈ రోజులను ప్రతిరోజు నెమరువేసుకుని కాలానుగుణంగా మసులుకొనిన చాలా సంతృప్తి కలిగి ఉంటారు. ఎవరిని నమ్మినా మోసపోగలరు. యోగ, ధ్యానం చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలతగా ఉంటుంది. ప్రక్కనే శత్రుశేషం ఉన్నది. మీరు చేయు పనులు ఎవరికి చెప్పరాదు. అప్పుడే పోటీతత్వం వస్తుంది. తక్కువగా మాట్లాడి ఎక్కువ పనులు చేసుకోండి. దూరప్రయాణములు కలిసి వచ్చును. అనారోగ్య సమస్యలు బాధించగలవు. లక్ష్మీనారాయణుల పూజలు, శివాలయ ప్రదక్షిణలు చేయండి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని సమస్యలు కళ్ళముందు ఉన్నను అన్నీ మరచి పట్టువదలని విక్రమార్కునిలాగ కార్యభారం. ఆర్థిక ఇబ్బందులు నుండి బయటకు రండి. మనసులో జంజాటములు వదలండి. చక్కని ప్లాన్‌తో సుఖమైన, ఒత్తిడిలేని విధంగా ఎదుగుదల ఉన్నది. శివారాధన చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనారోగ్యం. వ్యాపారంలో ధనాదాయం ఉన్నది. ఎవరికి ఏ విధమైన హామీలు ఇవ్వరాదు. ప్రతి విషయంలో చాకచక్యంగా తెలివిగా వ్యవహరించగలరు. ఎవరో ఎక్కడో ఇరికించుటకు అవకాశములు ఉన్నవి. శివారాధన తప్పనిసరిగా చేయండి.

## సింహరాశి

**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ధనం ఖర్చులు పెరుగును. ఏదో ఒకటి కొనాలి అనే తపన వలన అప్పులు చేయవలసి వస్తుంది. బంధుమిత్రుల కలయిక వివాహ శుభకార్యములు ఏదో ఒక పండుగ వాతావరణం ఉంటుంది. ఈశ్వరాభిషేకములు, మహన్యాస రుద్రాభిషేకం అమ్మవారి పూజలు చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు వ్యాపారానుకూలత. అర్థిక లావాదేవీలు అనుకూలించుట. ఉద్యోగం లేనివారికి ఉద్యోగం. ఎక్కడ ఏ విధమైన భరోసా పనికిరాదు. స్త్రీల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండవలసిన రోజులు. అవమానములు. జోకుగా మాట్లాడరాదు. మహన్యాస రుద్రాభిషేకములు, శనికి తైలాభిషేకం చేయించండి. నువ్వులు దానం ఇవ్వండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. నిర్లక్ష్యం పని కిరాదు. ధనాదాయమునకు కొన్ని విఘాతములు కలుగుటకు అవకాశములున్నవి. మీరు పట్టకొనిన పని కార్యరూపం దాల్చగలదు. శుభ నక్షత్రంలో పని ప్రారంభించండి. మహన్యాస రుద్రాభిషేకం చేయండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు పంతాలు పట్టుదలకు ఇది సమయం కాదు. లౌకిక భావంతో ముందుకు సాగండి. కార్యరూపం కాగలదు. ఎంత పెద్ద పని అయినా సంతృప్తినిస్తుంది. కోర్టు విషయంలో జాగ్రత్తలు పాటించండి. స్నేహితులతో బంధుమిత్రులతో చాలా తక్కువగా మాట్లాడగలరు. మహన్యాస రుద్రాభిషేకం చేయండి. అఖండ దీపారాధన చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు శత్రు విజయం ప్రతి పనిలో పట్టుదలతో సాధించగలరు. ఏ విధమైన ఆటంకములు వచ్చినా సామరస్యంతో సవరణ చేసుకొనగలరు. ఎవరిని ఎంత వరకు నమ్మాలో అంతవరకు మాత్రమే నమ్మండి. ఏకాగ్రతయే సొత్తు. మహన్యాస రుద్రాభిషేకం చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా గడ్డు రోజులు. ఎవరిని నమ్మిన మోసపోవుట జరుగును. ప్రధాన కారణం స్నేహితులు ద్వారా నష్టపోగలరు. దేవాలయ పూజలు, అధికారుల వైరం. భార్యాభర్తల మధ్య తగాదాలు పరిస్థితులు ఏమి అర్థం కావు. నవగ్రహ ఆరాధన మార్గం.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంత అనుకూలం. కొంత వ్యతిరేకం. ఏమి అర్థం కాని విధంగా ఉంటుంది. నిర్లక్ష్యంగా ఉన్న ఊపిరి పీల్చుకోనివ్వరు. ప్రతి నిమిషం జాగ్రత్తగా బాధ్యతగా ఉండవలసిన రోజులు. విశ్వాసంతో ముందుకు సాగండి. మహన్యాస రుద్రాభిషేకం చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా కనిపిస్తుంది. కాని అంత అనుకూలం గాదు. ఏ విషయంలో తొందరపాటు లేకుండా ప్రశాంతంగా నిర్ణయములు తీసుకొనిన ఎక్కడ ఇరుక్కొనరు స్వల్ప ఆదాయ వనరులు ఉన్నవి. అందుకే తొందరపడరాదు. ఈశ్వర ఆరాధన చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి

శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. చిన్న శేషుడు ఎవరు?
2. శ్రీహరి యోగ నిద్ర నుండి మేల్కొనే రోజు ఏది?
3. గోదాదేవికి మరో పేరేమిటి?
4. రఘు మహారాజు చేసిన యాగం పేరేమిటి?
5. శమీక మహర్షి కొడుకు ఎవరు?
6. శ్రవణ భక్తికి ఉదాహరణ ఎవరు?
7. జగన్మాత – భ్రమరాలను సృష్టించి ఎవరిని సంహరింప చేసింది?
8. "అష్టాంగ యోగసారం" రచించింది ఎవరు?
9. నవదుర్గలలో సప్తమం ఎవరు?
10. విష్వక్సేనుడు ఎవరి వరంతో జన్మించాడు?
11. భాగవతాన్ని ద్విపదలో వ్రాసిందెవరు?
12. శ్రీలక్ష్మీదేవిని కట్టేసిందెవరు?
13. తరిగొండ వెంగమాంబ విగ్రహం ఎక్కడ పూజలందుకుంటోంది?
14. హిరణ్యాక్షుని వధించడానికి శ్రీహరి ఎవరిని ప్రార్థించాడు?
15. అజ్ఞాతవాసంలో ధర్మరాజు పేరేమిటి?

1. ..............................
2. ..............................
3. ..............................
4. ..............................
5. ..............................
6. ..............................
7. ..............................
8. ..............................
9. ..............................
10. ..............................
11. ..............................
12. ..............................
13. ..............................
14. ..............................
15. ..............................

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. వియోగాన్ని తొలగించడం, 2. ఆంజనేయుడు, 3. లక్ష్మీదేవి, 4. పాంచజన్యం, 5. కరవీర లక్ష్మి, 6. మూడు. దేవరుణం, ఋషి రుణం, పితృ రుణం, 7. ప్రహస్తుడు, 8. తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి, 9. శ్రీకాళహస్తికి 8 కిలోమీటర్ల దూరంలో, 10. శతానందుడు, 11. శ్రీహరి, 12. హిమవంతం, 13. శ్రీకృష్ణుడు ధర్మరాజుతో, 14. ప్రతి గురువారం నాడు, 15. ఇక్ష్వాకుని కొడుకు

## సరైన సమాధానాలు రాసినవారు

1. పి. యశోద, 2. చిల్లర సీతారామారావు, 3. చింతలపాటి శివశంకరశాస్త్రి, 4. కె. శ్రీనివాస్, 5. యం. అక్షయ

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

చింతలపాటి శివశంకర శాస్త్రి



RNI No.: APTEL/2008/23122
Postal Registration No: HSE/879/2025-2027
Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month
Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



If Un Delivered Please Return to:
**SRI VENKATESHAM,**
(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq